

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM


మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 238 పేజీలు: 10+4 వెల: 8.00


**నకిలీ ఆధార్‌ను పట్టే అద్భుత వ్యవస్థ ఆవిర్భావం**


**నాగాలాండ్‌లో కల్తీ మద్యం సేవించి 19 మంది మృతి** 5



5 **భారీగా క్షీణించిన ట్రంప్ ప్రతిష్ట**

36 యేళ్లలో అత్యల్ప ప్రజాదరణ

కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతు



5 **చంద్రుడి దక్షిణ ధృవంపై చైనా, అమెరికాల ఫోకస్**



3 **ప్రశాంతంగా ముగిసిన గణేశ నిమజ్జనం**

సాఫీగా సాగేందుకు ఫలించిన పోలీసుల వ్యూహం

# ఇసిలో విభేదాల్లేవు..



శనివారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. చిత్రంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి

## 'సర్'పై ముగ్గురిది ఏకాభిప్రాయమే..

### డిక్లరేషన్‌ను సమర్థించిన సుప్రీం కోర్టు

### విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చిన ముగ్గురు ఎన్నికల కమిషనర్లు

### ఇసిఐనెట్ సమీక్షకు ప్రత్యేక కమిటీ


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే మీడియా నివేదికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం క్లారిటీ ఇచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో సమావేశమయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, కొత్త ఓటర్ల నమోదు, ఇసిఐనెట్, క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ తదితర అంశాలపై ఈసీ వివరణ ఇచ్చింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి జ్ఞానేష్ కుమార్‌తో ఇద్దరు కమిషనర్లు విభేదించినట్లు ఆంగ్లపత్రిక నివేదించింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్6లో మార్పులు, ఓటర్ల జాబితా యాక్సెస్, ఇసిఐనెట్‌పనితీరు, ఐటివిభాగంలో బాధ్యతల పునర్విభజన వంటి అంశాలపై ప్రశ్నలు వినిపించాయి. వీటి ఆధారంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు జ్ఞానేష్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఆయన రాజీనామా చేయాలని కోరుతున్నారు. సర్ ప్రక్రియపై కమిషనర్లలో అంతర్గత విభేదాలు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై ఈసీ క్లారిటీ ఇచ్చింది. 2025 జూన్ 24న సర్‌ను ప్రారంభించడం, షెడ్యూల్స్ కూడా పూర్తిగా ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగిందని తెలిపింది. ఈసీ ఆదేశాలను సుప్రీంకోర్టు కూడా సమర్థించిన విషయాన్ని కమిషన్ గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్6లో మార్పులు సర్ సమయంలో చేర్చిన డిక్లరేషన్‌పై చర్చజరిగింది. గత సర్ ఓటర్ల జాబితాలో >>2

## 'సర్' అభ్యంతరాలపై 30న ఇండియా కూటమి భేటీ

### జ్ఞానేశ్ తొలగింపునకు మరో నోటీసు సిద్ధం చేస్తున్న విపక్ష నేతలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై తమ అభ్యంతరాలను చర్చించేందుకు ఇండియా కూటమి పార్టీల నేతలు సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలో సమావేశం కానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం పెరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఇదే >>2

# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి




శనివారం హైదరాబాద్‌లోని ఐటి కారిడార్‌లో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

## ఆయన సేవలను కేంద్రం గుర్తించాలి

### అత్యున్నత పురస్కారంతో గౌరవించాలి

### దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన ఘనత మన్మోహన్‌దే

### భూసేకరణ, పునరావాస చట్టాన్ని అమలు చేసిన సాటిలేని పిఎం

### హైదరాబాద్‌లోని ఐటి కారిడార్‌లో మన్మోహన్ కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరించిన సిఎం రేవంత్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక స్థితిగతులను మార్చిన మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు అభ్యంతరమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మన్మోహన్‌సింగ్ ప్రాతినిధ్యం వహించిన రాజకీయ పార్టీని చూడకుండా, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించి వెంటనే భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ కాంస్య విగ్రహాన్ని, మన్మోహన్‌సింగ్ స్మారక పార్కును శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, దేశ ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధాన మంత్రిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. భారతదేశం గర్వించదగ్గ వ్యక్తికి రాజకీయ కారణాలతో సరైన గుర్తింపు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని, తమ పార్లమెంటు, రాజ్యసభ సభ్యులు ఈ విషయాన్ని లేవనెత్తుతారని ప్రకటించారు. దేశ ఆర్థిక శాఖమంత్రిగా ఆర్థిక రంగంలో సరళీకృత విధానాలను ఈ దేశానికి పరిచయం చేసి, విదేశీ మారక నిల్వలు 100 కోట్లు లేని పరిస్థితి నుంచి లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ లను ప్రోత్సహించి దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకువచ్చిన గొప్ప సంస్కరణవాది మన్మోహన్‌సింగ్ అని అన్నారు. విద్యా ప్రాథమిక హక్కు, సమాచార హక్కు చట్టం, పనికి ఆహార పథకం, భూసేకరణ, పునరావాస చట్టాన్ని అమలుచేసిన ఘనత మన్మోహన్‌సింగ్‌ది అని అన్నారు. నేటి జెన్ జీ, >>2



తెలంగాణ - కర్ణాటక మధ్య

# కొత్త వారధి

## రూ.185 కోట్లతో నిర్మాణం

### కృష్ణానదిపై జర్మన్ టెక్నాలజీతో విల్లు వంతెన

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచేలా కృష్ణానదిపై ఆధునిక వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం వాసునగర్ నుంచి కర్ణాటక వైపున ఉన్న శక్తినగర్ మధ్య ఈ వారధిని విల్లు ఆకృతిలో నిర్మిస్తున్నారు. జర్మనీ సాంకేతికతతో బౌస్ట్రింగ్ ఆర్చ్ విధానంలో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.185 కోట్ల అంచనా వ్యయాన్ని కేటాయించారు. దాదాపు 750 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ వంతెన పూర్తయితే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. ఈ వంతెన >>2

# నవంబరులో 'కాళేశ్వరం' పనులు



## 2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి

### డిజైన్లు, భద్రత పరిశీలించనున్న సిడబ్ల్యుసి సాంకేతిక కమిటీ

### నాణ్యతలో రాజీలేదు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండోవారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేయడంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. బేగంపేటలో కుందన్ బాగ్‌లో ఉన్న తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్‌ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చొరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు.

జాతీయ ఆనకట్టల భద్రతాసంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని జరుగుతుంది అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారుచేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీముందు ఉంచనున్నట్లు మంత్రి >>2



# మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

## 28 జిల్లాల్లో 30° దాకా నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో వాతావరణం మారిపోతోంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ పూర్తిగా ముగిసిందని వాతావరణ శాఖ వెల్లడించింది, వర్షాలు కూడా దాదాపుగా ముగిసినట్లేనని ప్రముఖ వాతావరణ నిపుణుడు, తెలంగాణ వెదర్‌మ్యాన్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు గణనీయంగా తగ్గిపోయి, పొడి వాతావరణంతో పాటు >>2

ఎయిర్‌పోర్టు తరహాలో

# 13 కొత్త బస్టాండ్‌లు

### వాణిజ్య కార్యకలాపాల కేంద్రాలుగా అభివృద్ధి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచే దిశగా టీజీఎస్‌ఆర్టీసీ కీలక ప్రణాళికలు చేపట్టింది. రాష్ట్రంలోని 13 ప్రాంతాల్లో ఆధునిక సదుపాయాలతో కొత్త బస్టాండ్లను నిర్మించేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటివరకు సాధారణ బస్సు షెల్టర్లుగా ఉన్న ప్రాంతాలను.. ప్రయాణికులకు అవసరమైన అనేక సౌకర్యాలు ఒకే చోట లభించేలా అభివృద్ధి చేయడమే



లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త బస్టాండ్లను కేవలం బస్సులు నిలిపే ప్రదేశాలుగా కాకుండా.. వాణిజ్య కార్యకలాపాలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని ఆర్టీసీ భావిస్తోంది. ఇందుకోసం దుకాణాలు, బిజినెస్ కాంప్లెక్స్‌లు, ఫుడ్ కోర్టులు, వినోద కేంద్రాలకు స్థలం కేటాయించేలా ప్రణాళికలు రూపొందించింది. దీంతో బస్సు కోసం ఎదురుచూసే ప్రయాణికులు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆహారం, షాపింగ్ వంటి ప్రాథమిక అవసరాలను బస్టాండ్‌లోనే పొందే అవకాశం ఉంటుంది. అదే సమయంలో బస్టాండ్లలోని వాణిజ్య స్థలాల >>2



మీడియాతో మాట్లాడుతున్న కవిత

## ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తాం

### టిఆర్ఎస్ చీఫ్ కవిత

**హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ ఉప ఎన్నిక చర్చనీయాంశంగా మారిన వేళ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె..రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఫామ్‌హౌస్ రాజకీయాలుతెరపైకి తెస్తున్నారని >>2

# ఇక ఎఐ టూరిజం




హైదరాబాద్‌లో జరిగిన టూరిజం వేడుకల్లో డి.సిఎం భట్టి

## రాష్ట్ర పర్యాటకానికి ప్రపంచపటంలో ప్రత్యేక గుర్తింపు

### పిపిపి విధానంలో పెట్టుబడులకు ప్రోత్సాహం: డి.సిఎం భట్టి

### 50 లక్షల మందికి ఉపాధి లక్ష్యం: మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు26:** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. డిజిటల్ అజెండా - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు' అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 వేడుకలు శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన డిజిటల్ అజెండా-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్తరూపు ప్రాధాన్యతను వివరిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని >>2



ఎంబిబిఎస్ ప్రవేశాల్లో

## నకిలీ 'ఎస్టీ'లు

### 9 మంది నాన్‌లోకల్స్ సీట్లు రద్దు

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాత వార్త:** తెలంగాణలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా వెలుగులోకి వచ్చింది. ఇతర రాష్ట్రాల విద్యార్థుల్లో కొందరు ఎస్టీ కేటగిరిలో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం కలకలం రేపుతోంది. నకిలీ ఎస్టీ ధ్రువపత్రాలతో వైద్య విద్యలో దరఖాస్తు చేసుకున్న ఇతర రాష్ట్ర విద్యార్థులను కాళోజీ హెల్త్ యూనివర్సిటీ గుర్తించింది. వీరిలో ఇప్పటికే తొమ్మిది మంది ప్రవేశాలు పొందగా.. వారి సీట్లను యూనివర్సిటీ రద్దు చేసింది. చదువు, ఉద్యోగం కోసం నకిలీ సర్టిఫికెట్లను నమ్ముకొనే బ్యాచ్ గుట్టు >>2

# రేపటి నుంచి 3 రోజులు బ్యాంకు సమ్మె 3



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సోనియాగాంధీ

## నవంబరులో 'కాళేశ్వరం' పనులు

>> వెల్లడించారు. కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫార్సులు చేస్తారని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లను పిలిచి, పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.
"పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం" అని మంత్రి తేల్చిచెప్పారు. డిజైన్ల పరిశీలన నుంచి టెండర్లు, పనుల అమలు, తుది భద్రతా ధ్రువీకరణ వరకు ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు.
ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

## 'సర్' అభ్యంతరాలపై 30న ఇండియా కూటమి భేటీ

>> సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు వార్తలు వెలువడ్డాయి. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ పార్టీ కూడా జ్ఞానేశ్ కుమార్‌పై తన విమర్శలను తీవ్రతరం చేసింది. ఈ అంశంపై తమ వ్యూహాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈనెల 29న సమావేశం కానుంది. ఎస్ఐఆర్ అంశంపై ప్రతిపక్ష పార్టీలు పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నాయని, ఉమ్మడి కార్యాచరణపై చర్చిస్తున్నాయని వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలతో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), సీపీఐ(ఎం)లు కూడా ఎన్నికల సంఘం అంశంపై ఒకే వైఖరితో ముందుకు వస్తున్నాయి. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష నేతలకు లేఖ రాసి తాజా పరిణామాలపై సమావేశం నిర్వహించాలని కోరారు. అనంతరం ఆయన మమతా బెనర్జీతో మాట్లాడారు. పరిస్థితిపై సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అంగీకరించినట్లు సమాచారం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలు మరో నోటీసును సిద్ధం చేస్తున్నాయి. న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం ఈ నోటీసును పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభల్లో సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ప్రతిపక్షాల నుంచి సీఈసీ తొలగింపునకు ఇది మూడో ప్రయత్నం కానుంది.

## ఇసిలో విభేదాల్లేవు..

>> దరఖాస్తుదారు లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు ఉన్నాయా అనే సమాచారాన్ని అందించాల్సిన విధానం అమల్లోకి వచ్చింది. ఈ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ తెలిపింది. అయితే, సర్ ప్రక్రియ లేని సమయంలో మాత్రం రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోరల్ రూల్స్ 1960 కింద నిర్దేశించిన సాధారణ ఫామ్‌లనే ఉపయోగిస్తామని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ రోల్ డేటాబేస్ యాక్సెస్, ఇసిఐనెట్ పోర్టల్ పనితీరుపై ప్రశ్నలకు ఈసీ క్లారిటీ ఇచ్చింది. ఫీల్డ్ అధికారులకు వారి చట్టబద్ధ అధికారులకు అనుగుణంగా రోల్ బేస్డ్ యాక్సెస్ ఉంటుందని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇసిఐనెట్ వ్యవస్థను సమీక్షించేందుకు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.
ఈ కమిటీలో ఐఐటీ, ట్రిబుల్ ఐటీకి చెందిన నిపుణులను కూడా చేర్చనున్నారు. భవిష్యత్తులో కొత్త ఐటీ మాడ్యూల్స్, పోర్టల్స్ ఏర్పాటు చేసే ముందు అధికారుల కమిటీ వీటిని పరిశీలిస్తుందని ఈసీ తెలిపింది. ఎన్నికల సంఘంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఓ అధికారి బాధ్యతల పునర్విభజనకు సంబంధించి క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖపై ఈసీ స్పందించింది. ఈ లేఖ ఎన్నికల సంఘం విధానాలు, ఐటీ విభాగానికి సంబంధించిన పాలసీ అంశం కాదని, సంబంధిత అధికారి పనితీరుకు సంబంధించిన అంశమని చెప్పింది. గోవాలో ఓటర్ల జాబితా నుంచి 97 మంది పేర్లను మినహాయించడంపై ఈసీ క్లారిటీ ఇచ్చింది. ఈ 97 మంది నుంచి సంబంధిత ఫారమ్‌లనున సేకరించేందుకు బీఎల్‌ఓలు ఇంటిం టికి వెళ్లాని గోవా చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఆదేశించినట్లు ఈసీ చెప్పింది. ఇప్పటికే వారిలో 81 మంది ఫామ్6 సమర్పించినట్లు తెలిపింది.

## ఎంబిబిఎస్ ప్రవేశాల్లో నకిలీ 'ఎస్టీ'లు

>> బయటపడింది. తెలంగాణలో అధికారులకు లంచాలు ఇచ్చి మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక విద్యార్థులు నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఆ ధ్రువపత్రాలతో ఏకంగా రిజర్వేషన్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు పొందేందుకు 37 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. దరఖాస్తుల పరిశీలన సమయంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్లై చేసుకున్న 37 మంది ఇతర రాష్ట్ర విద్యార్థుల్లో ఇప్పటికే 9 మంది సీట్లను కేటాయించారు. దాంతో.. ఆ తొమ్మిది మంది సీట్లను రద్దు చేస్తున్నట్టు కాళోజీ యూనివర్సిటీ ప్రకటించింది.

## ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తాం

>> ఆరోపించారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ఇదంతా లోపాయికారీ ఒప్పందాల్లో భాగమేనని కవిత విమర్శించారు. ఫామ్‌హౌస్‌లపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇది మాటలకే పరిమితమైన పాలన అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలు ఆందోళనకరంగా ఉన్నాయని కవిత అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం.. 2020-21లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 6,239 మంది చిన్నారులు మరణించగా.. 2021-22లో 4,993 మంది, 2024-25లో 3,853 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. జిల్లాలవారీగా పరిశీలించినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలు కొనసాగుతున్నాయని ఆమె ఆరోపించారు. విశ్వనగరంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న హైదరాబాద్‌లోనే గత ఏడాది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1,046 మంది చిన్నారులు మరణించారని కవిత పేర్కొన్నారు. ఈ గణాంకాలు ప్రభుత్వ వైద్య రంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు.

**నేటి నుంచి విస్తృత స్థాయి సమావేశాలు..**

తెలంగాణ రక్షణ సేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రోజుకు రెండు జిల్లాల చొప్పున వరుసగా నాలుగు రోజుల్లో ఎనిమిది ఉమ్మడి జిల్లాల పరిధిలోని ముఖ్య నాయకులతో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సమావేశమవుతున్నారు. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల నాయకులతో కవిత సమావేశమవుతారు. 28న ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి మెదక్, 29న ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి నల్గొండ, 30న ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నాయకులతో కవిత సమావేశం కానున్నారు.

## వారం - వర్జ్యం

27-09-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె
తి. పాడ్యమి రా.8.55, న.ఉత్తరాభాద్ర ఉ.11.05
వ.రా.10.40 – రా.12.12
దు.సా.4.19 – సా.5.07
రాహు. సా.4.30–సా.6.00 శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** నేడు జరిపే విచారణలు, సంప్రదింపులు, సంభాషణలు అనుకూల ఫలితాలను ఇస్తాయి.

**వృషభం:** బాధ్యతల నిర్వహణలో వెనకడుగు వేయరు. దైవ దర్శనం చేసుకుంటారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు.

**మిథునం :** వ్యక్తిగత రహస్యాలు బయటకు వెల్లడి చేసే వారితో తగు జాగ్రత్తలు వహించండి. నూతన వ్యక్తులతో పరిచయాలు.

**కర్కాటకం :** లిఖిత పూర్వక ఒప్పందాలు లాభిస్తాయి. సహోద్యోగులతో సఖ్యతను కలిగి ఉంటారు. దైవ దర్శనం చేసుకుంటారు.

**సింహం :** చెల్లించవలసిన చెల్లింపులు, రాబడులు మొదలైన ఆర్థిక వ్యవహారాలను ఒక గాడిలోనికి తీసుకురాగలుగుతారు.

**కన్య :** అనుకున్న విధంగా నూతన కార్యక్రమాలను ప్రారంభించ గలుగుతారు. మధ్యవర్తిత్వాలు లాభించవు.

**తుల :** ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉత్తర ప్రత్యుత్తరాలను సాగిస్తారు.

**వృశ్చికం :** సంతాన విద్యా, విషయాలపైన దృష్టిని కేంద్రీకరిస్తారు. ప్రత్యర్థుల బలాబలాలను తెలుసుకుంటారు.

**ధనుస్సు :** వీసా, పాస్ పోర్ట్ వంటి అంశాలు అనుకూలంగా ఉంటాయి. మిత్ర బృందంలోనికి కొత్త వారిని చేరుస్తారు.

**మకరం :** వాయిదా పడుతున్న ఒక మొండి విషయంలో కొంత వరకు అనుకూల ఫలితాలను నేడు సాధించగలుగుతారు.

**కుంభం :** వృత్తి వ్యాపారాభివృద్ధికి దోహదపడే ప్రణాళికలను అమలు పరుస్తారు. శుభకార్యాలు సానుకూల పడతాయి.

**మీనం :** క్రమశిక్షణకు అధిక ప్రాముఖ్యత నిస్తారు. బ్యాంకింగ్ వ్యవహారాలపైన దృష్టిని సారిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇక ఎఐ టూరిజం

>> పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు. గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు "టూరిజం కూపన్లు అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ, తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో ఇప్పుడు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టడం, 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను అగ్రశ్రేణి రాష్ట్రాల్లో నిలపడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కొత్త రూపంలో తెలంగాణ టూరిజం వెబ్‌సైట్ తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌ను పునఃరూపకల్పన చేసి ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఆధునిక, సమగ్ర డిజిటల్ వేదికగా ఇది అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా నుంచి 100 మంది ఆదివాసీ/గిరిజన అతిథులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి నగరంలోని పర్యాటక ప్రాంతాలను చూపిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఆధునిక అభివృద్ధి, చారిత్రక వారసత్వం, నాగరికతలో వచ్చిన మార్పులను వారు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

**పర్యాటక శాఖలో పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం**

పునర్ రూపకల్పన (రీడిజైన్) చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, మై తెలంగాణ, మై స్టోరీ, మై డెస్టినేషన్" అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియోను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకున్నారు. 'ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ - ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం', ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సదస్సులో యువ టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీస్, తెలంగాణ దర్శిని, శిక్షణ పొందిన గైడ్స్, హోమ్‌స్టే పై పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. తర్వాత ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీఏ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి, సినీ నటులు తిరువరూర్, ఫరియా అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

>> జెన్ ఆల్ఫా యువతకు మన్మోహన్‌సింగ్ జీవితాన్ని, ఆయన చేసిన సేవలను గుర్తు చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన విగ్రహావిష్కరణ, స్మారక పార్కు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. తెలంగాణ ఆదాయంలో 49శాతం వాటాను అందజేస్తున్న ఐటి రంగ సంస్థలకు కేంద్రమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోనే ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం సముచితమని భావించి, ఐటి కారిడార్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి, సమైక్య రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడం వంటి రెండు సందర్భాలుగా తెలంగాణ ప్రాంతాన్ని చూడవచ్చన్నారు. మొదటి సందర్భం నిజాం పాలన నుంచి విముక్తి కల్పించింది నాటి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల ద్వయం అని, రెండవ సందర్భం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీల ద్వయం అని అన్నారు. మౌనమే బాషగా మార్చుకొని, ఓ మునిగా దేశ అభివృద్ధికి పనిచేసిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని తెలిపారు. మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వి.రమణ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలతోనే దేశం పురోభివృద్ధి సాధిస్తుంది. భారతదేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో మాజీ ప్రధానమంత్రి పివి.నర్సింహారావు ఏరికోరి మన్మోహన్‌సింగ్‌ను ఆర్థికశాఖ మంత్రిగా నియమించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్ చేసిన సంస్కరణలు సమాచార హక్కు చట్టం, పనికి ఆహార పథకం వంటివి దేశంలో విప్లవాత్మక మార్పుకు దారితీశాయని అన్నారు. జవహార్‌లాల్ నెహ్రూ తరువాత రాజ్యాంగాన్ని గౌరవించి, రాజ్యాంగాన్ని పటిష్టం చేయాలని ప్రయత్నించిన వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని తెలిపారు. పదువులు తాత్కాలికం, వ్యవస్థలు శాశ్వాతం అని ప్రకటించిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని అనా న్నరు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వి.రమణ, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ పీఎసి ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, మోహన్ గురుస్వామి తదితరులు పల్గొన్నారు.



పాట్నాలోని రాజ్‌కియా మధ్య విద్యాలయంలో పేరెంట్-టీచర్ మీట్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి

## ఎయిర్‌పోర్టు తరహాలో 13 కొత్త బస్టాండ్‌లు

>> ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరే అవకాశం కూడా ఉంటుంది. కొత్త బస్టాండ్ల నిర్మాణంలో భాగంగా కొడంగల్, మద్దూరు, కోస్గి, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఇప్పటికే పనులు ప్రారంభించినట్లు ఆర్టీసీ వెల్లడించింది. ఆసక్తి ఉన్న వ్యాపారులు దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో స్థలాల కేటాయింపుపై ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని తెలిపింది. కొడంగల్‌లో 1.91 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ నిర్మాణానికి రెండు నమూనాలను ప్రతిపాదించారు. ఒక ప్రతిపాదన ప్రకారం 39,558 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.15.82 కోట్ల అంచనా వ్యయం కాగా.. మరో ప్రతిపాదనలో 28,832 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.11.53 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. కోస్గిలో 1.55 ఎకరాల స్థలంలో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో 41,400 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.15.08 కోట్లు, ప్రత్యామ్నాయంగా 24 వేల చదరపు అడుగుల నిర్మాణానికి రూ.9.60 కోట్ల అంచనా వ్యయం నిర్ణయించారు. మద్దూరులో 1.05 ఎకరాల స్థలాన్ని బస్టాండ్ నిర్మాణానికి వినియోగించనున్నారు. ఇక్కడ 19 వేల చదరపు అడుగుల నిర్మాణానికి రూ.7.60 కోట్లు లేదా 11,200 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.4.48 కోట్లతో చేపట్టేలా రెండు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ కొత్త బస్టాండ్ల వల్ల పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారికి సౌకర్యవంతమైన వెయిటింగ్ ఏరియాలు, ఆహార సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇక బస్టాండ్లలో దుకాణాలు, ఫుడ్ కోర్టులు, ఇతర వ్యాపార కార్యకలాపాలు పెరిగితే స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడే అవకాశం ఉంది. చిన్న వ్యాపారులు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రేతలు, ఇతర వ్యాపారులకు కొత్త మార్కెట్ లభించవచ్చు. అయితే ఈ వాణిజ్య అవకాశాల ద్వారా ఎంతమేర ప్రయోజనం లభిస్తుందనేది బస్టాండ్లకు వచ్చే ప్రయాణికుల సంఖ్య, దుకాణాల కేటాయింపు విధానం, అద్దెలు, నిర్వహణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొత్తంగా చూస్తే.. టీజీఎస్‌ఆర్టీసీ చేపడుతున్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే కొత్త బస్టాండ్లు కేవలం ప్రయాణికుల రాకపోకలకు పరిమితం కాకుండా.. రవాణా, వాణిజ్యం, స్థానిక ఉపాధి అవకాశాలకు కేంద్రాలుగా మారే అవకాశం ఉంది.

## మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

>> తీవ్రమైన ఉక్కపోత మొదలవుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో శనివారం నుంచి తెలంగాణలో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. పొడి గాలులు ఎక్కువగా వీయడంతో చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరిగి వేడి వాతావరణం నెలకొంటోంది. అక్కడక్కడా చెదురుమదురు జల్లులు మినహా చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ నెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు తెలంగాణ అంతటా ఎండల తీవ్రత పెరిగే అవకాశముంది. ఈ రోజుల్లో రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నివేదిక హెచ్చరించింది. అక్టోబర్ మొదటి వారంలో మళ్లీ కాస్త ఉపశమనం లభించవచ్చని తెలిపారు. ఈశాన్య రుతుపవనాలకు ముందు వీచే తూర్పు గాలుల ప్రభావం వల్ల అక్టోబర్ 3 నుంచి 10మధ్య దక్షి ణ తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్‌మ్యాన్ అంచనా వేశారు. అయితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మాత్రం ఈ ఏడాదికి ప్రధాన రుతుపవన వర్షాల కాలం ఈ నెల 26తో ముగిసినట్లేనని, ఆ ప్రాంతాల్లో ఇకపై సాధారణ పొడి వాతావరణమే ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కూడా వాతావరణం చాలా వరకు పొడిగానే ఉండవచ్చు, అయితే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షం లేదా స్వల్ప ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. కాగా తీవ్ర అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా స్వల్ప వర్షం పడగా, ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే మించి వేసవిని తలపించే ఎండలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా గద్వాల్ జిల్లా పుల్లూర్‌లో 34.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 30 నుండి 35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతుల రికార్డయ్యాయి.

## కొత్త వారధి

>> నిర్మాణంలో బౌస్ట్రింగ్ ఆర్చ్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. విల్లు ఆకారంలో ఉండే పైభాగపు ఆర్చ్ నిర్మాణం వంతెనపై పడే భారాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణ వంతెనలతో పోలిస్తే ఈ విధానంలో నిర్మాణ భారాన్ని సమర్థంగా పంపిణీ చేయడానికి వీలుంటుంది. దిగువన ఉండే దిమ్మెలపై ఒత్తిడి తగ్గేలా పైభాగంలోని స్టీల్ ఆర్చ్ వ్యవస్థ పనిచేస్తుంది. జర్మనీ సాంకేతికతతో బౌస్ట్రింగ్ ఆర్చ్ విధానంలో నిర్మిస్తున్న ప్రత్యేకమైన నిర్మాణ శైలి, భారీ స్టీల్ భాగాల వినియోగం ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. వంతెన నిర్మాణంలో భాగంగా 84 మీటర్ల పొడవు, 335 టన్నుల బరువుండే 16 భారీ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి తయారీకి అవసరమైన స్టీల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. భారీ గడ్డర్లను నిర్దేశిత ప్రదేశాల్లో అమర్చడం, వాటిని ప్రధాన నిర్మాణంతో అనుసంధానించడం వంటి పనులు సాంకేతికంగా ఎంతో కీలకమైనవిగా ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. సుమారు 750 మీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ వారధి కోసం ఆధునిక ఇంజినీరింగ్ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలకు నదిపై సురక్షి తమైన రాకపోకల సదుపాయం అందుబాటులోకి రానుంది. దాదాపు తొమ్మిది దశాబ్దాల కిందట నిజాం పాలనలో నిర్మించిన పాత వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 167పై కొత్త వంతెనల నిర్మాణం చేపట్టారు. పాత వంతెనపై రాకపోకలకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించడంతోపాటు, ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ఈ నిర్మాణాల ప్రధాన ఉద్దేశం. ప్రస్తుత వంతెనకు పక్కనే మరో వారధి నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతంలో నదిపై రహదారి అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనులు సాగుతున్నాయి. ఎన్‌హెచ్167 తెలంగాణ, కర్ణాటక మధ్య కీలకమైన రహదారి మార్గం. ఈ మార్గంలో కొత్త వంతెనలు అందుబాటులోకి వస్తే ప్రయాణికులు, సరకు రవాణా వాహనాలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా నారాయణపేట జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలకు పొరుగురాష్ట్రంలోని పట్టణాలు, మార్కెట్లు, సేవా కేంద్రాలకు చేరుకోవడం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. సరకు రవాణా సాఫీగా సాగితే వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించే రైతులకు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వ్యాపారులకు కూడా ప్రయోజనం చేకూరవచ్చు. అయితే, ప్రయాణ సమయం ఎంత తగ్గుతుంది, వాహనాల రద్దీపై ఎలాంటి ప్రభావం ఉంటుంది అనేది వంతెనలు పూర్తై రాకపోకలు ప్రారంభమైన తర్వాత స్పష్టమవుతుంది.

## అక్టోబరు 4న రాష్ట్రంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** అక్టోబర్ 4న రాష్ట్రంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్నారు. కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరుకానున్న అమిత్ షా, అనంతరం హైదరాబాద్‌లో పార్టీ ప్రతినిధులతో భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదుబడే సెక్షన్ 13(12) కింద సక్రమించిన అధికారాలను ఉపయోగించి రుణగ్రహీత ఎస్.ప్రమోద్‌కుమార్ (రుణగ్రహీత), నిర్మలమ్మ (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నెం. 23660000766427)లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న రూ.3,24,997/- (మూడు లక్షల ఇరవై నాలుగు వేల తొమ్మిది వందల తొంభై ఏడు రూపాయలు మాత్రమే) మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ 27-ఏప్రిల్-26 తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.
ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న రుణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.
రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 23వ రోజు సెప్టెంబర్ 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.
ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, 27-ఏప్రిల్-26 నాటికి రూ.3,24,997/- (మూడు లక్షల ఇరవై నాలుగు వేల తొమ్మిది వందల తొంభై ఏడు రూపాయలు మాత్రమే) మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.
హామీగా ఉంచిన ఆస్తులను విడిపించుకోవడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

స్థిరమైన ఆస్తుల వివరణ

రిజిస్టర్డ్ ఇంటి గిఫ్ట్ డీడ్ Doc No. 388/2023 తేది: 17.02.2023 ప్రకారం వనపర్తి జిల్లా సంబరు కలిగివున్న స్థిరాస్తి, అమరచింత (గ్రా) అమరచింత (మం) వనపర్తి జిల్లా వద్ద వున్న, RCC ఇల్లు నిర్మాణం, 343.39చ.అ.కు సమానమైన 14.5x23.10 ప్లింత్ ఏరియా కలిగివుండి 33.23చ.మీ.కు సమానం 39.75చ.గ. మొత్తం విస్తీర్ణం 14.5x24.10 కొలతతో బ్లాక్ నం.9లో 9-7 నం. కలిగిన ఇల్లు, సరిహద్దులు ఈ విధంగా- తూర్పు: 7 అడుగుల దారి మరియు దర్శన్ జీ ఇల్లు, పడమర: 10అ॥ వెడల్పు రోడ్, ఉత్తరం: 3 అడుగుల కామన్ సేరి మరియు ఎన్. కవిత ఇల్లు, దక్షిణం: 1.6 కామన్ సేరి మరియు సంగెపాగు శ్రీను మరియు లేట్ కృష్ణమ్మ ఇండ్లు.

తేది: 23-సెప్టెంబర్-2026 అధీకృత అధికారి
ప్రదేశం : వనపర్తి, TS. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్



# 'సర్'పై 2న 'కాక్రోచ్' ఆందోళన

## మద్దతు ప్రకటించిన ఆదిత్య థాకరే

**ముంబై, సెప్టెంబరు 26:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జంతా పార్టీ చేపట్టనున్న ఆందోళనకు మద్దతు పెరుగుతోంది. అక్టోబర్ 2న ముంబైలో నిర్వహించనున్న నిరసనకు ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే సేన నేత ఆదిత్య థాకరే మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) కూడా సిజెపిని సంప్రదించినట్లు సమాచారం.సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో చేసిన పోస్టులో, 27లోగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2న ముంబై నుంచి దేశ వ్యాప్త ఆందోళన ప్రారంభిస్తామని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ఆందోళనను దేశంలోని పలు నగరాలకు విస్తరించ నున్నట్లు తెలిపారు. ఈ పిలుపుకు ఆదిత్య థాకరే మద్దతు ప్రకటిస్తూ, జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోకపోతే అక్టోబర్ 2 నుంచి ముంబైలో పెద్ద సంఖ్యలో ప్రజలు ఓట్ చోరీకి వ్యతిరేకంగా రోడ్డెక్కుతారని పేర్కొన్నారు. ఆదిత్య థాకరే మద్దతుపై అభిజీత్ దీప్కే కృతజ్ఞతలు తెలిపారు.

# హోటళ్లు, రెస్టారెంట్లపై కొనసాగుతున్న టిజి సేఫ్ దాడులు

## అనేక అక్రమాలు గుర్తింపు.. మూడింటికి నోటీసులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండ ర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) శనివారం నాడు రాష్ట్రంలోని మూడుచోట్ల హోటళ్లపై దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా అపరిశుభ్రంగా వున్న వంటశాలలు, పరిశుభ్రంగా లేని మాంసం, రియూజ్డ్ వంట నూనె, లేబుల్స్‌లేని ఆహార పదార్థాలు, సిం థ టిక్ ఫుడ్ కలర్స్, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, పగిలిపోయిన కోడి గుడ్లను అధికారులు గుర్తించారు.

హైదరాబాద్‌లోని మాదాపూర్ లో గల మోనార్టీ యాపి బ్రూవరీలో తనిఖీ చేయగా గడువు ముగిసిన మాంసం భారీగా వుండగా దానిని జప్తు చేశారు. ఐదు కిలోల కాలం తీ రిన వంటపూనె వెండగా దానిని కూడా జప్తు చేశారు. వరంగల్ లోని అల్వారాం హోటల్, కామారెడ్డిలోని మాల్గుడి రెస్టారెంట్లలోనూ ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. మూడు హోటళ్లకు టిజి సేఫ్ అధికారులు నోటీసులు ఇచ్చి వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ హోటళ్లలోని కొన్ని ఆహార వస్తువులను శాంపుల్స్‌గా తీసుకుని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి వీరేశం, రఫీ తదితరులు

# ప్రభుత్వ హామీతో సమ్మె విరమణ

## రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్వ ర్యంలో గత కొద్దిరోజులుగా చేస్తున్న 'రైస్ మిల్లుల బంద్' విరమిస్తున్నట్లు రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు శని వారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమ స్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇచ్చిందని అందుకే బంద్‌ను విరమి స్తున్నట్లు తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరిం చినందుకు మం త్రుల సబ్‌కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పౌర సరఫరాల శాఖ రైస్ మిల్లర్లతో చేసుకున్న ఒప్పందం మేరకు తాము మిల్లులను నిర్వ హిస్తా మన్నారు. అలాగే అవినీతికి పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వం యధా విధిగా చర్యలు తీసుకుంటుందని, అందరినీ భాద్యులను చేయకుండా ఒప్పందం మేరకు ప్రభుత్వం నడుచుకుంటున్నట్లు ఉపసంఘం తమకు ఇచ్చిన హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ గౌరవ అధ్యక్షుడు సయ్యద్ రఫీ, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గణేశ నిమజ్జనం

## సాఫీగా సాగేందుకు ఫలించిన పోలీసుల వ్యూహం

## హైదరాబాద్, మరికొన్నిచోట్ల సుదీర్ఘంగా సాగిన వేడుక

## పారిశుధ్య సేవలు కూడా సంతృప్తికరం

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా గణేష్ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 14వ తేదీన మొదలైన గణేశ చవితి ఉత్సవాలు శుక్రవారంతో ముగియడం తెలిసిందే. అయితే పలుచోట్ల ముందుగానే నిమజ్జన వేడుకలు జరిగినా తుది దశ నిమజ్జనం మా త్రం శుక్రవారం ఉదయం మొదలై అనేకచోట్ల శనివారం అర్థరాత్రి వరకు కొనసాగింది. హైదరాబాద్ సహా మరికొన్ని చోట్ల శనివారం కూడా కొన సాగాయి. జంట నగరాలలో 40 గంటల సుధీర్ఘ నిమజ్జనం జరగడం గమనార్హం. హైదరాబాద్‌లోని పలుచోట్ల నిమజ్జనం సాగిన మార్గాలు తొలిసారిగా ఆహార వ్యర్థాలతో నిండిపోయి నడిచేందుకు కూడా వీల్లేకుండా వుండడంతో బల్దియా సిబ్బంది వెంటనే రంగంలో దిగి మధ్యాహ్నం వరకు తొలగించారు. మరోవైపు నిమజ్జనం కారణంగా ట్యాంక్‌బండ్ పరిసరాలలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలను శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు దశల వారిగా తొలగించారు. పోలీసులు, పౌర విభాగాల అధికారుల సమిష్టి కృషి కారణంగా రాష్ట్రంలోని అన్నిచోట్ల గణేష్ నిమజ్జనం సాఫీగా ముగిసింది. అయితే హైదరాబాద్‌లో సహా అనేకచోట్ల నిమజ్జనం మరోసారి సుదీర్ఘంగా కొనసాగింది. రాష్ట్రంలో 1980 దశకంలో మొదలైన సామూహిక గణేశ నిమజ్జన వేడుకలు మొదట్లో మొదటిరోజు సాయంత్రం ఆరు లేదా ఏడు గంటల సమ యంలోనే ముగుస్తుండేది. అయితే కొన్నేళ్ల తరువాత అర్థరాత్రి వ రకు, ఆ తరువాత మరుసటి రోజు ఉదయం వరకు కొనసాగేది. అయితే కొన్నేళ్లుగా ఈ వేడుకలు రెండు రోజుల పాటు సాగడం ఆనవాయితీగా మారింది. కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఇళ్లకే పరిమితమైన గణేష్ వేడుకలు ఆ సమయంలో సమీపంలోని బావులు, చెరువుల్లో పరిమి త సంఖ్యలో పోలీసుల పహారాలో కరోనా ఆంక్షలను పాటిస్తూ నిమజ్జనం చేశారు. 2021లో నిమజ్జన ఆంక్షలు తొలగడంతో ట్యాంక్‌బండ్ వద్ద సందడి మధ్య నిమజ్జనం మొదలయ్యింది. గడచిన నాలుగేళ్లుగా నిమజ్జనం రెండవ రోజు కొనసాగగా ఈ సంవత్సరం ఇదే ఆనవాయితీ కొనసా గింది. ఈ ఏడాది శుక్రవారం ఉదయం నుంచే నిమజ్జనం మొదలైనా సాయంత్రం తరువాతే వేగం పుంజుకుంది. శివార్లలోని బాలాపూర్ నుంచి మొదలైన ఈ శోభాయాత్ర పాతబస్తీలోని చాంద్రా యణగుట్ట, అలియాబాద్, లాల్‌దర్వాజ, చార్మినార్, అఫ్జల్‌గంజ్ మీదుగా మోజం జాహీ మా ర్కెట్, అబిడ్స్, లిబర్టి, ట్యాంక్‌బండ్‌లోని మూడు మార్గాల వరకు సాగింది. ఇందుకోసం ట్యాంక్‌బండ్ చుట్టూ గల మూడు మార్గాలలో 40 భా రీ క్రేన్లను ఏర్పాటు చేయగా వీటిద్వారా ఎక్కడా ఆలస్యం కాకుండా వేగంగా నిమజ్జనం చేశారు. ఇక ఈ యేడాది గణేశ విగ్రహాల రద్దీ గత ఏడా దికన్నా 15 శాతం ఎక్కువగానే వుండగా 40 శాతం విగ్రహాల ఎత్తు 40 అడుగులు అంతకన్నా పైగా వుండడం నిమజ్జనం ఆలస్యం కావ డానికి కారణమయ్యింది.

ప్రధాన మార్గంలో సాగిన శోభాయాత్ర, వీటికి అనుసంధానంగా వున్న సమాంతర మార్గాలలో కూడా కొనసాగింది. ఇదే సమయంలో శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించిన అన్ని మార్గాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాధారణ ట్రాఫిక్‌ను పునరు ద్ధరించడం, రహదారులపై లక్షల సంఖ్యలో పడివున్న ఆహార వ్యర్థాల ప్లేట్లు, మిగిలిపోయిన తినుబండారాలను ఆయా ప్రాంతాలలో బల్దియా సిబ్బంది వేగంగా పారిశుధ్య పనులను నిర్వహించి తొలగించడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి. అయితే ఇతర ప్రాంతాల నుంచి కొన్ని విగ్రహాలు ట్యాంక్ బండ్‌లో నిమజ్జనం చేసేందుకు వచ్చే వీలున్నందున ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ మార్గంలో పరిమిత స ంఖ్యలో రెండు రోజుల పాటు క్రేన్లు వుంచారు. ఇక గణేశ నిమజ్జనం కోసం పోలీసులు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించారు. నిమజ్జన రద్దీని ముందుగానే ఊహించిన ఉన్నతాధికారులు ఇందుకు తగినట్లుగానే ఏర్పాట్లు చేసి, కొందరిని శుక్రవారం సాయంత్రం వేళ ఇళ్లకు పంపి శనివారం ఉదయం వారిని తిరిగి విధుల్లో చేరేలా చూశారు. అయితే అధికారులు, ఉన్నతాధికారులు మాత్రం అర్థరాత్రి దాటే వరకు డ్యూటీలు నిర్వహించి కొన్ని గంటలు విధులు నిర్వహించిన చోటే విశ్రాంతి తీసుకుని తిరిగి ఉదయం విధుల్లో చేరారు. మొత్తం మీద గణేశ నిమజ్జనం సాఫీగా సాగేందుకు పోలీసులు పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేయడంతో పాటు అహర్నిశలు శ్రమించారు.



హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సజ్జనార్

# రేపటి నుంచి మూడు రోజులు బ్యాంకు సమ్మె

## నేడు పనిచేయనున్న బ్యాంకులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు వచ్చే వారం అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. బ్యాంకు యూనియన్లు ప్రతిపాదించిన మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె ఈనెల 28 నుంచి 30 వరకు కొనసాగితే, ఖాతాదారులు పలు బ్యాంకు సేవలకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. 26, 27 తేదీలు సమ్మెకు ముందు రోజులు కాగా, సెప్టెంబర్ 30న బ్యాంకుల అర్ధవార్షిక ముగింపు కూడా ఉంది. దీంతో వరుసగా కొన్ని రోజుల పాటు బ్రాంచ్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు పరిమితమయ్యే అవకాశం ఉంది. పెన్షన్ సంబంధిత అంశాల్లో మార్పులు, ఐదు రోజుల బ్యాంకింగ్ వారం అమలు వంటి పలు డిమాండ్లపై యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చింది. సమ్మె కారణంగా సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం, బ్యాంకులు ఇప్పటికే పలు ప్రత్యామ్నాయ చర్యలను ప్రకటించాయి.ప్రతిపాదిత సమ్మె నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సెప్టెంబర్ నెల జీతాలు, వేతనాలు, పెన్షన్ల చెల్లింపులను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ జారీ చేసిన కార్యాలయ మెమోరాండం ప్రకారం సాధారణ షెడ్యూల్ కంటే ముందుగానే 25, శుక్రవారం చెల్లింపులు చేయడానికి అనుమతి ఇచ్చారు. అవసరమైన సర్దుబాట్లను 2026 అక్టోబర్ జీతాలు లేదా వేతనాల నుంచి చేపట్టను న్నారు. ఈ నిర్ణయం రక్షణ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాలతో పాటు ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తిస్తుంది. బ్యాంకు సమ్మె సమయంలో ఏర్పడే సేవల అంతరాయం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బం దులు పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు చెల్లింపులు చేపట్టారు. సమ్మె నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఏటీఎం లావాదేవీలకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్ తదితర బ్యాంకులు మూడు రోజుల సమ్మె కాలంలో ఏటీఎం లావాదేవీలపై అదనపు ఛార్జీలు వసూలు చేయబోమని సోషల్ మీడియా ద్వారా ప్రకటించాయి. దీంతో నిర్ణీత కాలంలో ఖాతాదారులు సాధారణ ఉచిత లావాదేవీ పరిమితికి మించి అదనపు ఛార్జీల గురించి ఆందోళన చెందకుండా ఏటీఎంలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

ప్రస్తుత ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం, సేవింగ్స్ ఖాతాదారులు తమ సొంత బ్యాంకు ఏటీఎంలలో సాధారణంగా నెలకు 5 ఉచిత లావాదేవీలు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎంలలో మెట్రో నగరాల్లో నెలకు 3 ఉచిత లావాదేవీలు, నాన్‌మెట్రో ప్రాంతాల్లో 5 ఉచిత లావాదేవీలు అందుబాటులో ఉంటాయి. ప్రతిపాదిత సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 27, ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పనిచేయనున్నాయి.

సాధారణంగా ఆదివారం బ్యాంకు ఉద్యోగులకు వారాంతపు సెలవు ఉంటుంది. అయితే 27న అన్ని బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం సంబంధిత శాఖలు, కరెన్సీ చెస్టులు పనిచేసేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాట్లకు అనుమతి ఇచ్చింది.




# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

## కార్మిక, గనుల శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి

## ఘనంగా 131వ జయంతి వేడుకలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** కులాలకు అతీతంగా బిసిలంతా ఐక్యమత్యంతో సంఘటితంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తమ హక్కుల కోసం పోరాడి సాధించుకోవచ్చునని రాష్ట్ర కార్మిక, గనుల శాఖల మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. అనేక వార్డులలో బిసిలు అధిక జనాభా, ఆదిపత్యంతో ఉన్నప్పటికీ స్థానిక మున్సిపల్ ఎన్నికలకే పరిమితం కాకుండా చట్టసభల ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్యే, ఎంపిలుగా గెలుపొందాలని, అప్పుడే మన సమస్యలు పరిష్కారమౌతాయని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వివేక్ గతంలో తాను ఎంపిగా పెద్దపల్లిలో ఐలమ్మ మూడు విగ్రహాలను ఏర్పాటు చేయించానని గుర్తుచేశారు. గోదావరిఖని, చెన్నూరు ప్రాంతాల్లో రజక సంఘాల నాయకులు కమ్యూనిటీహాల్‌లు నిర్మించాలని కోరగా తగిన నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం బిసిల్లోనూ మంచి నాయకత్వం, పెద్ద నాయకులున్నారని, వారంతా కలిసికట్టుగా ముందుకుసాగాలని సూచించారు. బిసిల సంక్షేమం కోసం ఆర్.కృష్ణయ్య నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నారని, బిసిల అభ్యున్నతి కోసం వి.హనుమంతరావు వంటి నాయకులు పట్టుదలతో కృషిచేయడం హర్షదాయకమన్నారు.

తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర కులగణన నిర్వహించామని, శాసనసభలో తీర్మానం చేసి బిసి జనాభా లెక్కల అంశాన్ని కేంద్రానికి పంపించామని తెలిపారు. జనాభా లెక్కల్లో కేంద్రం కూడా బిసి జనాభా వివరాలు సేకరిస్తామని ప్రకటించినప్పటికీ జనగణన సర్వే ఫారంలో ఎస్సీ, ఎస్టీ వివరాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని ఆవేదన వ్యక్తపరిచారు. దేశంలో అధిక జనాభా ఉన్న బిసిలకు న్యాయం జరగాలంటే వారి జనాభాపై స్పష్టమైన లెక్కలు అవసరమన్నారు. కేంద్రం తమ హామీకి కట్టుబడి ఉండాలని పొన్నం సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి బిసి జనాభా లెక్కలను కేంద్ర జనగణనలో చేర్చాలని ఐక్యం తీర్మానించినట్లు తెలిపారు. ఎంపి, జాతీయ బిసి సంక్షేమ సంఘ జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రజకుల్లో పుట్టుకతోనే ధైర్యం, సాహసం, నాయకత్వ లక్షణాలు ఉన్నాయన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో అన్యాయాన్ని ఎదిరించిన చరిత్ర రజకుల సొంతమన్నారు. రజకులు తొలినాటి శాస్త్రవేత్తలని పేర్కొన్న విషయాన్ని కంచె ఐలయ్య గుర్తుచేశారు. రజకులు సమాజంలో అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బల్మూరి వెంకట్ తదితర నాయకులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ నిజాం నిరంకుశ పాలన, దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని అన్నారు. ఆమె భూమి, విముక్తి, బడుగు బలహీన పీడితవర్గాలు, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం పోరాడారని చెప్పారు. ఆమె తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. రజకుల ఆత్మగౌరవ భవనం, స్థల కేటాయింపు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఉప్పల్ భగాయత్‌లో రజకులకు స్థలాన్ని కేటాయించేందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# అవినీతి సొమ్ముకు ఆశపడి విద్యుత్ రంగం ప్రైవేటుపరం: మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అవినీతి సొమ్ముకు ఆశపడి విద్యుత్ రంగం ప్రైవేటుపరం చేస్తున్నారని, ప్రైవేటుకు ఎందుకు ఇవ్వాలి? పాలిచ్చే అవులాంటి ట్రాన్స్‌కోను దోస్తులకివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు.పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

## నివృత్తి, డీఅడిక్షన్ కేంద్రాల ఏర్పాటు

# జైళ్ల శాఖకు స్కోచ్ అవార్డు

## ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్న డిజి సౌమ్యామిశ్రా

**హైదరాబాద్, సెప్టెంబరు 26: ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జైలు పాలవుతున్న ఖైదీలను సాధారణ పౌరులుగా మార్చేందు కు, వారిని సమాజంలో సాధారణ పౌరులుగా జీవించేలా చేసేందుకు జైళ్ల శాఖ ఏర్పాటు చేసిన నివృత్తి, డీ..ఆడిక్షన్ కేంద్రాలకు గాను 2026కు సంబంధించి స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో హ్యావిటాట్ సెంటర్‌లో శనివారం నాడు 109వ స్కోచ్ సమ్మిట్ ఇండియా ఎకనామిక్ ఫోరంకు సంబంధించి జరిగిన కార్యక్రమంలో జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా ఈ అవార్డును అందుకున్నారు. స్కోచ్ వ్యవస్థాపకులు రోహన్ రౌచర్, సంస్థ ఛైర్మన్ సమీర్ కొచర్‌లు ఈ అవార్డును సౌమ్యా మిశ్రాకు అందించారు. తెలంగాణ సర్కారు చేబట్టిన డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంలో భాగంగా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి ఖైదీలైన వారిని సాధారణ పౌరులుగా మార్చేందుకు నివృత్తి, డీఅడిక్షన్ కేంద్రాలు బాగా ఉప యోగపడు తున్నా యని స్కోచ్ నిర్వా హకులు ఈ సందర్భంగా తెలిపారు. స్కోచ్ అవార్డు అందుకున్న సందర్భంగా డిజి సౌమ్యా మిశ్రా మా ట్లాడుతూ ఈ అవార్డు తమపై మరింత బాధ్య తను పెంచిందని తెలి పారు. ప్రస్తుతం చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్, చంచల్‌గూడ మహిళా జైల్లో ఇవి పనిచేస్తు న్నాయని ఆమె తెలిపారు.

డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారు, మాదకద్రవ్యా లకు బానిసలుగా మారి నేరాలు చేసి జైలు పాలైన వారు మామూలు జీవితం గడిపేం దుకు, సాధారణ పౌరులుగా వుండేందుకు ఈ కేంద్రాలు తమ వంతు కృషిని చేస్తున్నాయని ఆమె వెల్లడించారు.

దీంతో పాటు ఖైదీలలో మాదకద్ర వ్యాల వినియోగ సమస్యలను గుర్తించడం, వారికి చికిత్స అందించడం ద్వారా మంచి వారుగా చేయడం తమ లక్ష్యమని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు 4200 మంది ఖైదీలకు డ్రగ్స్ విని యోగా నికి సంబంధించిన సమస్యల కోసం స్క్రీనింగ్ నిర్వహించగా అందులో 2126 మంది ఖైదీలకు కొన్ని లక్షణాలు వెలువడ్డాయని వీరికి మరోరకం పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం వల్ల వారిలో మా ర్పు వచ్చిందని ఆమె తెలిపారు. జైళ్ల నుంచి విడుదలైన 300 మంది ఖైదీలకు తదనం తరం కూడా చికిత్స అందిస్తున్నామని సౌమ్యా మిశ్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిఐజి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



న్యూఢిల్లీలో స్కోచ్ సమ్మిట్ కార్యక్రమంలో జైళ్ల శాఖ తరఫున స్కోచ్ అవార్డు అందుకున్న డిజి సౌమ్యా మిశ్రా.


AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001(CIN:L36911RJ1996PLC011381)

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
| --- | --- | --- |
| (Loan A/C No.) 23660001012210 కట్టెకోసి ప్రమోద్ కుమార్ (రుణగ్రహీత) మైయతరి పుష్పలత (సహ-రుణగ్రహీత) కట్టె గోసి లలిత (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ.8,11,928/-, ఎనిమిది లక్షల పదకొండు వేల, తొమ్మిది వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి | 23-సెప్టెంబర్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
సంగారెడ్డి జిల్లా (తెలంగాణ), సదాశివపేట మండలం, ఇబ్రహీంబాద్ గ్రామం మరియు జి.పి. పరిధిలో ఉన్న ఆస్తి వివరాలు: గ్రామ పంచాయతీ ఇంటి నంబర్ 7-89 కలిగిన RCC ఇల్లు మరియు ఖాళీ స్థలం. దీని విస్తీర్ణం 156.00 చదరపు గజాలు లేదా 130.43 చదరపు మీటర్లు. ఇందులో 243.00 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా నిర్మాణ వైశాల్యం కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ RCC పైకప్పుతో నిర్మించబడి ఉంది. అందులో అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు ఆస్తి పన్ను రశీదు నం. 496 మరియు విద్యుత్ USC నం. 63887766. సరిహద్దులు: తూర్పున - కె. భాగ్యమ్మ ఇల్లు, పడమరన - జి.పి.రోడ్డు, ఉత్తరాన - మల్లయ్య ఇల్లు, దక్షిణాన - జి.పి. రోడ్డు.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
| --- | --- | --- |
| (Loan A/C No.) 24660001828843 డప్పు యాదగిరి (రుణగ్రహీత) డప్పు ఉమ (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ.8,41,762/-, ఎనిమిది లక్షల నలభై ఒక్క వేల, ఏడు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి | 22-సెప్టెంబర్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం, అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో ఉన్న ఇంటి నంబర్ 3-91/2 (అసెస్మెంట్ నంబర్ 348) గల ఇల్లు; దీని విస్తీర్ణం 80 చదరపు గజాలు మరియు ప్లింత్ ఏరియా నిర్మాణ వైశాల్యం 300 చదరపు అడుగులు RCC పైకప్పుతో కూడినది. దీని సరిహద్దులు: తూర్పున - గ్రామ పంచాయతీ రోడ్డు, పడమరన - డప్పు రాములు ఇల్లు, ఉత్తరాన - డప్పు రాములు ఇల్లు, దక్షిణాన - గ్రామ పంచాయతీ రోడ్డు.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
| --- | --- | --- |
| (Loan A/C No.) 23630000038378 బొగళ్ళ సంపత్ (రుణగ్రహీత) బొగళ్ళ రాజమ్మ (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ.9,42,483/-, తొమ్మిది లక్షల నలభై రెండు వేల నాలుగు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 22-సెప్టెంబర్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ
సిద్దిపేట జిల్లా, మద్దూరు మండలం, రేబర్తి గ్రామ పంచాయతీ మరియు గ్రామం పరిధిలో సిద్దిపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చేరియాల్ జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న G.P.H. నం. 5-100/65/1 గల ఆస్తి. ఇందులో 199.43 చదరపు గజాలు లేదా 166.74 చదరపు మీటర్ల మొత్తం విస్తీర్ణంలో, 769.55 చదరపు అడుగులు లేదా 85.55 చదరపు గజాలు/71.48 చదరపు మీటర్ల RCC ప్లింత్ ఏరియా కలిగిన ఇల్లు మరియు 113.93 చదరపు గజాలు లేదా 95.25 చదరపు మీటర్ల ఖాళీ స్థలం ఉన్నాయి. ఈ ఆస్తి సరిహద్దులు: తూర్పున - బోగుల్ల ఉమ గారి ఖాళీ స్థలం, పడమరన - రోడ్డు, ఉత్తరాన - రోడ్డు, దక్షిణాన - వి. భీమ శంకర్ గారి ఖాళీ స్థలం.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదవబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 25/09/2026 ప్రదేశం : హైదరాబాద్, తెలంగాణ

అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

వార్త, ఆదివారం 27, సెప్టెంబరు 2026

# సంక్షోభంలో పాడి పరిశ్రమ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా గ్రామీణప్రాంతాల జీవనోపాధిలో పశుపోషణ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఈ రంగం రోజురోజుకీ క్షీణించిపోతున్న దుస్థితిని తాజా పశుగణన ఫలితాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన పిల్లర్లుగా నిలుస్తున్న పశుసంపద క్లిష్ట పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. గేదెలు, ఆవుల సంఖ్య తగ్గడంతోపాడి,దాని అనుబంధ ఉత్పత్తులపై ప్రభావంపడింది. పశుగ్రాసం కొరత, వాతావరణ మార్పులు, పాడిపరిశ్రమపై రైతులు ఆసక్తిచూపకపోవడం దీనికి ప్రధాన కారణాలు.ప్రస్తుతం రెండురాష్ట్రాల్లోనిపశుసంపద, పాడిరైతులు, పశుపోషకులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. పాడిపరిశ్రమకు అవసరమైన ప్రోత్సాహం లేకపోవడమే రైతులు ఈ రంగం నుంచి దూరమవ్వడానికి ప్రధాన కారణం. దీనికి తగినట్లుగా ఇప్పుడు ఎల్‌నినో పరిస్థితులతో వర్షాభావం ఏర్పడి పశువుల పెంపకానికి తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండురాష్ట్రాల్లో పశుసంపద వృద్ధి చెందకపోవడమే ఈ సమస్యలన్నింటికి కారణం. ప్రధానంగా పశుగ్రాసం కొరత, పచ్చికబయళ్లు తగ్గడం ఒక కారణంగా ఉంది. పశు సంపద ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు చూస్తే వేసవి కాలమే కాకుండా, వర్షాకాలం, ఇతర కాలాల్లో కూడా పశుగ్రాసకొరతఏర్పడుతోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల,సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల పశుగ్రాస కొరత తీవ్రంగా మారుతోంది.సాగుభూములు పెరగడం, పట్టణీకరణ వల్ల పశువులు మేసే సాంప్రదాయ పచ్చిక బయళ్లు మృగ్యమవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధానపశువులసంతల్లో పశువులకు నీడకోసం షెడ్లు, తాగునీటి తొట్లు, లోడింగ్, అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు సరిగ్గాలేవు. ఇది పాడిపరిశ్రమ వైపు యువత, రైతుల్లో ఆసక్తితగ్గినట్టు చూపిస్తుంది. గోపాల మిత్ర వంటి సిబ్బంది ఉన్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందడం లేదు.

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పాడి పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవలి కాలంలో రెండు రాష్ట్రాలలోని పాడి రైతులు పలు తీవ్రమైన సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల పశుగ్రాసం లభ్యత తగ్గి, పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. గ్రామీణ ప్రాంతాలలో ఖాళీ స్థలాలు,పచ్చిక బయళ్లు క్రమంగా తగ్గిపోతున్నాయి. వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వాడలుగా మారిపోవడంతో పశుగ్రాసానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనివల్ల పశువులను మేపడం రైతులకు పెద్ద భారంగా మారింది. మరోపక్క వ్యవసాయంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్ల వాడకం విపరీతంగా పెరగడం వల్ల సాంప్రదాయక వైకోలు, గడ్డి లభ్యత తగ్గిపోయింది. దీంతో పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటాయి. అలాగే ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పశువులు వేడి ఒత్తిడికి లోనవుతున్నాయి. దీనివల్ల మేత తినడం తగ్గించి, పాల దిగుబడి గణనీయంగా పడిపోతోంది. అధిక వేడి వల్ల పాలలో వెన్న, ప్రొటీన్ శాతం తగ్గిపోవడం వల్ల రైతులకు ఆశించిన ధర లభించడం లేదు. దీనికి తగినట్లుగా పశువులకు ఇచ్చే పిండి, తవుడు, పత్తిచెక్క వంటి దాణా ధరలు భారీగా పెరిగాయి. పశువుల పోషణకు అయ్యే ఖర్చుతో పోలిస్తే డెయిరీలు లేదా ప్రైవేట్ వ్యాపారులు ఇచ్చే పాల కొనుగోలు ధర సరిపోవడం లేదు. అలాగే వ్యాధుల విజృంభణతో పాటు, వైద్య సదుపాయాల కొరత రైతులను పట్టిపీడిస్తున్నాయి. లంపీ స్కిన్ (చర్మ వ్యాధి), గొంతువాపు, గాలికుంటు వ్యాధి, కోళ్లలో బర్డ్ ఫ్లూ వంటి వ్యాధులు అప్పుడప్పుడు ముప్పు తెస్తున్నాయి. దీనికి తగననట్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్య శాలల్లో మౌలిక సదుపాయాలు, మందులు, సరిపడా లేకపోవడంతో పాటు, పశువైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. అంతేకాకుండా పశువులను విక్రయించేటప్పుడు లేదా కొనుగోలు చేసేటప్పుడు దళారుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో రైతులు నష్టపోతున్నారు. పశువులు అకాల మరణం చెందినప్పుడు రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం రాయితీపై బీమా సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, క్లెయిమ్‌లు సకాలంలో రాకపోవడం, అవగాహన లోపం వల్ల చాలా మంది రైతులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు. తెలంగాణలో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఆవులు, గేదెల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో పాటు విజయ డెయిరీకి వచ్చే పాల సేకరణలో కూడా హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. ఐసీఎంఆర్ సిఫార్సుల ప్రకారం రోజువారీ వినియోగం పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో



ఉత్పత్తిని మించి డిమాండ్ ఉండటంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. తెలంగాణ పాల దిగుమతులపై ఆధారపడుతోంది. ప్రస్తుతం తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో ఉత్పత్తవుతున్న పాలు కేవలం 4 లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు. పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాలఉత్పత్తిలో గణనీయమైన కోత వచ్చింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. 2019 సంవత్సరంతో పోలిస్తే గత ఏడాది చివరిలో నిర్వహించిన పశుగణనలో పాలు ఇచ్చే ఆవులు, గేదెలు, మేకల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆవుల సంఖ్య 2019లో 42,32,383 ఉండగా, ఇప్పుడు 27.48 శాతంతో 30,69,524కు తగ్గింది. అలాగే గేదెలు సంఖ్య 42,26,603 ఉండగా, అది 27.78 శాతం మేర 30,52,102కి తగ్గాయి. మేకలు సంఖ్య చూస్తే 49,34,673 నుంచి 7.82 శాతంగా 45,48,999కి వాటి సంఖ్య పడిపోయింది. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట జిల్లాలో ఆవుల సంఖ్య 62.65 శాతం తగ్గగా, సంగారెడ్డి, మెదక్, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా 40 శాతానికి పైగా తగ్గింది. గేదెలు సంగారెడ్డి జిల్లాలో 46.14 శాతం, మెదక్ 45,32 శాతం, మహ బూబాబాద్‌లో 43,23శాతం, కామారెడ్డి 45.92 శాతం చొప్పున తగ్గాయి. మేకలు హైదరాబాద్‌లో 40.87 శాతం, రంగారెడ్డి జిల్లాలో 25.83 శాతం క్షీణించాయి. ఈ గణాంకాలు చూస్తే, పాడి పశువుల సంఖ్య క్షీణత ఎంతగా ఉందనేది అర్థమవుతోంది. రైతులకు ఆశించిన స్థాయిలో మద్దతు లేకపోవడం, పశువుల ఆహారం ఖరీదు పెరగడం, పశువైద్య సేవలు సమర్థవంతంగా లభించకపోవడం వంటి అంశాలు ఈ రంగాన్ని వెనుకకు నెడుతున్నాయి. జాతీయ నమూనా సర్వే ప్రకారం, తెలంగాణలో గ్రామీణ రైతు కుటుంబాల్లో కేవలం 0.87 మాత్రమేపాడి పశువుల పెంపకంతో ఉపాధిని పొందుతున్నారని తెలిసింది. మరో వైపు పశువుల దాణా, మేత ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. పశు గ్రాసం పెపకం పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోపక్క పచ్చిగడ్డి, పశువులకు సేవలందించేందుకు కూలీల దొరకడం లేదు. పశుసంపద పెంచాలని తెలంగాణ విజయ డెయిరీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. సమస్య తీవ్రత, ప్రజావసరాల దృష్ట్యా పాడి రంగాన్ని ఆదుకునేందుకు పాడిపశువుల సంఖ్య పెంపుదల, ఇతర చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ) ప్రభుత్వాన్ని కోరింది. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు పశువుల పంపిణీ పథకాన్ని చేపట్టాలని, వ్యక్తిగత లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేయాలని విజయ డెయిరీ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధిక పశు సంపద కలిగిన ప్రముఖ రాష్ట్రాలలోఒకటి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, పాడి రైతులకు పశుపాలన ప్రధాన జీవనాధారంగా నిలుస్తోంది. దేశంలోనే రాష్ట్రం దాదాపు 62.19 లక్షల గేదెలతో 6వ స్థానం, మేకలకు సంబంధించి 7వ స్థానం, ఆవుల సంఖ్య 46 లక్షలతో 14వ స్థానం కలిగి ఉన్నాయి. మొత్తం పాలు ఇచ్చేపశువులు రాష్ట్రంలో సుమారు 51.4లక్షల వరకూ ఉన్నట్లు అంచనా. ఇతర పశు సంపదకు సంబంధించి గొర్రెల సంఖ్యలో సుమారు 210.15 లక్షలు, కోళ్ల పెంపకంలో ఆంధ్రప్రదేశ్ దేశంలనే మొదటి స్థానంలోకొన సాగుతోంది. పాల దిగుబడికి సంబంధించి సంవత్సరానికి దాదాపు 13.94 మిలియన్ టన్నులుగా నమోదైంది. రాష్ట్రంలో ఒక వ్యక్తికి రోజువారీ లభించే పాల సగటు 719 గ్రాములుగా ఉంది. ఇది జాతీయ సగటు 459గ్రాముల కంటే చాలా ఎక్కువ. రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా అత్యధిక పాల దిగుబడితో అగ్రస్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. అయితే ఈ రాష్ట్రంలో పశుగ్రాస కొరత తీవ్రంగా మారుతోంది. పచ్చిక బయళ్లు తగ్గడం, సాగు భూములు పెరగడం, పట్టణీకరణ వల్ల పశువులు మేసే సాంప్రదాయ పచ్చిక బయళ్లు మృగ్యమవుతున్నాయి. రాష్ట్రంలోని అనంతపురం, ప్రకాశం, కడప వంటి జిల్లాల్లో మేత సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. వేసవితో పాటు, ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోతుండటం వల్ల పశువులు, ముఖ్యంగా పాడి ఆవులు, గేదెలు వడదెబ్బకు గురవుతున్నాయి. ఇది పాల దిగుబడిని గణనీయంగా తగ్గిస్తోంది. మరోపక్క తీరప్రాంత జిల్లాల్లో తరచూ వచ్చే తుపాన్లు, వరదల వల్ల పశువులు కొట్టుకుపోవడం, అంటువ్యాధుల బారిన పడటం జరుగుతోంది.గాలికుంటు వ్యాధి, నట్టల నివారణ లోపం, లంపీ స్కిన్ వంటి వ్యాధులు పశువుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్యశాలల్లో అవసరమైన మందులు, ల్యాబ్ పరీక్షల కిట్లు మరియు ఆధునిక వైద్య పరికరాల కొరత ఉంటోంది. పశుగ్రాసం, దాణా ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, దానికి అనుగుణంగా డైరీల నుంచి పాలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ●

---

రాష్ట్రం
మేఘాలయ

# వింత 'పొత్తు'లు!

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయాలలో కొన్ని పరిణామాలు చాలా ఆశ్చర్యం కలిగిస్తాయి. విపక్షం నుంచి అధికార పక్షంలోకి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఫిరాయించడం మామూలే. కానీ అధికార కూటమిలోనే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడాన్ని ఏమనుకోవాలి! అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది కూడా. మేఘాలయలో ఇటువంటి ఆశ్చర్యకర పరిణామమే గతవారం సంభవించింది. కేవలం 60 అసెంబ్లీ సీట్లున్న చిన్న ఈశాన్య రాష్ట్రం మేఘాలయ. కాన్రాడ్ కె. సంగ్మా నేతృత్వంలోని ఎన్‌పిపి ( నేషనల్ పీపుల్స్ పార్టీ) అధికారంలోఉంది. ఆ పార్టీకి మిత్రపక్షాలుగా బిజెపి, హెచ్‌ఎస్ టిడిపి, యుడిపి ఉన్నాయి. అన్నీకలిపి ఎండిఎ పేరుతో కూటమిగా ఏర్పడి మూడేళ్ల క్రితం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కాంగ్రెస్‌కు ప్రస్తుతం అసెంబ్లీలో ప్రాతినిధ్యమే లేదు. ఈ కూటమిలో ఎన్‌పిపికి 33 మంది సభ్యులుండగా, యుడిపికి 12 మంది, బిజెపికి ఇద్దరు సభ్యులు ఉన్నారు. అయితే గతవారం యుడిపిలోని 8 మంది సభ్యులు హఠాత్తుగా బిజెపిలోకి జంప్ చేయడంతో ఈ పరిణామం రాజకీయంగా తీవ్ర సంచలనం కలిగించింది. యుడిపి ఎమ్మెల్యేలు బిజెపిలో చేరినందువల్ల ఎండిఎ ప్రభుత్వానికి నిజానికి ఎలాంటి ముప్పు లేదు. ఎందుకంటే ప్రభుత్వానికి మద్దతిచ్చే సభ్యుల సంఖ్యలో మార్పేమీ లేదు. కానీ ఇప్పటిదాకా ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్న బిజెపి బలం 10కి పెరగడంతో అసెంబ్లీలో ఇప్పుడు అది రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఎన్‌పిపిలో చేరితే ఆ కథ వేరేగా ఉండేది. వారికి లభించే ప్రయోజనాలూ ప్రత్యేకంగా ఉంటాయి. కానీ ఒక భాగస్వామ్య పక్షం నుంచి మరో భాగస్వామ్య పక్షంలోకి మారడం వల్ల ప్రయోజనం ఏంఉంటుంది! ఇప్పటిదాకా చిన్న భాగస్వామిగా ఉన్న బిజెపికి ఎమ్మెల్యేలు పెరగడంతో కీలక శక్తిగా ఎదిగింది. ఆ పార్టీ భవిష్యత్ పరిణామాలపై అంచనాలు కూడా మారుతున్నాయి. తమ డిమాండ్ల పరిష్కారం కోసమే పార్టీని మారినట్లుగా ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఖాసీ భాషను రాజ్యాంగం లోని ఎనిమిదవ షెడ్యూల్‌లో గుర్తించాలనీ, బొగ్గు తవ్వకాలలో తలెత్తుతున్న సమస్యలు పరిష్కరించాలనీ, మేఘాలయ రెసిడెంట్స్ సేఫ్టీ, సెక్యూరిటీ యాక్ట్‌లో మార్పులు చేయాలనీ, అసోంతో గల సరిహద్దు సమస్యను పరిష్కరించాలనీ వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసమే తాము బిజెపిలో చేరినట్లు చెబుతున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం మరొకటి ఉంది. ఆ డిమాండ్లలో ఏదీ వెంటనే పరిష్కారమయ్యేది కాదు.



కాన్రాడ్ కె. సంగ్మా

తాజా పరిణామం వల్ల బిజెపి బలం పెరిగినట్లు కనిపిస్తుంది కానీయుడిపి డిమాండ్లు ప్రధానం అనిపించవు. 2028లోఅంటే మరో యేడాదిన్నరలో ఎన్నికలు రానుండడంతో తాజా పరిణామం కూడా ఆ కోణం నుంచే చూడవలసి ఉంటుంది. దేశవ్యాప్తంగా బిజెపి తన బలాన్ని పెంచుకొనే వ్యూహాన్ని అనుసరిస్తున్నది కనుక త్వరలో జరిగేఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ఈ ఫిరాయింపును ప్రోత్సహించిఉండొచ్చని అనుకోవాలి. కేవలం రెండు సీట్లున్న పార్టీ తదుపరి ఎన్నికల్లో ఎక్కువసీట్లు డిమాండ్ చేయలేదు గనుక, సీట్ల సంఖ్య పెంచు కొనడం ప్రస్తుతం బిజెపి టార్గెట్‌గా కనిపిస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పిపికి 35శాతం ఓట్లు రాగా, యుడిపికి 18 శాతం, బిజెపికి పది శాతం ఓట్లు వచ్చాయి. అంటే చాలా తక్కువ శాతం ఓట్లతో బిజెపి ప్రస్తుతం ప్రాతినిధ్యంవహిస్తోందన్నమాట. తాజా పరిణామాలతో బిజెపిసీట్లు 10కి పెరిగాయి కానీ ఆమేరకు ఓట్లశాతం బదలీ అవుతుందా? అనేది ఒకప్రశ్న. ఆ ఓటర్లు గత ఎన్నికల్లో యుడిపికి ఓటు వేశారు. వారందరినీ ఇప్పుడు తనవైపు తిప్పు కొనాలంటే బిజెపి బ్రహ్మప్రయత్నం చేయవలసి ఉంటుంది. కాన్రాడ్ సంగ్మా ప్రభుత్వానికి వ్యతి రేకంగా ఈపరిణామం జరగకపోయినా తదుపరి ఎన్నికలకు ముందు సమీకరణాలు పూర్తిగా మారిపోతాయనే అనిపిస్తుంది. గత ఎన్నికల్లో పెద్దగా సీట్లు సాధించకపోయినా ఎమ్మెల్యేల చేరికతో బిజెపి తన బలాన్ని ఐదు రెట్లు పెంచుకొంది. ఈ బలంతో వచ్చే ఎన్నికల్లో బిజెపి ఎక్కువ సీట్లు డిమాండ్ చేయగలుగుతుంది.కానీ యుడిపి నుంచి ఆకర్షించినట్లుగా ఎన్‌పిపి నుంచి కూడా సభ్యులను ఆకర్షించడం మొదలు పెడితే ఆ పరిణామాలు మేఘాలయ రాజకీయ దృశ్యాన్నే పూర్తిగా మార్చేస్తాయి. ఎన్‌పిపి,బిజెపి మధ్య అభిప్రాయ భేదాలొస్తే ఈ పరిణామం తేలికగానే సంభవించవచ్చు. ముఖ్యమంత్రి సంగ్మా ఎన్‌పిపికే చెందినా, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కూడా ఆ పార్టీకి చెందినవారే ఉన్నారు. ఇప్పుడు తన బలంపెరగడంతో ఓ డిప్యూటీ సీఎం పదవి తమకు కూడా కావాలని బిజెపి అడిగే అవకాశం ఉంది. పార్టీమారిన ఆ ఎనిమిది మంది ఎమ్మె ల్యేలు ఖాసీ జైంటియా హిల్స్ ప్రాంతంలోని నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే, యుడిపి గెలిచిన ఆ నియోజకవర్గాలలో బిజెపికి చాలాతక్కువ ఓట్లు వచ్చిన విషయం అర్థమవుతుంది. యుడిపిని గెలిపించిన ఓటర్లు ఇప్పుడు హఠాత్తుగా బిజెపి వైపు మారుతారా? ఇది మరో ప్రశ్న. మారకపోతే బిజెపి పరిస్థితి ఏమిటి?ఖాసీ భాష మాట్లాడేవారు మేఘాలయలో దాదాపు13 లక్షలుంటారని అంచనా. రాష్ట్రప్రభుత్వం దానిని అధికార భాషగా గుర్తించింది కానీ, గతం లో ఇచ్చిన హామీప్రకారం రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో ఇంకా చేర్చలేదు. 2018లోనే అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్రం ఇంతవరకు ఏ చర్యా తీసుకో లేదు. ఈ పరిస్థితిలో యుడిపి నుంచి బిజెపిలో చేరిన ఎమ్మెల్యేలు తమ డిమాండ్‌ను ఎలా నెరవేర్చుకుంటారో చూడాలి. ఏదిఏమైనా ఎన్ని కల ముందు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బిజెపిలో చేరడం చాలా ఆసక్తికరమైన పరిణామం. మరో యేడాదిన్నరలోఇంకెన్ని పరిణా మాలు సంభవిస్తాయో చూడాలి. ●

---

దేశం
సౌదీ అరేబియా

# 'అణ్వస్త్రం' పై సౌదీ ఫోకస్!

**గన్ని మోహన్**

ఇరాన్‌నుంచి ఎదురవుతున్న దాడుల ముప్పును ఎదుర్కొనేందుకు అగ్రరాజ్యం మిత్రదేశం సౌదీ అరేబియా ఇప్పుడు అణ్వాస్త్రాలపై దృష్టిపెట్టింది. ఇటీవల సౌదీ అరేబియాలో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సమక్షంలో ఈమేరకు శుద్ధి చేసిన యురేనియం సరఫరాకు కూడాఒప్పందం జరిగింది. అయితే ఈ యురేనియం 60శాతానికి మించి సరఫరా అయిన పక్షంలో సౌదీఅరేబియా అమ్ముల పొదిలోకి అణ్వాస్త్రాలు వస్తాయన్నది అమెరికా సెనేటర్లు, ఇతర పొరుగుదేశాల ఆందోళన. దీనితోడు సౌదీ అరేబియా భవిష్యత్తులో అణ్వస్త్ర కార్యక్రమాన్ని అభివృద్ధిచేసే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేమని అమెరికా నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. కాంగ్రెస్‌కు సమర్పించిన రహస్య పత్రాలను పరిశీలించిన అమెరికా అధికారులు అణ్వాయుధాలు తయారీ అవకాశాలు మెండుగా ఉన్నాయని అంచనా వేసారు. అమెరికా- సౌదీ దేశాల మధ్య పౌర అణు సహకారాన్ని విస్తరించేందుకు కుదిరిన ఒప్పందంపై కాంగ్రెస్ సమీక్షలో భాగంగా ఈనిఘా అంచనాను సమర్పించినట్లు సమాచారం. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాలో అణు విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టేందుకు అమెరికా కంపెనీలకుపదుల బిలియన్ డాలర్ల విలువైన అవకాశాలు లభించనున్నాయి. ఒప్పందంలోని మరో అంశం కూడా అమెరికా చట్టసభ్యుల్లో ఆందోళనకుకారణమైంది. ఒప్పందం ప్రకారం తొలుత సౌదీ అరేబియా యురేనియంను 5శాతం కంటే తక్కువ స్థాయిలోనే శుద్ధి చేయాల్సి ఉంటుంది. అయితేతదుపరి అధ్యయనం, ఇరు దేశాల మధ్య లిఖితపూర్వక ఒప్పందం అనంతరం ఈపరిమితిని 20 శాతానికి పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 20 శాతం శుద్ధి చేసిన యురేనియం కూడా అణ్వాస్త్రాల తయారీకి అవసరమైనవెపన్స్ గ్రేడ్ స్థాయి కంటే తక్కువ అని అధికారులు అంచనావేసారు. రానురాను ఈ సరఫరా 60 నుంచి 90శాతానికి పెరిగే ప్రమాదం కూడా లేకపోలేదని సెనేటర్లే బాహాటంగా చెపుతున్నారు. అందువల్లనే అమెరికా చట్టసభల ప్రతినిధుల్లోనే ఆందోళన పెరుగుతోంది.ఈముప్పుప్రపంచ వినాశనానికి దారితీస్తుందన్న అంచనాలు కూడా వారు వేస్తున్నారు. ఈ ఒప్పందంపై అమెరికా డెమొక్రటిక్ పార్టీకి చెందిన పలువురు సెనేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మసాచుసెట్స్‌కు చెందిన ఎడ్ మార్కీ, ఒరెగాన్కు చెందిన జెఫ్ మెర్క్లే నేతృత్వంలోని సెనేటర్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఈ ఒప్పందం సౌదీఅరేబియాకు దేశీయంగా యురేనియం శుద్ధిచేసే సామర్థ్యాన్ని కల్పించి, భవిష్యత్తులో అణ్వస్త్ర అభివృద్ధికి అవకాశం కల్పించవచ్చని వారు పేర్కొన్నారు. పౌర అణువిద్యుత్ అవసరాలే లక్ష్యమైతే దేశీయంగా యురేనియం శుద్ధి చేసే సామర్థ్యాన్ని సౌదీ ఎందుకు కోరుకుంటోందన్న ప్రశ్ననుకూడా ఆయన లేవనెత్తారు. సౌదీ ప్రభుత్వం సెనేటర్లు లేవనెత్తిన ప్రశ్నలకునేరుగాస్పందించలేదు.అయితే గతంలో ఆ



మహ్మద్ బిన్ సల్మాన్

దేశ ఇంధన మంత్రి అబ్దులఅజీజ్ బిన్ సల్మాన్ చేసిన వ్యాఖ్యలను సూచించింది.సౌదీ అణుకార్యక్రమం శాంతియుతంగా, అత్యున్నత బాధ్యత, పారదర్శకతతో అభివృద్ధి చేస్తామని ఆయన గతంలో పేర్కొన్నారు. దౌత్యపరంగాసాధించగల అత్యంత కఠినమైన అణువ్యాప్తి నిరోధక ప్రమాణాలను కొనసాగిస్తూనే అణు ఇంధన రంగంలో సహకారాన్ని విస్తరించడమే ఒప్పందం లక్ష్యమని తెలిపింది. సౌదీ అరేబియా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ ఐఎఇఎ అదనపు ప్రోటోకాల్ తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధన ఒప్పందంలో లేకపోవడం కూడా ఆందోళనకు కారణమైంది. ఈఅదనపు ప్రోటో కాల్ ద్వారా ఐఎఇఎకు అణుకేంద్రాలు,పరిశోధనా ప్రాంతాలపై మరింత విస్తృత తనిఖీ హక్కులు లభిస్తాయి. సంస్థమాజీ డైరెక్టర్ జనరల్ హాన్స్ బ్లిక్స్‌సహా 20మంది అణువ్యాప్తి నిరోధక నిపుణులుఈవారం అమెరికా కాంగ్రెస్‌కు లేఖరాశారు. ప్రతిపాదిత తనిఖీ విధానం కారణంగా సౌదీఅరేబియాలో ప్రకటించని ప్రాంతాల్లో రహస్యంగా అణు కార్యక్రమం కొనసాగుతోందా లేదా అన్నది గుర్తించడం కష్టమవుతుందని వారు హెచ్చరించారు. ఇరాన్ అణ్వాస్త్రాలు అభివృద్ధి చేస్తే సౌదీ కూడా సిద్ధమేనని సౌదీ అరేబియా గతంలో చేసిన వ్యాఖ్యలు కూడా తాజా చర్చకు కారణమవుతున్నాయి. 2018లో సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ మాట్లాడుతూ,ఇరాన్ అణ్వాస్త్రాన్ని అభివృద్ధి చేస్తే సౌదీ అరేబియా కూడా అణ్వాస్త్రాన్ని అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలపై 2025, 2026లో ట్రంప్‌ప్రభుత్వం ఇజ్రాయెల్తో కలిసి దాడులు నిర్వహించినప్పటికీ, దెబ్బతిన్న అణు కేంద్రాల శిథిలాల కింద ఇరాన్ శుద్ధిచేసిన యురేనియం కొంతమేర మిగిలి ఉండవచ్చని అమెరికామీడియా అంచనావేసింది. సౌదీ అరేబియా అణ్వస్త్ర సామర్థ్యాన్ని అభివృద్ధి చేసే అవకాశం మధ్యప్రాచ్యంలో మరింత విస్తృతమైన అణు ఆయుధ పోటీకి దారితీయవచ్చని కొందరు అమెరికా చట్టసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ట్రంప్ ప్రభుత్వం మాత్రం ఈ అణుఒప్పందంఅమెరికా- సౌదీ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, రష్యా, చైనా వంటిదేశాలతో సౌదీమరింత సన్నిహితంగా అణుసహకారం పెంచుకోకుండా నిరోధించడమే లక్ష్యమని చెబుతోంది. ఈఅణు ఒప్పందానికిసౌదీ అరేబియా-ఇజ్రాయెల్ సంబంధాలసాధారణీకరణ అంశంతోనూ సం బంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్తో దౌత్యసంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడం అణు ఒప్పందానికిఅవసరమైన అంశంగానే కొన సాగుతోందని ట్రంప్ పేర్కొన్నారు.ఇజ్రాయెల్ ప్రభుత్వం పాలస్తీనా దేశం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో, సౌదీ అరేబియా ఇజ్రాయెల్తో దౌత్య సంబంధాలఏర్పాటుకు ఇప్పటివరకు అంగీకరించలేదు. ప్రస్తుతం ఈ అమెరికా-సౌదీ అణు ఒప్పందం 90 రోజుల కాంగ్రెస్ సమీక్షకు లోబడి ఉంది. ఈ వ్యవధిలో అమెరికా చట్టసభ్యులుఒప్పందాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు. ●


---

# మృత్యు శకటాలుగా మారుతున్న ప్రైవేటు స్లీపర్ బస్సులు?



**డాక్టర్ నీలం సంపత్**

ఉత్తరప్రదేశ్ యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై గ్రేటర్ నోయిడా దగ్గర రాత్రి ఢిల్లీ నుండి మహోబా వెళ్తున్న రాజ్ కల్పనా ప్రైవేట్ స్లీపర్ బస్‌లో మంటలు చెలరేగి 9మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు.మరి కొంత మంది మృత్యువుతో పోరాడుతున్నారు. 35మంది ప్రయాణికుల్లో చాలామంది నిద్రలో ఉన్నారు, తెలవితో ఉన్న వారు కిటికీల నుండి దూకి బయటపడ్డారు. కానీ ఇది అనుకోకుండా ఆకస్మాత్తుగా జరిగిన ఒక్క ప్రమాదం కాదు, ఇది దేశవ్యాప్తంగా నిరంతరంగా కొనసాగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సుల ప్రమాదాల పరంపర. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం గత మూడేళ్ల కాలంలో దేశంలో వివిధ ప్రాంతాలలో 45 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు నిప్పంటుకుని 64 మంది చనిపోయారు, 145 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ గణాంకాలు ప్రభుత్వ లెక్కలోకి వచ్చినవి మాత్రమే. మాఫియా రూపాన్ని సంతరించుకుంటున్న ట్రావెల్స్ బస్సుల పరిశ్రమ బస్ ప్రమాదాలను లెక్కలోకి రాకుండా చేసే అవకాశాలు లేకపోలేదనే విశ్లేషకుల అభిప్రాయాలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.గత మూడేళ్లలో దేశాన్ని వణికించిన ఘోరరోడ్డు ప్రమాదాల ఘటనలు తెలుగు రాష్ట్రాల్లోనూ నెత్తుటి చరిత్రను సృష్టించిన వైనం ఆందోళన కలిగిస్తోంది. అక్టోబర్ 24, 2025 కర్నూలు హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ వాల్వో స్లీపర్ బస్ చిన్న టేకూర్ దగ్గర బైక్‌ను ఢీకొని ఒక్కసారిగా మంటలు అంటుకుని 20మంది కాలిపోయారు. వారిలో ఇద్దరు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. 39 మందిలో 20 మంది బయటకు రాలేకపోయారు. అక్టోబర్ 2023 మహబూబ్ నగర్‌లో జరిగన సంఘట తెలుగు ప్రజలుమర్చిపోలేని ఘోరం. బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్‌కల్వర్టును ఢీకొని డీజిల్ ట్యాంక్ పగిలి 45మంది సజీవ దహనమయ్యారు. ఒక్క బస్‌లో 45 శవాలు. దేశవ్యాప్తంగా ప్రైవేట్ బస్సుల మంటల్లో మరణ మృదంగం తీరు గుండెలను జలదరింప జేస్తోంది. అక్టోబర్ 14, 2025 రాజస్థాన్, జైసల్మేర్‌జోధ్ పూర్ వెళ్లే ఎసి స్లీపర్ బస్‌లో షార్ట్ సర్క్యూట్‌తో 20మంది కాలిపోయారు, 16మందికి తీవ్ర గాయాలు. బస్ కొని కేవలం 5రోజులే అయింది.అక్రమంగా ఎసిగా మార్చారు. మే 15, 2025 కిసాన్ పథ్‌పై డబుల్ డెక్కర్ బస్‌లో ఐదు మంది, ఇద్దరు చిన్నారులతో సహా చనిపోయారు. డిసెంబర్ 25, 2025 బెంగళూరు నుండి గోకర్ణ వెళ్తున్న స్లీపర్ బస్‌ను ట్రక్ ఢీకొనడంతో ఏడు మంది చనిపోయారు. జులై 2023 ముంబైనాగపూర్ సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై బస్ పోల్‌ను ఢీకొని 25 మంది చనిపోయారు. ఇది కూడా ప్రైవేట్ స్లీపర్ బస్సే. గత మూడేళ్లలో ఎనిమిది పెద్ద ప్రమాదాల్లో 100 మందికి పైగా చనిపోయారు, అందులో 60 ప్రమాదాలు రాత్రి 12 నుండి ఉదయం 6గంటల మధ్యనే జరిగాయి అంటే ప్రయాణికులు నిద్రలో ఉన్నప్పుడే చనిపోతున్నారు. మెజార్టీ ప్రైవేట్ స్లీపర్ బస్సుల రిజిస్ట్రేషన్ నిర్మాణాలు తక్కువ వ్యయం నేపథ్యంలో దక్షిణాదిన గోవా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో జరుగుతుండడం గమనార్హం. తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఇతర అనేక రాష్ట్రాలలో ప్రైవేటు స్లీపర్ బస్సుల నిర్మాణం ఇక్కడ జరగకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. లోప భూయిష్టమైన నిర్మాణంతో ప్రమాదాల సమయంలో తప్పించుకునే దారి లేకుండా పోతుంది. స్లీపర్ కన్వర్షన్ కోసం ఎమర్జెన్సీ డోర్ స్థానంలోనూ ఓ బెర్త్‌ని ఏర్పాటు చేస్తున్నారు. బస్‌లో 4 ఎగ్జిట్‌లు ఉంటాయి. కానీ ప్రైవేట్ బస్సుల యజమానులు లాభం కోసం ఎమర్జెన్సీ డోర్‌ను మూసేసి అక్కడ కూడా బెర్త్ వేస్తున్నారు. 2 అడుగుల ఇరుకైన నడవలో ఒకరు పడితే అందరూ చిక్కుకుపోతారు. మండే గుడ్డలతో బస్ సీట్లు, కర్టెన్లు, పరుపులన్నీ త్వరగా అంటుకునే రెక్సిన్,



ఫోమ్‌తో తయారు చేస్తారు. ఎసి గ్యాస్, డీజిల్, అక్రమ వైరింగ్‌తో కలిసి 2 నిమిషాల్లోనే బస్ మొత్తం నిప్పుల కొలిమిలా మారుతుంది. ఫిట్నెస్ సరిగా లేని వాహనాలను నకిలీ ఫిట్నెస్‌లతో నడుపుతున్నారనే దేశ ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారే స్వయంగా చెప్పారు. గతంలో 'కర్నూలులో కాలిపోయిన బస్ నకిలీ లోగోతో, అక్రమంగా స్లీపర్‌గా మార్చిన బస్' అని. అంటే ఆర్‌టిఓ అధికారుల కళ్లుగప్పి ఈ తరహా అక్రమాలకు తెరదీస్తున్నారనిపిస్తోంది. కొంత మంది రవాణాశాఖ అధికారులు సైతం అక్రమ సంపాదనలకు అలవాటు పడి ఫిట్‌నెస్ లేని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీచేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటికి తోడు సరైన డ్రైవింగ్ నైపుణ్యాలు, శిక్షణ లేని డ్రైవర్లు, వారిపై అధిక పని ఒత్తిళ్లతో ఏర్పడుతున్న అలసట, నిద్ర లేమి, కొన్ని సందర్భాల్లో మొబైల్ చూస్తూ వాహనాలను నడుపుతుండడం, మద్యం మత్తులో వాహనాలను నడుపుతుండడం, మరి కొన్నిచోట్ల రోడ్ల నిర్మాణంలో లోపాలు కూడా ప్రమాదాలకు కారణమోతున్న వైనం శోచనీయమే. దేశ రహదారులపై నిరం తరం మృత్యు ఘంటికలను మోగిస్తూ, పెద్ద మొత్తంలో ప్రాణ నష్టంతో పాటు కోట్ల రూపాయల దేశ సంపదను ధ్వంసం చేస్తున్న ప్రైవేటు స్లీపర్ బస్సుల అకృత్యాలను నివారించడానికి ప్రతి స్లీపర్ బస్‌లో ఇంజిన్‌లో ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్, 10 రీబిల రెండు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ప్రతి కిటికీ వద్ద హామర్ తప్పనిసరి. ఇది 2016 నుండి తి.ళీ 119 నిబంధనలోనే ఉంది, కానీ అమలులో మాత్రం అంతంత మాత్రంగా కొన సాగుతున్న వైనం దురదృష్టకరం. తెలంగాణ,ఏపీ ప్రభుత్వాలు రాత్రి 10 గంటల తర్వాత హైదరాబాద్ విజయవాడ, హైదరాబాద్ బెంగళూరు హైవేలపై ప్రత్యేక తనిఖీ బృందాలను పెట్టాలి. ఫిట్నెస్ లేని బస్‌లను సీజ్ చేయాలి. యజమానిపై 304ఎ కాదు, 304 నరహత్య కేసు పెట్టాలి. ప్రయాణికులు సైతం దయచేసి ఎక్కేముందు ఒక నిమిషం చూడండి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉందా?డ్రైవర్ మద్యం తాగాడా? వాసన వస్తోందా? ఇలాంటి విషయాలను పరిశీలించిన తర్వాతనే బస్ ఎక్కం డి. లేకపోతే ఆ బస్ ఎక్కకండి. మీ ప్రాణం కంటే విలాస వంతమైన, వేగ వంతమైన ప్రయాణాలు ఎక్కువ కాదు. నిన్న యూపీలో 9, మొన్న కర్నూలులో 20, అంతకు ముందు మహబూబ్ నగర్‌లో 45 ఈ లెక్క ఎక్కడ ఆగుతుంది? బస్ పరిశ్రమలోని మాఫియాను ఆపకపోతే, రేపు మనమూ మన బిడ్డలు కూడా ఈ కదులుతున్న స్మశా నాల్లో ప్రయాణించాల్సి వస్తుంది. ఇటీవల కాలంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ తీసుకున్న ఆటో మేటెడ్ టెస్టింగ్ సెంటర్లు ఆశించిన ఫలితాలను ఇవ్వవచ్చనే నిపుణులను కుంటున్నారు. ఈ క్రమంలో ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ఎన్నిక నినాదంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం ఒకే రవాణా విధానంతో ముందుకు సాగితే పొరుగు రాష్ట్రా లలో రిజిస్ట్రేషన్‌లు, బస్సుల నిర్మాణ లోపాలకు తెరపడొ చ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఘోర దుర్ఘటనలు జరి గిన ప్రతిసారి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట పరిహారాన్ని ప్రకటించడం ద్వారా ప్రమాదాల బాధితులకు ఎంతో కొంత సాంత్వన చేకూరుస్తుండడం తెలిసినదే. ఐతే పరిహారంతో పోయిన ప్రాణం తిరిగి రాదు గదా. అందుకనే ప్రమాదం జరగకుండా చూడడమే సమర్థవంతమైన పాలనా విధానంగా భావిస్తూ ప్రభుత్వాలు ముందుకు సాగే క్రమంలో నిస్వార్థంతో రోడ్డు ప్రమాదాల రహిత దేశ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న యన్.జి.ఓ.లు, బాధ్యతాయుతమైన పత్రికలూ, ప్రసార సాధనాలతో పాటు చైతన్య వంతులైన పౌర సమాజం తోడ్పాటు ఆశించిన ఫలితాలను అందిస్తాయని చెప్పక తప్పదు. ●

# భారీగా క్షీణించిన ట్రంప్ ప్రతిష్ట

## - 36 యేళ్లలో అత్యల్ప ప్రజాదరణ - కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతు

**వాషింగ్టన్,సెప్టెంబరు 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రజాదరణ గణనీయంగా పడిపోయింది. వాల్ స్ట్రీట్ జర్నల్ సర్వేలో ట్రంప్‌కు కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. 61 శాతం మంది ఆయన పనితీరును తిరస్కరించారు. 1990 నుంచి నిర్వహిస్తున్న ఈ పోలింగ్ గణాంకాల ప్రకారం మధ్యంతర ఎన్నికలకు ముందు ఏ అధ్యక్షుడికైనా నమోదైన అత్యల్ప ఆమోద రేటు ఇదేనని ఒక జర్నల్ పేర్కొంది. అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ట్రంప్ ప్రజాదరణలో భారీ క్షీణత కనిపించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రజాదరణ తగ్గడానికి ప్రధాన కారణాల్లో ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, పెరుగుతున్న ఇంధన ధరలు ఉన్నట్లు తాజా సర్వేలు సూచిస్తున్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ట్రంప్ ధరలను నియంత్రిస్తానని, అనవసరమైన యుద్ధాలకు దూరంగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే ఏడు నెలలు గడిచినా యుద్ధానికి ముగింపు కనిపించకపోవడంతో పాటు ఇంధన ధరలు కూడా పెరిగాయి. మరో అంతర్జాతీయ సర్వేలోనూ ట్రంప్ ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్నట్లు వెల్లడైంది. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ఆయనకు 47 శాతం ఆమోదం ఉండగా మార్చి మధ్య నాటికి అది 40 శాతానికి, యుద్ధం ప్రారంభమైన మూడు వారాల తర్వాత 36 శాతానికి పడిపోయింది. ఆగస్టు మధ్య నాటికి 33 శాతానికి, ఈనెల 21న 32 శాతానికి చేరింది. ఇది ఆయన రాజకీయ జీవితంలోనే అత్యల్ప స్థాయి అని ఈసర్వే తెలిపింది. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు ప్రజల మద్దతు కూడా తగ్గుతోంది. మార్చిలో 37 శాతం మంది సైనిక చర్యకు మద్దతు ఇవ్వగా, ఆగస్టు చివరి నాటికి అది 31 శాతానికి పడిపోయింది. మరోవైపు, 83 శాతం మంది ఈ యుద్ధం ఇంకా కొనసాగుతుందని భావిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. ట్రంప్‌కు మరో ప్రధాన సమస్య జీవన వ్యయం. మార్చిలో జీవన వ్యయాన్ని ట్రంప్ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుపై 25 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నాటికి ఈ సంఖ్య 17 శాతానికి పడిపోయింది. తమ పార్టీ కాంగ్రెస్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే ప్రతి ఓటరుకు 5,000 డాలర్ల డివిడెండ్ అందించే ప్రతిపాదనను కూడా ఆయన ప్రస్తావించారు. ట్రంప్ పాలనకు ఇప్పుడు డెమొక్రాట్లు, స్వతంత్ర ఓటర్ల నుంచి మాత్రమే కాకుండా సొంత పార్టీ రిపబ్లికన్ల నుంచి కూడా వ్యతిరేకత పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. సర్వే ప్రకారం సెప్టెంబర్‌లో ఒక్క వారంలోనే రిపబ్లికన్లలో ట్రంప్ ఆమోదం 82 శాతం నుంచి 73 శాతానికి పడిపోయింది. తొలిసారిగా ఈ పదవీకాలంలో ట్రంప్ జీవన వ్యయంపై ఆయన పనితీరును వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ల సంఖ్య (51 శాతం) మద్దతు ఇస్తున్న వారి సంఖ్య (44 శాతం) కంటే ఎక్కువైంది. అయితే ట్రంప్ ఆమోద రేటుపై అన్ని సర్వేలు ఒకే అంచనాను ఇవ్వడం లేదు. అమెరికన్ రీసెర్చ్ గ్రూప్ సర్వేలో ఆయన ఆమోదం 29 శాతంగా ఉండగా, సెప్టెంబర్ ప్రారంభంలో హార్వర్డ్ క్యాప్స్/హారిస్ నిర్వహించిన సర్వేలో నమోదైన ఆమోదం 44 శాతంగా ఉంది. సిల్వర్ బులెటిన్ సగటు అంచనా 37.6 శాతం, ఫిఫ్టీ ప్లస్ వన్ సగటు 34.6 శాతంగా ఉంది. సర్వే పద్ధతులు, నమూనాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ట్రంప్ ప్రజాదరణ తగ్గుతున్న దిశ మాత్రం స్పష్టంగా కనిపిస్తోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన మధ్యంతర ఎన్నికల సదస్సులో ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి నేను బ్యాలెట్‌పై ఉన్నానని ఊహించుకోండని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్లు నిజంగానే మధ్యంతర ఎన్నికలను ట్రంప్ పాలనపై ప్రజాభిప్రాయ పరీక్షగా చూస్తున్నారా అన్నది కీలకంగా మారింది. తక్కువ ఆమోద రేటు తప్పనిసరిగా భారీ ఎన్నికల పరాజయానికి దారితీస్తుందని చెప్పలేం. మధ్యంతర ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పోటీ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. 2022 మధ్యంతర ఎన్నికలకు ముందు జో బైడెన్ ఆమోద రేటు గ్యాలప్ సర్వేలో 40 శాతంగా ఉన్నప్పటికీ, డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో కేవలం తొమ్మిది స్థానాలను మాత్రమే కోల్పోయారు. గ్యాలప్ 1946 నుంచి సేకరించిన గణాంకాల ప్రకారం, అధ్యక్షుడి ఆమోద రేటు 50 శాతం కంటే తక్కువగా ఉన్న సందర్భాల్లో ఆయన పార్టీ ప్రతినిధుల సభలో సగటున 37 స్థానాలను కోల్పోయింది. ట్రంప్ ప్రస్తుత ఆమోద రేటు, ఇరాన్ యుద్ధంపై ప్రజల అభిప్రాయం, జీవన వ్యయం మరియు ఇంధన ధరలపై అసంతృప్తి నవంబర్ మధ్యంతర ఎన్నికలకు ముందు అమెరికా రాజకీయాల్లో కీలక అంశాలుగా మారుతున్నాయి.

# ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారు

## డీఎంకె మాజీ సిఎం స్టాలిన్ సెటైర్లు

**చెన్నై,సెప్టెంబరు 26:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండి పడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశం చినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

# అణ్వాయుధాల తయారీ దిశగా సౌదీ అరేబియా



## అమెరికా నిఘా వర్గాల అంచనా

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** అణ్వాయుధ తయారీలో పశ్చిమాసియా దేశాల మధ్య పోటీపై మళ్లీ చర్చ మొదలైంది. సౌదీ అరేబియా అణ్వాయుధాల తయారీ దిశగా వెళ్లే అవకాశాన్ని కొట్టిపారేయలేమని యుఎస్ నిఘా వర్గాలు అంచనా వేశాయి. అణుబాంబులు తయారుచేసేందుకు ఆ దేశం ఆసక్తి చూపించొచ్చని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్య కాంగ్రెస్‌కు అందించిన తమ రహస్య నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. పౌర అవసరాల కోసం సౌదీ అరేబియాకు యురేనియం ఇచ్చేందుకు.. ఆ దేశంతో 30 యేళ్ల సుదీర్ఘకాల ఒప్పందానికి ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంపై అమెరికా చట్టసభ సభ్యుల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీకి యురేనియం శుద్ధి సాంకేతికతను అందిస్తే.. భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీకి అవసరమైన సామర్థ్యం వారికి అందుబాటులోకి వస్తుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం సౌదీకి 5 శాతం లోపు మాత్రమే యురేనియం శుద్ధికి పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తులో దీనిని 20 శాతానికి పెంచే అవకాశంపై చర్చ జరుగుతోంది. అయితే అణ్వాయుధాల తయారీకి సాధారణంగా 60-90 శాతం వరకు శుద్ధి చేసిన యురేనియం అవసరమవుతుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ అణుబాంబులను తయారుచేస్తే.. భద్రతా కారణాల దృష్ట్యా తాము కూడా అణ్వాయుధాలను సమకూర్చుకోవాల్సి వస్తుందని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గతంలో హెచ్చరించడం గమనార్హం.

# వీసా ఫీజుపెంపుపై 22 రాష్ట్రాలు వ్యతిరేకం

## ఒక్కటయిన అటార్నీ జనరల్స్

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** అమెరికాలో కొన్ని రకాల హెచ్1బీ వీసా పిటిషన్లపై లక్ష డాలర్ల (సుమారు రూ. 95 లక్షలు) ఫీజు విధించాలని ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని, దేశంలో ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులు, నర్సుల కొరతను ఇది మరింత తీవ్రతరం చేస్తుందని వాదిస్తూ 22 అమెరికా రాష్ట్రాల అటార్నీ జనరల్స్ ఏకమయ్యారు. ఈ మేరకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్)కు అధికారికంగా లేఖ రాశారు. ఈ ఏడాది ఆగస్టు 25న యూఎస్‌సీఐఎస్ ఈ కొత్త నిబంధన ముసాయిదాను జారీ చేసింది. వార్షిక హెచ్1బీ వీసా పరిమితి నుంచి మినహాయింపు లేని కంపెనీలు దాఖలు చేసే పిటిషన్లపై ఏకంగా 103,265 డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ భారీ మొత్తాన్ని ఫీజుగా కాకుండా ఒక రకమైన పన్నుగా అటార్నీ జనరల్స్ అభివర్ణించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా కేవలం పరిపాలనాపరమైన చర్యల ద్వారా ఇలాంటి పన్ను విధించే అధికారం ప్రభుత్వానికి లేదని వారు స్పష్టం చేశారు. కాలిఫోర్నియా, న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్ వంటి కీలక రాష్ట్రాలతో పాటు మొత్తం 22 రాష్ట్రాలు ఈ వ్యతిరేక కూటమిలో ఉన్నాయి. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్ ద్వారా అమెరికా కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన విదేశీ నిపుణులను నియమించుకుంటాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులకు ఈ వీసాలు కీలకం. ఈ కొత్త ప్రతిపాదన అమలైతే, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కోసం విదేశీయులపై ఆధారపడే అమెరికన్ కంపెనీలకు, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న ప్రభుత్వ సంస్థలకు పెనుభారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నం జరగడం ఇది మొదటిసారి కాదు. 2025లో అధ్యక్షుడి ఆదేశాల ద్వారా విధించిన లక్ష డాలర్ల ఫీజును, కాంగ్రెస్ అనుమతి లేదన్న కారణంతో 2026 జూన్‌లో ఒక ఫెడరల్ జడ్జి చట్టవిరుద్ధమని కొట్టివేశారు.

# నకిలీ ఆధార్‌ను పట్టే అద్భుతవ్యవస్థ ఆవిర్భావం!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు భారత్ ఏబీఐఎస్ అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది. భారత్ ఏబీఐఎస్ అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీమోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 కెబి పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు. ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్‌ఎన్‌ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5 ఎఫ్‌పీఐఆర్, 0.1 ఎఫ్‌ఎన్‌ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు భారత్ ఏబీఐఎస్ వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా బీ100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది.

# ఎస్సీ,ఎస్టీ ఎంపీలకు మాట్లాడే సమయం కేటాయించాలి!

## బీహార్ మాజీ సిఎం జతిన్‌రామ్ మాంజీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు. ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

# నాగాలాండ్‌లో కల్తీమద్యం సేవించి 19 మంది మృతి

**కోహిమా, సెప్టెంబరు 26:** నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది దాని సరఫరా వెనుక ఎవరున్నారు అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు. మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు.



# దేశంలో 428.55 కోట్లకుపెరిగిన పర్యాటకులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** భారత పర్యాటక రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక చోదకశక్తిగా మారుతోంది. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2025 సంవత్సరంలో దేశీయ పర్యాటకుల సంఖ్య ఏకంగా 428.55 కోట్లకు చేరుకోగా, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.53 కోట్లకు పెరిగింది. దీని ద్వారా దేశానికి రూ. 2,76,831 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పర్యాటక రంగం దేశ జీడీపీకి 5.22 వాటాను అందించడంతో పాటు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 8.46 కోట్ల మందికి ఉపాధి అవకాశాలను కల్పించిందని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటక రంగం 2024లో గ్లోబల్ జీడీపీలో 10 వాటాను (10.9 ట్రిలియన్ డాలర్లు) కలిగి ఉండటం గమనార్హం. ఈ ఏడాది డిజిటల్ ఎజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ థీమ్‌తో పర్యాటక దినోత్సవం జరగనుండగా, ఆ దిశగా భారత్ ఇప్పటికే కీలక అడుగులు వేస్తోంది. ఈవీసా, ఇన్‌క్రెడిబుల్ ఇండియా డిజిటల్ ప్లాట్‌ఫామ్, నిధిప్లస్ వంటి కార్యక్రమాలతో డిజిటల్ టూరిజం వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా 2014లో 43 దేశాలతో ప్రారంభమైన ఈవీసా సౌకర్యం ఇప్పుడు 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చింది. దేశంలోని 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు సహా మొత్తం 88 అంతర్జాతీయ పోర్టుల ద్వారా ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు. ప్రస్తుతం భారత్ జారీ చేస్తున్న మొత్తం వీసాలలో 78 ఈవీసాలే ఉండటం, 95 దరఖాస్తులను 72 గంటల్లోనే ప్రాసెస్ చేస్తుండటంతో విదేశీ పర్యాటకులకు ప్రయాణం సులభతరమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్లాట్‌ఫామ్ ద్వారా పర్యాటకులకు వర్చువల్ అనుభూతిని అందిస్తున్నారు. దీని సహాయంతో రియల్‌టైమ్ వాతావరణ సమాచారం.



# నవంబరు తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు

## శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే.. అందుకు బదులుగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతోపాటు అణుచర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళికను అగ్రరాజ్యానికి తెలియజేశామని.. దీనిపై ఒప్పందం కుదిరితే హార్ముజ్‌ను ఏడు రోజుల్లో తిరిగి తెరుస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, దీనిపై ట్రంప్ విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. శాంతి ప్రణాళికకు ఇరాన్ కట్టుబడి ఉంటుందా? అనే దానిపై అమెరికా అధ్యక్షుడికి పలు సందేహాలు ఉన్నాయని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. హార్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకే ఉందని ట్రంప్ పదే పదే వాదిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అడుగు ముందుకేసి.. 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్టు చేశారు. హార్ముజ్ పేరుకు బదులుగా 'ట్రంప్ జలసంధి' అని రాసి ఉన్న మ్యాప్ ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం హార్ముజ్‌లో అమెరికా దిగ్బంధనంతోపాటు ఇరాన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. దీంతో నౌకల రాకపోకలకు ఇబ్బంది కొనసాగుతూనే ఉంది. తమ ఆస్తులను విడుదల చేయాలని.. చమురుపై ఆంక్షలను తొలగించి, సైనిక చర్యకు ముగింపు పలకాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అలా జరిగితే హార్ముజ్‌లో స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం లభిస్తుందని చెబుతోంది.

# చంద్రుడి దక్షిణధృవంపై చైనా, అమెరికాల ఫోకస్



**నాసా, సెప్టెంబరు 26:** చంద్రుడిపై మళ్లీ మనుషుల అడుగులు పడబోతున్న వేళ అక్కడి కొన్ని ప్రాంతాల కోసం అమెరికా, చైనా మధ్య పోటీ ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా చంద్రుడి దక్షిణ ధ్రువం ఇప్పుడు అత్యంత కీలక ప్రాంతంగా మారింది. చైనా ముందుగా అక్కడి కొన్ని ప్రాంతాల్లో మిషన్లు ఏర్పాటు చేస్తే తర్వాత అమెరికా అక్కడికి చేరడం కష్టమయ్యే అవకాశం ఉందని నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మన్ హెచ్చరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఎప్పుడూ ఎండ పడని ప్రాంతాలు ఉన్నాయి. వీటినే పర్మనెంట్ షాడోడ్ రీజియన్స్ అంటారు. ముఖ్యంగా షాక్లెటన్ క్రేటర్ ఇలాంటి ప్రాంతాల్లో ఒకటి. అక్కడ మంచు రూపంలో నీరు ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భవిష్యత్తులో నీరు, ఇంధనం వంటి వనరుల కోసం ఇవి కీలకంగా మారొచ్చని నాసా చెబుతోంది. చైనా చేపట్టనున్న చాంగ్‌ఈ7 మిషన్ కూడా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్నే లక్ష్యంగా చేసుకుంది. షాక్లెటన్ క్రేటర్ సమీప ప్రాంతాలపై ఈ మిషన్ దృష్టి పెట్టినట్లు ఐజాక్‌మన్ తెలిపారు. చైనా మిషన్ ఆలస్యం కావడం వల్ల అమెరికాకు కొంత సమయం దొరికిందని ఆయన వ్యాఖ్యానించారు. చాంగ్‌ఈ7లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్, మొబైల్ హాపర్ వంటి నాలుగు రోబోటిక్ వాహనాలు ఉండనున్నాయి. ఇక్కడే అసలు ఆసక్తికరమైన విషయం ఉంది. చంద్రుడిపై ల్యాండర్లు దిగే ప్రాంతాల చుట్టూ భద్రతా కారణాలతో ఇతర వాహనాలు కొంత దూరాన్ని పాటించాల్సి ఉంటుంది. అందువల్ల ఒక దేశం ముందుగా కీలక ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభిస్తే.. అదే ప్రాంతానికి మరో దేశం చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అంటే చంద్రుడిపై భూమిపై ఉన్నట్లుగా గోడలు కట్టి సరిహద్దులు పెట్టడం కాదు. కానీ కీలక ప్రాంతాల్లో ముందుగా ల్యాండింగ్, పరికరాల ఏర్పాటు, కార్యకలాపాలు మొదలైతే ఇతర దేశాలకు అక్కడికి చేరుకోవడం మరింత క్లిష్టం కావచ్చు. ఇదే ఇప్పుడు అమెరికా ఆందోళనకు కారణం. చైనా మిషన్ ఆలస్యం కావడంతో అమెరికా ప్రణాళికలకు కొంత అవకాశం లభించింది. నాసా ప్రకారం.. బ్లూ ఆరిజిన్ రూపొందిస్తున్న బ్లూ మూన్ మార్క్1 ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంలోని షాక్లెటన్ కనెక్టింగ్ రిడ్జ్‌కు వెళ్లేలా ప్రణాళిక ఉంది. నాసా షెడ్యూల్‌లో ఈ మిషన్ 2027 జనవరిలో లక్ష్యంగా ఉంది. అక్కడ రెండు నాసా శాస్త్రీయ పరికరాలను దింపనుంది. భవిష్యత్తులో మనుషుల మిషన్లకు అవసరమైన ల్యాండింగ్ సాంకేతికతను పరీక్షించడం కూడా దీని లక్ష్యం. చంద్రుడిపై నీటి ఆనవాళ్లు, భవిష్యత్తు స్థావరాలకు అనువైన ప్రాంతాలు, అక్కడి వనరులపై పరిశోధనలు వేగం పుంజుకుంటున్నాయి.

# సంక్షిప్త వార్తలు

## ఉంగా వేదికగా పాక్ వైఖరిని ఎండగట్టిన భారత్

**న్యూయార్కు, సెప్టెంబరు 26:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య మరోసారి మాటల యుద్ధం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగానికి భారత్ తన రైట్ ఆఫ్ రిప్లై హక్కును వినియోగించుకుని దీటైన సమాధానమిచ్చింది. ఉగ్రవాదాన్ని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని



భారత దౌత్యవేత్త పేతల్ గెహ్లాట్ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించారు.

## కాంగోలో కుప్పకూలిన రక్షణ విమానం:14 మంది మృతి




కిన్షాసా, సెప్టెంబరు 26: కాంగోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. విమానం కూలిపోవడంతో ఇద్దరు సీనియర్ సైనిక అధికారులతో సహా కనీసం 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని కాంగో సైన్యం వెల్లడించింది. మృతుల్లో మిలిటరీ కోర్టు అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ముటోంబో కటలాయి టియెండే, సాయుధ దళాల ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ బకుమి లికులియా ఉన్నారు. వీరితో పాటు ప్రతినిధి బృందంలోని 12 మంది, విమాన సిబ్బంది కూడా ప్రమాదంలో మృతి చెందినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

## సూపర్ ఎల్‌నినోతో మహారాష్ట్రను చుట్టుముట్టిన కరవు!

**ముంబయి, సెప్టెంబరు 26:** సూపర్ ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది దేశంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. ఏ రాష్ట్రంలో చూసినా ఈ పరిస్థితులే ఉన్నాయి. ఆశించిన స్థాయిలో ఎక్కడా కూడా వర్షాలు పడలేదు. దీంతో కరవు ఛాయలు అలుముకుంటున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 74 శాతం తాలూకాల్లో తీవ్ర వర్షాభావం ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో పంటలు దెబ్బతినడంతో పాటు పలు ప్రాంతాల్లో నీటి కొరత కూడా ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 358 తాలూకాల్లో 265 తాలూకాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

## యూరోప్‌తో యుద్ధచర్యలకు మేం సిద్ధం కానేకాదు: పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 26:** రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూరప్‌తో ఎలాంటి రకమైన యుద్ధానికీ రష్యా సిద్ధం కావడం లేదని స్పష్టం చేశారు. యూరప్ దేశాలపై రష్యా దాడికి సిద్ధమవుతోందంటూ కొందరు యూరప్, నాటో సభ్య దేశాలు చేస్తున్న హెచ్చరికలను తోసిపుచ్చారు. అదే సమయంలో ఉక్రెయిన్‌తో శాంతి చర్చలను పునఃప్రారంభించే ప్రతిపాదనలు ఇంకా తమ ముందే ఉన్నాయని తెలిపారు. శుక్రవారం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో మీడియాతో మాట్లాడిన పుతిన్ యూరప్ దేశాలతో ఉద్రిక్తతలను పెంచుకోవాల్సిన అవసరం రష్యాకు ఏ మాత్రం లేదన్నారు.

## 13 మంది తాలిబన్లు హతం: పాక్

**కాబూల్, సెప్టెంబరు 26:** పాకిస్థాన్‌ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఆఫ్ఘన్ తాలిబన్లు తమ భూభాగంలోకి చొరబడి దాడి చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని విజయవంతంగా అడ్డుకున్నామని పాకిస్థాన్ భద్రతా దళాలు ప్రకటించాయి. ఈ ప్రతిదాడిలో కనీసం 13 మంది తాలిబన్ సిబ్బంది మరణించారని, పలువురు గాయపడ్డారని పాక్ సమాచార మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది.

బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని గులిస్థాన్ సెక్టార్‌లో ఈ ఘటన జరిగింది. ఆఫ్ఘన్ వైపు నుంచి తాలిబన్లు పాక్ భూభాగంలోకి ప్రవేశించి దాడికి యత్నించారు.

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 140 మి.యూనిట్లకు కసరత్తు

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో రోజుకు 140 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి కసరత్తు జరుగుతోందని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో వెల్లడించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో యాదాద్రి పనులు పునఃప్రారంభించిన ఏడాదిలోపే, జనవరి 2025 లో మొదటి 800 మెగావాట్ల యూనిట్ ప్రారంభించబడిందని తెలిపింది. 2025-26 మరియు 2026-27 సంవత్సరాల మధ్య మరో మూడు యూనిట్లు (3/800 మెగావాట్లు) ప్రారంభించబడ్డాయి. ఆ ఫలితంగా ప్రస్తుత 2026-27 కాలంలో జెన్కో మొత్తం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగి 7,180 మెగావాట్లకు చేరింది. పదేళ్లలో కొత్తగా ఒక్క బొగ్గు గనిని సాధించక పోవడం, ఉన్న గనులు కొన్ని మూసివేయడం వంటి కారణాలతో సింగరేణి బొగ్గు సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంది. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు నిల్వలను పెంచడమే కాకుండా, నాణ్యమైన బొగ్గును నిరంతరం అందుబాటులో ఉంచేందుకు నైనీ బొగ్గు గనుల నుంచి ప్రతిరోజూ 2 రైళ్ల ద్వారా బొగ్గు రవాణా అయ్యేలా చర్యలు చేపట్టింది. ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్లాంట్‌కు అవసరమైన నాణ్యమైన బొగ్గు సరఫరా కోసం మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి నాణ్యమైన బొగ్గును రవాణా చేయడానికి ప్రభుత్వం తగిన చర్యలను ప్రారంభించింది. మూడు సంవత్సరములలో పూర్తి చేయవలసిన, భద్రాద్రి ప్రాజెక్టు దాదాపు 7 ఏళ్ళ సమయం పట్టింది. 2022 లోనే నాలుగు యూనిట్లు వాణిజ్య ఉత్పత్తి మొదలైనప్పటికీ, భద్రాద్రి ప్లాంట్‌లో బొగ్గు హ్యాండ్లింగ్ ప్లాంట్ మరియు మెయిన్ ప్లాంట్ నిర్మాణ సంబంధమైన రకరకాల సమస్యలు తలెత్తడం వలన ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరగలేదు. ఆ రకంగా తొలినాళ్లలో ఉన్న ప్రారంభ సమస్యలను అధిగమించి 2025-26లోనే తొలిసారి 80 శాతం పిఎల్ఎఫ్ దాటడం జరిగింది. 2023 డిసెంబర్ నాటికి థర్మల్ స్థాపిత సామర్థ్యం జెన్కో పరిధిలో 4042.5 మెగావాట్లు అందుబాటులో ఉండేది. ఇప్పుడు థర్మల్ సామర్థ్యం 7180 మెగావాట్లకు చేరింది. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న సంస్కరణల వలన ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 2022-23లో రోజుకు సగటున 69.71 మెగావాట్లుగా ఉన్న జెన్కో మొత్తం థర్మల్ ఉత్పత్తి, 2025-26 నాటికి రోజుకు 78.88 మెగావాట్లకు పెరిగింది. కాగా, 2026-27 ఆరంభంలో రోజువారీ సగటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఏకంగా 90.23 మి.యూ. గరిష్ట స్థాయిని తాకింది. అంతేకాకుండా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా యాదాద్రి లో రోజుకు 140 మెగావాట్లు సగటున ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జెన్కో అధికారులు వెల్లడించారు.




శనివారం వారణాసిలో దైనిక్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

## ఆధునిక విద్యకు భారతీయ జ్ఞాన పరంపరను జోడించాలి

### కొత్తతరానికి జ్ఞానం, విజ్ఞానంతోపాటు సంస్కారాలు అవసరం: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** భారతీయ జ్ఞాన పరంపరను ఆధునిక విద్య, విజ్ఞానంతో సమన్వయం చేసి కొత్త తరాన్ని తీర్చిదిద్దాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విద్య ఉపాధికే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించాలని పేర్కొన్నారు. శనివారం వారణాసిలో దైనిక్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయ జ్ఞాన పరంపర – కొత్త తరం: విద్య, సంస్కారాలు, భవిష్యత్తు' సదస్సుకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వేదాలు, ఉపనిషత్తులు, యోగా, ఆయుర్వేదం, గణితం, ఖగోళ విజ్ఞానం వంటి భారతీయ జ్ఞానసంపదను కొత్త తరానికి చేరువ చేయాలన్నారు. సత్యనిష్ఠ, కర్తవ్యబోధ, కరుణ, ప్రకృతి పట్ల బాధ్యత వంటి విలువలను శాస్త్రీయ దృక్పథంతో సమన్వయం చేయాలని గవర్నర్ సూచించారు. దైనిక్ జాగరణ్ మాజీ ప్రధాన సంపాదకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ నరేంద్ర మోహన్ సేవలను గవర్నర్ శివప్రతాప్‌శుక్లా స్మరించుకున్నారు. కార్యక్రమంలో సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బిహారీలాల్ శర్మ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అజిత్ కుమార్ చతుర్వేది, పద్మభూషణ్ డాక్టర్ దేవీ ప్రసాద్ ద్వివేది, పద్మశ్రీ రాజేశ్వర్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.92,866 విద్యుత్ బిల్లు రద్దు

### విద్యుత్ పంపిణీ సంస్థకు వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారునికి రూ.92,866 కరెంట్ బిల్లును వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. అంతేకాకుండా మీటరును అమర్చాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్‌ను) ఆదేశించింది. అలాగే వినియోగదారునికి మానసిక వేదన కలిగించినందుకు పరిహారంగా మరో రూ.5 వేలు, వ్యాజ్యపు ఖర్చుల కింద ఇంకో రూ.5 వేలు చొప్పున ఇద్దరు విద్యుత్ అధికారులు ఉమ్మడిగా, విడివిడిగా చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వు తేదీ నుండి 45 రోజుల్లోగా అధికారులు ఈ ఆదేశాలను అమలు చేయాలని తెలిపింది. కోర్టు ఉత్తర్వులను అమలుచేయని పక్షంలో డిపాజిట్ అయిన తేదీ నుండి నష్టపరిహారంపై 12 శాతం మేర వార్షిక వడ్డీ విధించబడుతుందని హెచ్చరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా కు చెందిన గజేందర్ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. తాను కొనుగోలు చేసిన ఇంటికి క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నానని, అయితే బిల్లులోని గత రీడింగ్‌తో సంబంధం లేకుండా 9,699 యూనిట్లుగా తప్పుడు మీటరు రీడింగ్ నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.92,866 చెల్లించాలని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఒత్తిడి తెచ్చారన్నారు. చివరకు సర్వీస్‌ను కూడా నిలిపివేశారని చెప్పారు. ఈ కేసు సీసీ నెంబరు 107/2025గా నమోదైంది. అధికారుల వాదనలు కూడా విన్న వినియోగదారుల కమిషన్ బిల్లింగ్ రికార్డుల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించింది. కమిషన్ బిల్లింగ్ వరిత్రను పరిశీలించి అందులో వ్యత్యాసాలను గమనించింది. అకస్మాత్తుగా రీడింగ్ పెరగడాన్ని కనుక్కొని కమిషన్ విద్యుత్ అధికార్ల వ్యవహారాన్ని తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో భారీగా వచ్చిన బిల్లును రద్దు చేయడంతో పాటు, సర్వీస్ మీటరును అమర్చాలని వినియోగదారుల కమిషన్ ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.



డిజిపి కార్యాలయంలో శనివారం జరిగిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్ తదితరులు.

## డిజిపి కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 26: ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకర్లను ధైర్యంగా ఎదుర్కొన్న వీరనారి చాకలి ఐలమ్య జయంతి వేడుకలు శనివారం డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్ ఐలమ్మ చిత్ర పటానికి పూలమాట వేసి నివాళులు అర్పించారు. ఐలమ్మ సేవలను మహేష్ భగవత్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఈ సంద ర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐజి అడ్మిన్ అన్యోన్య, స్పోర్ట్స్ డిఎస్‌పి సత్యనారాయణ, సిఎస్ఓ యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాటి నిజాం, రజాకార్ల పాలనను తలపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ వీరత్వానికి, పౌరుషానికి, ఆత్మగౌరవ పోరాటానికి చిరునామా వీరనారి చాకలి ఐలమ్మ అని, నాటి నిరంకుశ నిజాం, రజాకార్లు, విస్నూర్ దొరల గడీల పాలనపై ఎదిరించి పోరాడిన ఆమె చరిత్ర యావత్ దేశానికే స్ఫూర్తిదాయకమని భారతీయ జనతా పార్టీ నాయకులు కొనియాడారు. నాడు దొరలు, నిజాం సాగించిన భూదోపిడీ, అణచివేతలే నేడు కాంగ్రెస్ పాలనలో సరికొత్త రూపంలో పునరావృతమవుతున్నాయని, కాలం మారినా పాలకుల దోపిడీ వ్యవస్థలు మారలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బహుజనుల, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భరోసా కేవలం బిజెపితోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలను బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఒక సామాన్య మహిళ గొంతెత్తి, "నా భూమి.. నా పంట.. మీకెందుకు కట్టాలి శిస్తు?" అని న్యాయపోరాటం చేసి గెలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "దున్నేవాడిదే భూమి.. పండించేవాడిదే పంట" అని లక్షా యాభై వేల ఎకరాలున్న విస్నూర్ రామచంద్రారెడ్డి లాంటి దొరను ఢీకొట్టిన బిసి వీరనారి ఐలమ్మ అని గుర్తుచేశారు. బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. నిజాం పాలనను ఎదిరించి హక్కుల సాధనకు మార్గం చూపిన ధీరవనిత చాకలి ఐలమ్మ చరిత్రను రాష్ట్ర పాఠ్యపుస్తకాల్లో అధికారికంగా చేర్చాలని డిమాండ్ చేశారు. తద్వారా భావితరాల విద్యార్థులకు బిసిపోరాట యోధుల త్యాగాలు తెలుస్తాయన్నారు.

బిజెపి సీనియర్ నాయకుడు వకులాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన ఐలమ్మ జయంతిని కేవలం స్మరించుకోవడానికే పరిమితం చేయకూడదన్నారు. మహిళల ధైర్యం, ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా ఆమె పేరిట రాష్ట్రస్థాయి విశిష్ట పురస్కారాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర సహ ఇంచార్జ్, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, ఓబిసి మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రముఖులకు 'తెలుగు' ప్రతిభా పురస్కారాలు




ప్రతిష్టాత్మక ప్రతిభా పురస్కార గ్రహీతలతో మురళీమోహన్, నిత్యానందరావు, కోట్ల హనుమంతరావు తదితరులు

### ఈ పురస్కారాలు ఎంతో గర్వకారణం : పద్మశ్రీ మురళీమోహన్

### ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డా. ఓలేటి పార్వతీశం దివాకరబాబు, జొన్నలగడ్డ అనూరాధ ప్రభృతులకు పురస్కారాలు

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం పొందడం ఎంతో గర్వకారణమని, దీనిని పురస్కారం కింద పొందిన నగదు బహుమతితో పోల్చుకోకూడదని ప్రముఖ సినీనటుడు పద్మశ్రీ ఎం.మురళీమోహన్ అన్నారు. ఇంతమంది ప్రముఖులకు నా చేతి ద్వారా పురస్కారాలు అందించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని తెలుపుతూ పురస్కార గ్రహీతలకు శుభాభినందనలు తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం విస్తరణ సేవావిభాగం, నాంపల్లి ప్రాంగణం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీమోహన్, ఆత్మీయ అతిథిగా విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు. 2025 సంవత్సరానికిగాను ఎంపిక చేసిన 12 మందికి శనివారం వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎం.మురళీమోహన్ వెలుదండ నిత్యానందరావు, కోట్ల హనుమంతరావులతో కలిసి పురస్కార గ్రహీతలు ఒక్కొక్కరిని శాలువాతో ఘనంగా సత్కరించి పురస్కారంతోపాటు జ్ఞాపిక, 30,116 రూపాయల నగదును బహూకరించారు. ఈ సందర్భంగా కోట్ల హనుమంతరావు స్వాగతోపన్యాసంలో తెలుగుభాష, సాహిత్యం, కళలు, జానపదం, నాటక తదితర రంగాలలో విశేష సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ప్రతీయేటా ఈ ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో వివిధ రంగాల్లో అవిరళ కృషిచేసిన దిగ్గజాలకు ప్రతిభా పురస్కారాలను అందించడం తెలుగు విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. పురస్కారాలను అందుకున్న వారిలో బెల్లంకొండ ప్రసేన్ కవితా విభాగం; ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి విమర్శ/పరిశోధన; గుండోజు యాదగిరి చిత్రలేఖనం; బైరోజు వెంకటరమణాచారి శిల్పం; ఆచార్య జొన్నలగడ్డ అనూరాధ నృత్యం; మహావాది సరిత సంగీతం; డా. ఓలేటి పార్వతీశం పత్రికారంగం; దివాకరబాబు నాటకరంగం, భట్టు కిషన్ జానపద కళారంగం; ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అవధానం; ఆచార్య కె.ఆశాజ్యోతి ఉత్తమ రచయిత్రి; కె.వి.నరేందర్ నవల/కథ విభాగంలో ఉన్నారు. చివరిగా పురస్కార స్వీకర్తలు తమ స్పందనను తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

### అసెంబ్లీలో చిత్రపటానికి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ నివాళి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం శాసనసభ సెంట్రల్ హాల్‌లో ఆమె చిత్రపటానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, బాలు నాయక్, నవీన్ యాదవ్, మురళీ నాయక్, కోవా లక్ష్మీ ్మ, ప్రభాకర్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, ఎల్. రమణ, శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట చరిత్రలో చెరగని ముద్ర వేసిన ధీరవనిత, భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం నాటి భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు అసమానమైనవని ఆయన తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అన్యాయాన్ని ప్రశ్నించి, అణచివేతకు ఎదురొడ్డి నిలబడిన ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తన హక్కుల కోసం మాత్రమే కాకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం ఎంతోమందిలో చైతన్యం నింపిందని తెలిపారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ఆమె ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత ఆమె జీవితాన్ని, పోరాటాన్ని తెలుసుకొని సమాజంలో అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బిఆర్ఎస్ కసరత్తు

### ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కెటిఆర్

### తెలంగాణ భవన్‌లో 6 జిల్లాల నేతలతో వరుస సమావేశాలు

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఎన్నికలకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆరు జిల్లాల నేతలతో దశలవారీగా సమావేశమవుతున్న ఆయన.. ఇందులో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో తీవ్రంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతోపాటు తమ కుటుంబాలు, అన్నదాతలు, మహిళలు, యువత సహా రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను గమనిస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని అన్నారు. అయితే ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మరో రెండు రోజుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఆయా జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయి ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా బాధ్యతలు, కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈసారి పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అభ్యర్థి ఎవరైనా ఎన్నిక పార్టీ గుర్తుపైనే జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గాంధీ పరివారానికి బానిసత్వం కాంగ్రెస్ నైజం

### నేషన్ ఫస్ట్ మా సిద్ధాంతం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** గాంధీ పరివారానికి బానిసత్వం కాంగ్రెస్ నైజం.. నేషన్ ఫస్ట్ మా సిద్ధాంతం అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. భారతదేశంలో రాబోయే రాజకీయ పోరు గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదం. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలే కాంగ్రెస్ నడిపే కుటుంబ స్వార్థ రాజకీయాలకు, సంఘ్ పరివార్ నమ్ముకున్న నిస్వార్థ దేశభక్తికి మధ్య ఉన్న తేడా ఏమిటో ప్రజలకు స్పష్టంగా చూపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రాజకీయం అంటే ఒకే ఒక్క కుటుంబంతో మొదలవుతుందని, ఆ కుటుంబంతోనే ముగుస్తుంది. కానీ మాకు ఏ ఒక్క వ్యక్తి గానీ కుటుంబం కంటే దేశ ప్రయోజనాలే ఎల్లప్పుడూ ముఖ్యం అన్నారు. దేశంపై ఎమర్జెన్సీ రుద్ది ప్రజల గొంతు నొక్కింది, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ కాదా? అంటూ ప్రశ్నించారు. 1984లో దేశ రాజధాని నడిబొడ్డున వేలాది మంది అమాయక సిక్కులను ఊచకోత కోసిన రక్తచరిత్ర



కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. 26/11 ముంబైపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేసి భారత ప్రజలను పొట్టనబెట్టుకుంటే.. కనీసం పాకిస్తాన్‌పై ఎదురుదాడి చేసే ధైర్యం లేక చేతులెత్తేసిన చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ అన్నారు. చివరకు 2013 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు దేశాల సరసన నిలబెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ పాలనదేనని, సంఘ్ పరివార్ ఏ ఒక్కరి ఇంటిపేరు మీదో, ఒక కుటుంబం వారసత్వం మీదో నడిచేది కాదన్నారు. ఎలాంటి పదవులు, పేర్లు ఆశించకుండా కేవలం సమాజ సేవ, దేశ నిర్మాణం, క్రమశిక్షణ కోసం జీవితాలను త్యాగం చేసిన తరతరాల కార్యకర్తల త్యాగాలతో నిలబడిన వ్యవస్థ సంఘ్. అందుకే సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పోలిక అర్థంపర్థంలేనివి. దేశ రాజకీయాలు ఎప్పుడూ గాంధీ కుటుంబం చుట్టూనే తిరగాలని కాంగ్రెస్ కోరుకుంటుందన్నారు. కానీ ఈ దేశ రాజకీయాలు 140 కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవం, భారతదేశ ప్రయోజనాల చుట్టూ మాత్రమే తిరగాలని మేము బలంగా నమ్ముతున్నామని, ఢిల్లీ గాంధీ కుటుంబం కాళ్ల దగ్గర పడి తన బానిసత్వాన్ని నిరూపించుకోవడానికి రేవంత్ రెడ్డి ఎంతైనా పాకులాడ వచ్చునన్నారు. కానీ తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నది కుటుంబ పాలన కాదు.. ప్రజా సంక్షేమం అన్నారు. వంశపారపర్య పెత్తనం కాదు.. దేశ ప్రయోజనాలు. కాంగ్రెస్‌కు – కుటుంబమే మొదలు, కుటుంబమే సర్వస్వం అని, మాకు – ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలే ప్రథమం అన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు నిబద్ధతతో పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఆయన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన బాపూజీ... ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని ముఖ్యమంత్రి చెప్పారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలు, చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామని అన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవ, ధిక్కారస్వరానికి నిలువెత్తు నిదర్శనం చాకలి ఐలమ్మ: మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, బహుజన ఆత్మ గౌరవ ప్రతీక, మనం చాకలి ఐలమ్మగా పిలుచుకునే చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా, మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు, వారి త్యాగాలను స్మరించుకుంటూ, ఘన నివాళులు అర్పించారు. నాటి రాచరిక పాలనలో, తెలంగాణ రైతాంగ న్యాయమైన హక్కులకోసం, ధిక్కార స్వరం వినిపించిన ధీర వనిత, అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీక, ఐలమ్మ అని కేసీఆర్ కొనియాడారు. నాటి భూస్వాములను ఎదురించి ధిక్కార స్ఫూర్తినీ,. నాటి చట్టాల పరిధిలో న్యాయస్థానంలోనూ పోరాడి గెలిచి ప్రజాస్వామిక స్ఫూర్తినీ., ప్రదర్శించిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న, అస్తవ్యస్త పాలనా రాజకీయ పరిస్థితుల్లో చాకలి ఐలమ్మ ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి, ప్రదర్శించిన తెలంగాణ సోయి నేటి యువతకు అనుసరణీయమని స్పష్టం చేశారు. శాంతియుత పంథాలో తాను ప్రారంభించిన మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో, ఐలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి వున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చాటేందుకు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, వారి జయంతిని అధికారికంగా నిర్వహించే సాంప్రదాయాన్ని నెలకొల్పిందని అన్నారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా, నాటి పదేండ్ల ప్రగతి ప్రస్థానంలో, మహిళలు శిశు సంక్షేమం, రైతాంగం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అనేక వినూత్నపథకాలను అమలు చేశామన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తూ, కుల వృత్తులను పునరుజ్జీవింప చేసి, సబ్బండ కులాల ఆర్థిక, సామాజిక ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టినామని కేసీఆర్ గుర్తు చేశారు. అవి సాధించిన ఫలితాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వివరించారు. అదే దిశగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పాలనా పద్ధతులను మొదటి పాలనా ప్రాధాన్యతలుగా, చిత్త శుద్ధితో అమలు చేయడం ద్వారా మాత్రమే, చాకలి ఐలమ్మ గారికి మనం నిజమైన నివాళులు అర్పించిన వారమోతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కేరళలో ఇచ్చింది ఎలక్షన్ ఫండ్ నజరానా అవార్డు

### గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ పోలిక హాస్యాస్పదం

### బిజెపి రాష్ట్ర ముఖ్య అధికారప్రతినిధి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ పర్యటనలో సొంత పార్టీ నాయకుల చేతుల మీదుగా ఆర్యదాన్ మహమ్మద్ మెమోరియల్ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ 2026 అవార్డు తీసుకోవడం హాస్యాస్పదమని, అది ప్రజల మెప్పుతో వచ్చినది కాదని, తెలంగాణ ప్రజల సొమ్మును కేరళ ఎన్నికల ఫండ్‌గా సమర్పించినందుకు గాంధీ కుటుంబం, కెసి వేణుగోపాల్ ఇప్పించిన ఎలక్షన్ ఫండ్ నజరానా అని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పుల్లారావు యాదవ్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్.వి. సుభాష్ మాట్లాడుతూ, ఇటీవల ముగిసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి చేపట్టిన నిమజ్జన కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు, ఇబ్బందులు సృష్టించినప్పటికీ బాధ్యతాయుతమైన పౌరులుగా హైదరాబాద్ వాసులు నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసుకున్నారని, సహకరించిన నగర ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేరళలో రేవంత్ రెడ్డికి ఇచ్చిన డూప్లికేట్ అవార్డుపై కాంగ్రెస్ నేతలు ఏదో నోబెల్ ప్రైజ్, ఆస్కార్ అవార్డు వచ్చినట్లు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో డబ్బులు కట్టి వారం రోజుల సర్టిఫికేట్ కోర్సు చేసి వస్తే.. అలాగే సోనియా గాంధీ రాసిన ఒక లేఖను ఆస్కార్ అవార్డుతో పోల్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిన చరిత్ర రేవంత్‌ది అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని చూసి నెటిజన్లు, విద్యావంతులు ఆయనకు కమిషన్ అవార్డు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవార్డు, ఓటుకు నోటు అవార్డు, బెస్ట్ మ్యానిప్యులేటర్ అవార్డు ఇవ్వాలని పిలుస్తున్నారని, ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడకుండా ఆయన సలహాదారులు సరైన హితవు పలకాలని హెచ్చరించారు.

# బిటిపిఎస్‌లో నిలిచిన విద్యుత్

## ఒకదాని తర్వాత మరొకటి

## మూతపడుతున్న విద్యుత్ కేంద్రాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** బొగ్గు కొరతతో పాటు, సాంకేతిక సమస్యలతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు చెందిన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు వరుసగా షట్‌డౌన్ అవుతున్నాయి. ఒకదాని వెంట మరొకటి మూతబడుతున్నాయి. తాజాగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లోని యూనిట్ 1లో అకస్మాత్తుగా విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీక్ కావడంతో ఈ యూనిట్‌లోని 270 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే ప్లాంట్‌లోని యూనిట్ 3 ఈ నెల 9వ తేదీ నుంచి నడువడంలేదు. ఈ ప్లాంట్‌లో నాలుగు యూనిట్లు ఉండగా, ప్రస్తుతం రెండు యూనిట్లు మూతపడ్డాయి. బీటీపీఎస్ యూనిట్ 1లో రోజుకు సగటున 22 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి కావాల్సి ఉండగా ఈ నెల 24న షట్‌డౌన్ కారణంగా కేవలం 0.18 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయ్యింది. జెన్‌కో విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లల్లో వైటీపీఎస్‌లోని 800 మెగావాట్ల యూనిట్ 3 ఈ నెల 20వ తేదీ నుంచి నడువడంలేదు. ఒక యూనిట్‌లో అంతరాయం తలెత్తగా, ఉత్పత్తి పునః ప్రారంభమయ్యింది. హైడల్‌లో నిజాంసాగర్, నాగార్జునసాగర్ యూనిట్ 3లు కూడా నడువడంలేదు. శ్రీశైలంలో ఒక యూనిట్ షట్‌డౌన్ కాగా, మరమ్మతులు చేసి ఉత్పత్తిని పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం హైడల్ విద్యుత్తు ఉత్పత్తి ఏకంగా 3.922 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. వారం రోజుల నుంచి 107 మిలియన్ యూనిట్ల మధ్య జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుండగా, ఏకంగా 3 మిలియన్ యూనిట్లకు తగ్గింది.

# బిజెపిపై పంజాబ్ మాజీ సిఎం అమరీందర్‌సింగ్ తీవ్ర అసంతృప్తి



**అమృత్‌సర్, సెప్టెంబరు 26:** పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత కెప్టెన్ అమరీందర్ సింగ్ తన సొంత పార్టీపై తీవ్ర అసంతృప్తి, నిరాశ వ్యక్తం చేశారు. పంజాబ్ రాజకీయాల్లో తనకు 60 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ, రాష్ట్రానికి సంబంధించిన విషయాల్లో బీజేపీ తన అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసు కోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ జాతీయ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న కొందరు నేతలకు ఏడాది అనుభవం కూడా లేదని, అయినా తన మాటను పార్టీ వినడం లేదని అమరీందర్ అన్నారు. "పంజాబ్ అనేక సంక్షోభాలను చూసింది. నా సహచరులు, నేను రాష్ట్ర రాజకీయాల్లో 60 ఏళ్లుగా ఉన్నాం. మా అనుభవాన్ని బీజేపీ గౌరవించి, మా అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలని ఆశిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ, తాను పార్టీని వీడుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. "నేను పార్టీని వీడటం లేదు. కానీ పంజాబ్ గురించి నేను ఏమనుకుంటున్నానో చెప్పడం నా బాధ్యత" అని స్పష్టం చేశారు. మరో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను బీజేపీలో చేరి నాలుగేళ్లు అయినా ఎలాంటి పదవి లభించలేదని, పంజాబ్ గురించి పార్టీ తనను ఎప్పుడూ సంప్రదించలేదని అన్నారు. బీజేపీకి పంజాబ్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై అవగాహన లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కెప్టెన్ అమరీందర్ సింగ్ 2002-07, 2017-21 మధ్య రెండుసార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2021లో కాంగ్రెస్‌తో విభేదించి బయటకు వచ్చి, 2022లో తన పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. త్వరలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# వ్యవసాయ కార్యాలయం ఆస్తుల జప్తు

## పదేళ్ల క్రితం రూ.18 లక్షల బకాయి

## కోర్టు సిబ్బంది సమక్షంలో వేలం

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వ్యవసాయ శాఖ పరిస్థితి దయనీయంగా తయారైంది. నిధులు లేక, బకాయిలు చెల్లించ లేక పలు వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి సంబంధించిన ఆస్తులను జప్తు చేయడం చర్చనీశాంశమైంది. రాష్ట్రంలోని జనగామ జిల్లా వ్యవసాయ శాఖ ఆఫీసు ఆస్తులను అధికారులు జప్తు చేశారు. కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియను న్యాయస్థానం ఆదేశాల మేరకు అధికారులు చేపట్టారు. కోర్టు ఉత్తర్వుల మేరకు వ్యవసాయ శాఖ కార్యాలయంలోని కుర్చీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఇతర సామగ్రిని కోర్టు సిబ్బంది సమక్షంలో జప్తు చేశారు. ఈ ఘటనకు సంబంధించి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం 2015, 2016లో వ్యవసాయ పనిముట్ల కోసం ఒక ఇంజనీర్ వెల్డింగ్ వర్క్స్ సంస్థ సుమారు రూ.18 లక్షల పెట్టుబడి పెట్టింది.

ఈ మొత్తానికి సంబంధించి అప్పటి ప్రభుత్వం రూ.18 లక్షల డీడీ జారీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే ఆ డీడీ బౌన్స్ కావడంతో తమకు రావాల్సిన నగదు అందలేదని సంస్థ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయస్థానం బకాయి మొత్తాన్ని చెల్లించే వరకు సంబంధిత వ్యవసాయ శాఖ ఆఫీసులోని ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. దీంతో కోర్టు సిబ్బంది సమక్షంలో వ్యవసాయ శాఖ కార్యాలయం లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ సామగ్రి సహా పలు వస్తువులను జప్తు చేశారు. ఈ ఘటనతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సుమారు అర్ధగంటపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఎన్నికల ఫిక్సింగ్‌కు పాల్పడుతున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్

## కేరళ ఐఎఎస్ ఎన్నికల్లో పోటీకి సిఇసికి ఆఫర్

## మంత్రిపదవి ఆఫర్ కూడా ఇచ్చారని రాహుల్ ధ్వజం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26 :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. మాజీ కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిజి థామ్సన్‌ను జ్ఞానేశ్ కుమార్ సంప్రదించి, బీజేపీ తరఫున పోటీ చేయాలని కోరారని, ఇందుకు ప్రతిగా మంత్రి పదవి కూడా ఆఫర్ చేశారని కాంగ్రెస్ చేసిన ఆరోపణల నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, జ్ఞానేశ్ కుమార్ భారతదేశంలో ఎన్నికల ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జ్ఞానేశ్ కుమార్‌ను రిక్రూటర్‌గా ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. కేరళ కాంగ్రెస్ ఖాతా నుంచి చేసిన పోస్టును షేర్ చేసిన రాహుల్ గాంధీ, మోడీ, షా ఆయనను అంపైర్‌గా నియమించి, భారత ఎన్నికల మ్యాచ్ ఫిక్సింగ్ బాధ్యతలు అప్పగించారంటూ విమర్శించారు. అంతకుముందు కేరళ కాంగ్రెస్ చేసిన పోస్టులో, అప్పటి ఐఏఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్ జిజి థామ్సన్‌కు మంత్రి పదవులు ఆఫర్ చేశారని ఆరోపించింది."ఇలాంటి ఆఫర్ ఇవ్వడానికి జ్ఞానేశ్ కుమార్ ఎవరు ఆయన ఏ అధికారం కింద మాట్లాడారు 2016లో బీజేపీ కోసం రాజకీయ నియామక ప్రక్రియలో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న వ్యక్తి ఎందుకు జోక్యం చేసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి అని కాంగ్రెస్ ప్రశ్నించింది. ప్రత్యేక సమగ్ర సవరణ , కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్‌రోచ్ జనతా పార్టీచేపట్టనున్న నిరసనకు మద్దతు పెరుగుతోంది. అక్టోబర్ 2న ముంబైలో జరగనున్న సిజెపి నిరసనకు ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే శివసేన నేత ఆదిత్య థాకరే మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) కూడా మద్దతు కోసం సిజెపిని సంప్రదించినట్లు పేర్కొంది.సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో చేసిన పోస్టులో, సెప్టెంబర్ 27లోగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2న ముంబై నుంచి దేశవ్యాప్త నిరసన ప్రారంభిస్తామని తెలిపారు.

ఈ నిరసనలను దేశంలోని పలు నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు.

# రేవంత్ నిజాయితీ గల మోసగాడు: కెటిఆర్

## బిఆర్ఎస్‌లో పలువురు కాంగ్రెస్ నేతల చేరికలు



**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ నిజాయతీ గల మోసగాడు అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని, ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. పాతరోజులు తెస్తానని ఎన్నికల్లో చెప్పిన రేవంత్.. నిజంగా అదే పనిచేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి వెనుకకే పోయిందని విమర్శిం చారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.

ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఎవరు గెలిచినా కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలు అనుకున్నారని, ఎవరొచ్చినా సంక్షేమ పథకాలు బంద్ కావని ప్రజలు అనుకున్నారని పేర్కొన్నారు. గణేశుల పండుగొచ్చింది.. ఏమైంది.. ఊరూరుకి ఏం నడుస్తుంది.. ఎక్కడ పోయినా ఏ పేరు వినబడుతోంది. దేఖ్ లేంగే అంటుర్రు.. కేసీఆర్ అంటున్నరని పేర్కొన్నారు. మూడేళ్లు పెద్ద మనిసి కనబడకపోయినా.. కేసీఆర్ బయటకు రా అని కాంగ్రెసోళ్లు అడుగుతా ఉంటరు కదా.. కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నడు అనే మాట. పిల్లలే చెప్పారు.అని పేర్కొన్నారు.

# నేను 10సార్లు ఓటేసిన నిజామాబాద్‌లో నా ఓటు తొలగించే కుట్ర

## సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా సోమవారం కాంగ్రెస్ ఆందోళనలు: పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్)పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా అవసరమైన చోట ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తున్నప్పుడు, ఇతర రాష్ట్రాల్లో ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఓటర్లు ఒకరే అయినప్పుడు ఎన్నికల ఫలితాల్లో ఇంత వ్యత్యాసం ఎలా ఉంటోందని ప్రశ్నించారు. ఓట్ల చోరీ జరుగుతోందన్నది వాస్తవమని ఆయన పేర్కొన్నప్పటికీ ఈ ఆరోపణలను యాంత్రికంగా నిరూపించడం కష్టమని వ్యాఖ్యానించారు. బీజేపీ చేపట్టినట్లు పేర్కొంటున్న సర్ ప్రక్రియ యువతలో ఆందోళనకు కారణమవుతోందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నేపథ్యంలోనే జెన్ జీ యువత రోడ్లపైకి వస్తోందని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. తాను పదిసార్లు ఓటు వేసిన నిజామాబాద్‌లోనే తన ఓటును తొలగించేందుకు కుట్ర చేశారని చెప్పారు. తనకు కుట్రపూరితంగా నోటీసులు ఇచ్చారని ఆరోపించారు.

లౌకికవాదుల ఓట్లను తొలగించే ప్రక్రియ సాగుతోందని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసి) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన ఒక రాజకీయ పార్టీకి మారినట్లుగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం నిష్పాక్షి కతపై సందేహాలు వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితులకు కమిషనర్ వైఖరే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అవిశ్వాసానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రయత్నాన్ని విజయవంతం చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపునకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతోంది. సోమవారం అన్ని జిల్లాల్లో పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఓటు హక్కును పరిరక్షి ంచేందుకు ప్రజాస్వామ్యవాదులు, యువత ముందుకు రావాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడాలని, ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సాగాలని పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

# రాబోయే రబీ, వేసవిలో విద్యుత్‌కు డిమాండ్

## విద్యుత్ మౌలిక వసతులు బలోపేతం

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** రానున్న రబీ, వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ దృష్ట్యా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ భవన్ ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించి అవసరమైన మేరకు కండక్టర్ అప్‌గ్రేడేషన్, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పీటీఆర్‌ల అదనపు ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు పనులను వేగవంతం చేయాలన్నారు.

డీటీఆర్‌లపై లోడ్‌ను నిరంతరం పర్యవేక్షి స్తూ 60 శాతానికి పైగా లోడ్ ఉన్న వాటిని ముందుగానే గుర్తించి అవసరమైన చోట సామర్థ్య పెంపు లేదా అదనపు డీటీఆర్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. టాంగ్ టెస్టర్ రీడింగ్‌లను తీసుకుని లోడ్ బ్యాలెన్సింగ్ చర్యలు చేపట్టాలని తెలిపారు. 33 కేవీ, 11 కేవీ లైన్లలో అవసరమైన ప్రాంతాల్లో కెపాసిటర్ బ్యాంకులు,కెపాసిటర్ సెల్స్ ఏర్పాటు చేసి పవర్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరచాలని పేర్కొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అన్ని సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



# సిఇసి జ్ఞానేశ్ పద్మభూషణ్‌కు అన్నివిధాలా అర్హుడు!

## బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య ప్రశంసలు

**కోల్‌కతా, సెప్టెంబరు 26:** ఓటరు జాబితాను ప్రక్షాళన చేసినందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్, పద్మభూషణ్‌కు అర్హులని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య అన్నారు. రాష్ట్రంలో హింసారహితంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగేలా ఆయన చర్యలు చేపట్టారని కొనియాడారు. ప్రత్యేక విస్తృత ఓటరు జాబితాల సవరణ (సర్) ప్రక్రియపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు వార్తా కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఈసీపై విమర్శలు రావడంతో పాటు ఆయన రాజీనామా చేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య ప్రశంసలతో ముంచెత్తారు. భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ ఆయనకు ఇవ్వాలని ప్రతిపాదించారు. జ్ఞానేష్ కుమార్ కనీసం పద్మ భూషణ్ పురస్కారానికైనా అర్హులు. చాలా కాలం తర్వాత బెదిరింపులకు తావులేకుండా, ఎన్నికల సమయంలో ఎలాంటి హత్యలు జరుగకుండా, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పరిస్థితులు ఉండటం పట్ల పశ్చిమ బెంగాల్ ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. మరోవైపు బెంగాల్‌లోని ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ కీలక పాత్ర పోషించారని సమీక్ భట్టాచార్య తెలిపారు. పశ్చిమ బెంగాల్ వంటి సరిహద్దు రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుంచి బంగ్లాదేశ్ చొరబాటుదారుల పేర్లను తొలగించే విషయంలో ఆయన చొరవ తీసుకున్నారంటూ కొనియాడారు.

# తిరుమల మొదటి ఘాట్‌లో ప్రమాదం

## ర్యాపిడో డ్రైవర్ మృతి.. హైదరాబాద్ భక్తుడికి తీవ్రగాయాలు

**తిరుమల,సెప్టెంబరు 26, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటిఘాట్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన ర్యాపిడో వాహన దారుడు ప్రాణాలు కోల్పోయాడు. వెనుకకూర్చున్న హైదరాబాద్ భక్తుడికి తీవ్రగాయాలయ్యాయి. ఘాట్‌లో వాహనం అదుపుతప్పి రెయిలింగ్ గోడను ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు సమాచారం. తిరుపతికి చెందిన వెంకటేశ్(28-30)ద్విచక్రవాహనం ర్యాపిడోగా వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు సునీల్ శనివారం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకుని తిరుగుప్రయాణంలో ర్యాపిడో బుక్‌చేసుకున్నాడు. రాత్రి 7-8గంటల ప్రాంతంలో తిరుమల నుండి వెంకటేశ్ ,భక్తుడు సునీల్‌ను ఎక్కించుకుని తిరుపతికి దిగుతుండగా 24వ మలుపు వద్ద అదుపుతప్పి ద్విచక్ర వాహనం రెయిలింగ్ గోడను ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్ అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న సునీల్‌కు తీవ్ర గాయాల వడంతో వెంటనే అతడిని అంబులెన్స్‌లో తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తిరుమలకు ర్యాపిడో ఎలా అనుమతించారనేది కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తి చిరస్మరణీయం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి, భుక్తి కోసం పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కేటీఆర్ కొనియాడారు. పేదలు, పీడిత ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# బెంగాల్‌లో మమతా టిఎంసి ఎమ్మెల్యే కారుపై కోడి గుడ్లతో దాడి

**కోల్‌కతా, సెప్టెంబరు 26:** పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పార్టీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కారుపై శనివారం దాడి జరిగింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్వహిస్తున్న ర్యాలీకి హాజరయ్యేందుకు ఆయన శ్రీరాంపూర్‌కు వెళుతుండగా, హుగ్లీ జిల్లాలోని ఉత్తరపారా వద్ద కొందరు దుండగులు ఆయన కారును అడ్డగించి రాళ్లు, కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో బెంగాల్ రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. ఆందోళనకారులు కునాల్ ఘోష్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ఆయన కారుపై విరుచుకుపడ్డారు. ఈ దాడిలో వాహనం వెనుక అద్దం పూర్తిగా ధ్వంసమైంది.

# రిఫరీపైనే అనుమానం వస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం


## ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదు.. ఓటు అధికార పార్టీ సొత్తు కాదు

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** ఎన్నికల పోరులో అన్ని రాజకీయ పార్టీలూ ఆటగాళ్లయితే... ఎన్నికల సంఘం రిఫరీ. ఆ రిఫరీపైనే అనుమానం తలెత్తితే ఓడిపోయేది ఏదో ఒక రాజకీయ పార్టీ కాదు మొత్తం ప్రజాస్వామ్యమేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం పనితీరుపై తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు ఓటు విలువను గుర్తించే ప్రతి భారతీయుడినీ కలవరపరుస్తున్నాయని అన్నారు. స్వతంత్ర ఎన్నికల సంఘం అనేది అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే దయాదాక్షి ణ్యం కాదని, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన రక్షణ కవచమని స్పష్టం చేశారు. ఆ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందా లేదా అనే తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నినాదాలు, మొండి ఖండనలు, గుడ్డిగా నమ్మాలనే ఆదేశాలతో అనుమానాలు తొలగిపోవని పేర్కొన్నారు. చట్టబద్ధంగా బాధ్యతలు నిర్వహించే ఎన్నికల అధికారులకు తెలియకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా? ఓటరు డేటాబేస్‌ను పూర్తిగా కేంద్రీకరించడం ద్వారా క్షేత్రస్థాయి అధికారుల అధికారాలను పరిమితం చేశారా? కొత్త ఓటర్ల నమోదును ప్రభావితం చేసే మార్పులు ఎన్నికల కమిషనర్ల పూర్తి అవగాహన లేకుండానే జరిగాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందన్నారు.

గోవాలో వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్న ఘటన మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. 97 మంది ఓటర్ల అర్హతను ఎన్నికల నమోదు అధికారులు పరిశీలించి నిర్ధారించినప్పటికీ, సాఫ్ట్‌వేర్‌లో వారి నిర్ణయాలను సకాలంలో నమోదు చేయలేకపోవడంతో ఆ పేర్లు తుది జాబితాలో చేరలేదని వచ్చిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనాన్ని ఆయన ప్రస్తావించారు. ఓటర్ల సంఖ్య 97 కావచ్చు... తొమ్మిది కావచ్చు... ఒక్కరు కావచ్చు. సంఖ్య చిన్నదని హక్కు చిన్నది కాదు. పౌరుడి పత్రాలను పరిశీలించి, అతను ఓటరుగా అర్హుడేనని చట్టబద్ధ అధికారి తేల్చిన తర్వాత కూడా ఒక కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ ఆ నిర్ణయాన్ని అమలు కాకుండా అడ్డుకుంటే అది కేవలం సాంకేతిక లోపం కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థ వైఫల్యం అని స్పష్టం చేశారు. మనిషి కోసం సాంకేతికత ఉండాలి. సాంకేతికత కోసం మనిషి హక్కులను బలి ఇవ్వకూడదు.



అధికారి నిర్ణయానికి సాఫ్ట్‌వేర్ సహకరించాలి. సాఫ్ట్‌వేరే అధికారిగా మారి ఓటు హక్కును అడ్డుకోకూడదు' అని అన్నారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన వారిలో 22.21 లక్షల మంది తమ పేర్లను పునరుద్ధరించాలని అప్పీలు చేసుకున్నట్లు ఎన్నికల సంఘమే సుప్రీంకోర్టుకు తెలిపిందని గుర్తుచేశారు.

ఈ గణాంకాల ఆధారంగా తొలగించిన ప్రతి పేరు తప్పేనని చెప్పలేమని, అయితే ఇంత భారీ స్థాయిలో పేర్లు తొలగించినప్పుడు పారదర్శకత, సమర్థమైన అప్పీల్ వ్యవస్థ, సకాలంలో తప్పులను సరిచేసే అవకాశం తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

ఓటరు జాబితాలో జరిగిన తప్పును ఎన్నికల తర్వాత సరిచేస్తే ప్రయోజనం ఏమిటి? ఓటు వేసే రోజుకు ముందే న్యాయం జరగాలి. గడువు ముగిసిన తర్వాత పేరు చేర్చడం అంటే రైలు వెళ్లిపోయిన తర్వాత టికెట్ ఇవ్వడమే అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గతంలో వ్యక్తం చేసిన ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

ఏకగ్రీవం అని ఒక్క మాట చెబితే అభ్యంతరాలు మాయమైపోవు. అసలు అభ్యంతరాలు ఎందుకు వచ్చాయి? వివాదాస్పద నిర్ణయాలను ఎవరు అనుమతించారు? ఇద్దరు కమిషనర్లను ముందు గానే సంప్రదించారా? చట్టబద్ధ అధికారు లకు ఓటరు డేటాబేస్‌పై స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఉందా? సాఫ్ట్‌వేర్ వైఫల్యంతో హక్కు కోల్పోయిన ఓటర్లకు ఏ రక్షణ కల్పించారు? ఈ ప్రశ్నలకు ఒక్కొక్కటిగా సమాధానం చెప్పారు అని డిమాండ్ చేశారు.ఎన్నికల స్వచ్ఛతను, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో దృఢంగా పోరాడుతుందని ప్రకటించారు. కమిషనర్లు సంధు, జోషి పేరుతో వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ బహిరం గంగా సమాధానం చెప్పాలని కోరారు.

# హైదరాబాద్ జిపిఒ స్థాయిని తగ్గించొద్దు

## కేంద్ర సహాయమంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

## జిపిఒను గ్రూప్ ఎ నుంచి బికి మార్చడాన్ని వ్యతిరేకించిన హైదరాబాద్ ఎంపి

**హైదరాబాద్,సెప్టెంబరు26,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఒ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఒను గ్రూప్ ఏ నుంచి గ్రూప్ బీకి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఒ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఒ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఒ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఒ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు.తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహా నగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీపీఒ హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను రద్దు చేసి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ ఏ సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఓఆర్ఆర్‌పై ప్రమాదం, ఇద్దరు మృతి

## - టైరు పేలి పల్టీకొట్టిన వాహనం - మరో 11 మందికి గాయాలు


కీసర ఓఆర్ఆర్‌పై ప్రమాదానికి గురైన వాహనం

**కీసర, సెప్టెంబరు26, ప్రభాతవార్త:** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశోక్ లేలాండ్ వాహనం కీసర నుండి శామీర్‌పేట వైపు కూలీలతో ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా వెనుక టైరు పేలిపోయింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డుపై బలంగా పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో మంగీలాల్ (60), సురేఖ (40) తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాద తీవ్రతతో మరో 11 మంది కూలీలు తీవ్ర రక్త గాయాలతో రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. మంగీలాల్ మహబూబ్‌నగర్ నుండి నగరానికి వలసవచ్చి చర్లపల్లిలో నివాసం ఉంటున్నాడు. మహారాష్ట్రకు చెందిన సురేఖ కుటుంబంతో కలిసి నగరానికి వచ్చి చర్లపల్లిలో నివాసమంటూ జీవిస్తుంది. సమచారం అందుకున్న కీసర పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చెపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# డ్యూటీలో ఉన్న మహిళా ఎస్ఐ పట్ల అసభ్య ప్రవర్తన

## ఫిట్‌నెస్ క్లబ్ యజమానిపై కేసు నమోదు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న ఒక మహిళా ఎస్ఐ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ఫిట్‌నెస్ క్లబ్ నిర్వాహకుడిపై కేసు నమోదైంది. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగి ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటకు సంబంధించి సదరు మహిళా ఎస్ఐ చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్మాస్‌గూడ కమాన్ సమీపంలోని ఆక్సిజన్ ఫిట్‌నెస్ క్లబ్ వద్ద ఈ నెల 23వ తేదీ తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర జరుగుతున్న సమయంలో కొందరు తాగిన మత్తులో నృత్యాలు, అరుపులతో పబ్లిక్ రోడ్డులో ఇబ్బందికరంగా ప్రవర్తించడంతో అక్కడే డ్యూటీలో ఉన్న మహిళా ఎస్ఐ దేవులపల్లి ఉమా మహేశ్వరి గమనించారు. దీంతో న్యూసెన్స్ జరుగుతున్నందున ఆమె అక్కడి నుండి సదరు వ్యక్తులను వెళ్ళిపోవాలని సూచించారు. అయితే గుంపులో ఉన్న సాకేత్‌కుమార్ అనే వ్యక్తి కొద్ది సేపు అంటూ ఎస్ఐ దగ్గరకు వచ్చి నడుముపై చేయి వేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. గణేష్ నిమజ్జన శోభాయాత్రల డ్యూటీల కారణంగా బిజిగా ఉన్న సదరు మహిళా ఎస్ఐ ఉమా మహేశ్వరి 24వ తేదీ రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ చింతల నితీన్‌రెడ్డి కేసును నమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ప్రారంభమైన 50 గంటల ప్రజా కళాజాతర

## ప్రజా సంస్కృతిని, జానపద రూపాలను కాపాడుకోవాలి



అరుణోదయ విమలక్క ప్రజా సంస్కృతికోద్యమ ప్రస్థానం పేరుతో రూపొందించి పోరుపాట గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి జూపాక సుభద్ర, చిత్రంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రొఫెసర్ లక్ష్మి, ప్రొఫెసర్ కట్ట భగవంత్ రెడ్డి, పోతుల రమేష్ డాక్టర్ ఏ.కె .ప్రభాకర్

**చిక్కడపల్లి సెప్టెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** ప్రజా కళలు వర్ధిల్లాలి.. ప్రజా సంస్కృతి వర్ధిల్లాలి", జానపద రూపాలను కాపాడుకోవాలని, సామ్రాజ్యవాద విష సంస్కృతి, దోపిడీ పీడన నశించి సమసమాజ స్థాపన జరగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేత విమలక్క 50 ఏళ్ల ప్రజా సాంస్కృతికోద్యమ ప్రస్థానం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50 గంటల ప్రజా కళాజాతర ప్రారంభమైంది. ముందుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ కల్యాణ మండపం వరకు వేలాది మంది ప్రజా కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాకారులు తమ సాంప్రదాయ జానపద రూపాలను ప్రదర్శిస్తూ, నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అరుణోదయ సీనియర్ కార్యకర్త అంబిక అరుణోదయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓ అరుణ పతాకమా... గీతాలాపన చేశారు. ఫొటో గ్యాలరీ ప్రారంభం:గత 50 ఏళ్లుగా విప్లవ, తెలంగాణ ఉద్యమాల్లో, బహుజన బతుకమ్మ కార్యక్రమాల్లో విమలక్క భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని ప్రొఫెసర్ శాంతా సిన్హా ప్రారంభించారు. సభా కార్యక్రమాన్ని అంకురం సినిమా దర్శకులు ఉమామహేశ్వరరావు ప్రారంభిస్తూ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సంస్కృతి వైపు నిలవడం ఎంతో సాహసంతో కూడుకున్నదని అన్నారు. ప్రజా సంస్కృతి చలనశీలమైనదన్నారు.

# నర్మెట ఆయిల్ పామ్ రాష్ట్రానికే మణిహారం


నర్మెట అయిల్‌ఫాంను సందర్శించి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## తెలంగాణను ఆయిల్‌పామ్ హబ్‌గా మార్చుతాం

## తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టిసారించాలి

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నంగునూర్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని అయిల్‌ఫామ్ హబ్‌గా మార్చేందుకు రైతులు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట గ్రామంలోని అయిల్ ఫాం ఫ్యాక్టరీని శనివారం ఆయన జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి సందర్శించి ఫ్యాక్టరీ పనితీరు, నీటి లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టిసారించాలన్నారు. అయిల్‌ఫాం తోటలతో పాటు పశువులను పెంచుకోవడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. అయిల్‌ఫాం తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని తద్వారా వచ్చే ఆదాయంతో రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో అయిల్‌ఫామ్ సాగు చేపట్టామని ఈ యేడాది మరో లక్ష ఎకరాల్లో సాగు విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అయిల్‌ఫాం ఫ్యాక్టరీకి నీటి కొరత రాకుండా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొచ్చమని తెలిపారు. భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి నిల్వ కోసం చెరువు ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే సీజన్ వరకు రిఫైనరీ ఇక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయిల్‌ఫాం సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడంతో పాటు తెలంగాణను దేశంలోనే అయిల్‌ఫామ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. అయిల్‌ఫాం రైతులకు మరింత ప్రోత్సాహం అందేలా కేంద్రం ఎంజీపీని కనీసం రూ. 25 వేలకు తగ్గకుండా నిర్ణయించాలని కేంద్రాని కోరుతున్నట్లు తెలిపారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం : బొంతు రామ్మోహన్

**సైఫాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల హక్కులను, ఉద్యోగ భద్రతను పరిరక్షించడమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ ఆర్టీసీ వర్కర్ యూనియన్ (టిడబ్ల్యూయూ) కూటమి ముందుకు సాగుతుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ ఎన్నికల ఇన్‌చార్జీ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న టిడబ్ల్యూయూకు బాణం గుర్తు వచ్చిందని, బాణం గుర్తుకు కార్మికులు, ఉద్యోగులు ఓట్లు వేసి భారీ మేజార్టితో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టిడబ్ల్యూయూ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయూ) వ్యవస్థాప ప్రధాన కార్యదర్శి ఈ.అశ్వత్థామరెడ్డితో కలిసి బొంతు మాట్లాడారు. 10 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఎన్నికలు తొలిమెట్టు అని అన్నారు.

పదోన్నతులు, పిఆర్సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ఎన్నికైన గుర్తింపు సంఘంతో చర్చించి ముందుకు వెళతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని బొంతు రామ్మోహన్ గుర్తు చేశారు.



# నిమజ్జన భద్రతలో ఆరితేరిన పోలీసులు

## టెక్నాలజీ సాయంతో ఉత్సవాల్లో సమర్థ నిర్వహణ

## ఏడు లక్షలకు పెరిగిన సిసి కెమెరాలతో అడుగడుగునా పహారా

**హైదరాబాద్, సెప్టెంబర్ 26,, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహా నగరంలో మకుటాయమానంగా నిలిచిన అనేక పండగల్లో సామూహిక గణేష్ ఉత్సవాలు ముందు వరుసలో వుంటుందనేది అందరికి తెలిసిందే. తెలంగాణ సంస్కృతిలో భాగంగా వున్న బతుకమ్మ, బోనాల వేడుకల తరు వాత గణేష్ ఉత్సవాలకు అంతటి ప్రాముఖ్యత వుందని చెప్పాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఒకప్పుడు ఈ పండగ ప్రముఖంగా వుండగా నాలుగున్నర దశాబ్దాల క్రితం జంట నగరాలలో కూడా ఈ వేడుకలు మొదలై అనంతర కాలంలో అంగరంగ వైభవంగా సాగుతుండడం విదితమే. వాస్తవాని కి అంతకు ముందే క్రితమే గణేష్ ఉత్సవాలు హైరాబాద్‌లో జరుగుతున్నా సామూహిక నిమజ్జనం 1980 దశకం నుంచే మొదలైంది. ఇక ఈ ఉత్సవాల నిర్వహణ పోలీసులకు నిన్నమొన్నటి వరకు కత్తిమీద సాములా వుండగా టెక్నాలజి వాడడం ద్వారా పోలీసులు దీనిని అధిగమించి అ ంతా సాఫీగా సాగేలా చూస్తున్నారు. 15 క్రితం వరకు గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం పర్యవేక్షణకు పోలీసులు టీవీ ఛానళ్లలో వచ్చే ప్రత్యక్ష ప్ర సార దృశ్యాలను పరిశీలించిన విషయం చాలా మందికి తెలియదు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక హైదరాబాద్ నగర మొదటి పోలీ సు కమిషనర్‌గా పనిచేసిన మహేందర్ రెడ్డి హయాంలో ఏరా ్పటైన సిసి కెమెరాలు నిమజ్జన పర్యవేక్షణలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు రాగలిగాయి. పదేళ్ల క్రితం వరకు కేవలం 15 వేల సిసి కెమెరాలు వుండగా నేడు ఈ సంఖ్య ఏడు లక్షలకు పెరిగిందంటే టెక్నాలజిని వాడడం లో పోలీసులు సాధించిన ప్రగతిని ఊహించుకోవచ్చు. దీని తరువాత వినాయక విగ్రహాలకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల ఏ విగ్ర హం ఎక్కడ వుందనేది కంట్రోల్ రూం నుంచి తెలుసుకునేందుకు వీలుంటుంది. ఐదేళ్ల క్రితం పోలీసులు సాధించిన మరో అద్భుతం యాప్ ఆవిష్కరణ. వాస్తవానికి యాప్ కొత్తదేమి కాకపోయిన అప్పట్లో నగరంలోని "టాప్ 20" విగ్రహాల కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను తయారు చేశారు. ఈ క్రమంలోనే గణేష్ ఉత్సవాల కోసం గడచిన కొన్నేళ్లుగా పోలీసు బలగాల మొహరింపును పద్ధతి ప్రకారం ఏర్పాటు చేయసాగారు. ఈ క్రమంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ విషయంలో దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న పని ఒత్తిడి, మానసిక ఒత్తిడిని అధిగమించగలిగారు. గణేష్ ఉత్స వాలంటేనే ఒకప్పుడు హైదరాబాద్‌లో అల్లర్లు, లూటీలు, గృహ దహనాలు, లాఠీఛార్జి, పోలీసు కాల్పులు, వారం పది రోజుల పాటు కర్ఫ్యూ వరకు సాగేవి. ఈ ఉత్సవాలు వస్తున్నాయంటే చాలు అనేక ప్రాంతాల ప్రజలు, వ్యాపార వర్గాలు భయంతో వణికిపోయే పరిస్థితులు వుండేవి. 1980 దశకం నుంచి అనేకసార్లు గణేష్ ఉత్సవాలలో అల్లర్లు, గొడవలు జరి గాయి. చివరకు పోలీసులకు సహాయంగా మిలటరి రంగంలో దిగిన ఉదంతాలూ వున్నా యి. అప్పట్లో ఈ ఉత్సవాల పర్యవేక్షణకు పోలీసులకు వున్న ఏకైక సాధనం టీవీలలో వచ్చే ప్రత్యక్ష ప్రసారం. గణేష్ ఉత్సవాల సందర్భంగా అల్లర్లను అదుపుకు చేసేందుకు భారీగా పోలీసులను మొహరించేవారు. ఉత్సవాల సమయంలో, నిమజ్జనం వేళ టీవీలలో ప్రసారమయ్యే దృశ్యాలే పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచేవి. ఇందుకోసం పూర్వపు పబ్లిక్ గార్డెన్స్, ఇప్పటి బషీర్‌బాగ్ పోలీసు కంట్రో ల్ రూంలలో 20 వరకు టీవీలు ఏర్పాటు చేసి టీవీ ఛానళ్లలో ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యక్ష ప్రసారం తాలూకు దృశ్యాలను వీక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పోలీసు శాఖ బలోపేతమవడం, మిస్టర్ టెక్నాలజిగా పేరొందిన మహేందర్ రెడ్డి కృషి వల్ల పోలీసు విభాగం రూపురేఖలు మారాయి. ఒక్క సిసి కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం అని ఆ యన అప్పట్లో అన్నప్పుడు అందరు వింతగా చూసేవారు. దీని ఫలితాలు మీకు రాబోయే రోజుల్లో కనిపిస్తాయి...అని మహేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన అన్నమాటలు ఇప్పుడు వాస్తవంలో కనిపిస్తున్నాయని పోలీసులతో పాటు పోలీసు విమర్శకులు సైతం అంగీకరిస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుల సత్తా



సుమిత్ సాంగ్వాన్

**తార్నాక, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 20వ ఆసియా క్రీడలు-2026లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలను సాధించాయి. ఈ విజయంతో భారత కబడ్డీ జట్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి తమ సత్తా చాటాయి. భారత జట్ల విజయంలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన క్రీడాకారులు కీలక పాత్ర పోషించడం విశేషం.భారత మహిళల కబడ్డీ జట్టులో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రీతూ నేగి, పింకీ రాయ్ సభ్యులుగా ఉన్నారు. జట్టు కోచ్‌గా వ్యవహరించిన నీతా దిద్వే కూడా దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగే కావడం విశేషం. పురుషుల కబడ్డీ జట్టులో సుమిత్ సాంగ్వాన్, అయాన్ లోచ్‌చాబ్ భాగస్వాములుగా ఉన్నారు.రీతూ నేగి లాలాగూడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లోని సీనియర్ మెటీరియల్ మేనేజర్ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. పింకీ రాయ్ మెట్టుగూడలోని సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్‌లో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయంలో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నీతా దిద్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కార్యాలయంలో చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.పురుషుల జట్టులోని అయాన్ లోచ్‌చాబ్, సుమిత్ సాంగ్వాన్ సికింద్రాబాద్‌లోని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయంలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్కులుగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికపై దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారులు సాధించిన ఈ అద్భుత విజయం దక్షిణ మధ్య రైల్వేతో పాటు భారతీయ రైల్వేలకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ, ఆయా విభాగాల్లో రాణించేలా దక్షిణ మధ్య రైల్వే అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి ఈ విజయం నిదర్శనమని తెలిపారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రీతూ నేగి, పింకీ రాయ్, నీతా దిద్వే, సుమిత్ సాంగ్వాన్, అయాన్ లోచ్‌చాబ్‌లను అభినందించారు. భారత కబడ్డీ జట్లకు వారు అందించిన సేవలను, భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వేలకు వారు తీసుకొచ్చిన కీర్తిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో ఘనంగా పోషణ్ మాసోత్సవాలు

## - మాసోత్సవం సందర్భంగా గర్భిణిలకు సీమంతం

## - అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు ఈ నెల 9 నుండి అక్టోబర్ 8 వరకు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్వహించే ఈ జాతీయ పోషణ మాసోత్సవం సందర్భంగా తెలంగాణలో శనివారం వివిధ జిల్లాల్లో దీనికి సంబంధించిన కార్యాక్రమాలను అధికారులు నిర్వహించారు. సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నుంచి పోషణ్ మాసాత్సోతవాలు ఘనంగా ప్రారంభమైంది. పలు కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, కూరగాయలు ప్రదర్శించారు. వైవిధ్య భరితమైన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. రోజువారీ భోజనంలో ఆకు కూరలు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సమతుల్య ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టులకు చెందిన అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోరులు, వారి కుటుంబాల్లో పోషకాహారం, ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించిన కీలక అలవాట్లపై అవగాహన పెంచేందుకు ప్రజలను భాగస్వాములను చేసే ప్రత్యేక వేదికగా పేర్కొన్నారు. కాగా ఈ పోషణ్ మాసోత్సవాల్లో గర్భిణులు, బాలింతలకు సమతుల, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారం అవసరంపై అవగాహన కల్పిస్తున్నారు. గత పోషణ మాస కార్యక్రమాల ద్వారా మాతృ పోషణ, శిశువులు, చిన్నారుల ఆహార పద్ధతులు, ఎదుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రతపై అవగాహన పెరిగింది. ఆరోగ్యకరమైన అలవాట్లలో సానుకూల మార్పు వచ్చింది.

# విద్యుత్ సమస్యలకు చెక్

## - పునరుత్పాదకత, స్వయం సమృద్ధే లక్ష్యం - పవర్ సామర్థ్యం పెంపునకు కృషి

## - ఖర్చుల తగ్గింపు, అవసరాల దిశగా కేంద్రం చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త** విద్యుత్ సమస్యలను ధీటుగా ఎదుర్కొనే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ సామర్థ్యం పెంపు, ఉత్పత్తి, సరఫరా తదితర నిర్వహణ ఖర్చుల తగ్గింపు, అవసరాలకు తగినట్లుగా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికా బద్ధంగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి బృందం తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు పలు సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పించింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం స్వీయ, షెడ్యూలింగ్‌పై తక్కువ ఆధారపడటం ద్వారా దుబారా, దుర్వినియోగాన్ని తగ్గించడం, మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదకత వాటాను పెంచడం, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తుల కోసం మార్కెట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి చెందిన అనుబంధ సేవల మార్కెట్ ద్వారా సేకరణలో ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేసింది.

విద్యుత్ పరివర్తన, గ్రిడ్‌లో పునరుత్పాదక శక్తికి సంబంధించి ఏకీకరణను ప్రారంభించేందుకు సమర్థవంతమైన, అనుకూలమైన, నమ్మదగిన మార్కెట్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడాన్ని లక్ష్యంగా కలిగి ఉండాలని తేల్చిచెప్పింది. దేశంలో విద్యుత్ మార్కెట్లు పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లడంలో గణనీయమైన మార్పులకు లోనవుతాయని పేర్కొంది.

# అత్యాచారం కేసులో నిర్దోషిగా విడుదలయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే

**అలహాబాద్, సెప్టెంబరు 26:** అత్యాచారం కేసులో అరెస్టైన కాంగ్రెస్ ఎంపీ రాకేష్ రాథోర్‌ను నిర్దోషిగా అలహాబాద్ కోర్టు విడుదల చేసింది. ఫిర్యాదు చేసిన మహిళతో ఆయనకున్న దీర్ఘకాల వివాహేతర సంబంధాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ విద్యార్థి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ నియోజకవర్గానికి ఎంపీగా ఉన్న రాకేష్ రాథోర్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదైంది. విచారణ చేపట్టిన కోర్టు వీరిద్దరి మధ్య పరస్పర అంగీకారంతోనే దీర్ఘకాల వివాహేతర సంబంధం ఏర్పడిందని గ్రహించింది. రాకేష్ రాథోర్‌కు, ఆమెకు బహిరంగ సమావేశాల్లో పరిచయం ఏర్పడిందని గుర్తించింది. ఆ తరువాత తైలిక్ మహాసంఘ్‌కు సదరు మహిళను ఆయన ప్రెసిడెంట్‌గా నియమించారని, ఇలా వీరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని కోర్టు తెలిపింది. ఫిర్యాదు చేసిన మహిళ భర్త వాంగ్మూలాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. తన నివాసం దగ్గరకు రావాలని తరచూ రాకేష్ రాథోర్ నా భార్యకు కాల్ చేసేవారు.

# తొండూరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

## 20 మంది విద్యార్థులకు అస్వస్థత - ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

**తొండూరు సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** వైయస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలంలోని అంబేద్కర్ బాలికల గురుకుల శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత దాదాపు 30 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురై చికిత్స కోసం తొండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మధ్యకాలంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాస్టల్ నిర్వహణపై పదేపదే ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెక్కినట్టు వ్యవహరించడం దారుణమని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు అన్నారు ఇటీవల బాత్రూంలో నిర్వహణ సరిహాలేదని ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు టీసీలు తీసుకొని హాస్టల్ వదిలి వెళ్ళిపోయారు ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్న అధికారుల పర్యవేక్షణ మాత్రం పూర్తిగా కొరబడింది అధికారులను అడుగుదామన్న అందుబాటులో ఉండరు ఉన్నవారు సరిగా సమాధానం చెప్పరు విద్యార్థుల తల్లిదండ్రులకు విలేకరులకు విద్యార్థి సంఘాలకు ప్రవేశం లేదని చెప్తూ విద్యార్థుల ఆరోగ్యాలతో వారి జీవితాలతో చలగాటమాడుతున్న అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు దాదాపు 500 మంది పైగా విద్యార్థినిలు ఆశ్రయం పొందుతున్న గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు బాత్రూంలు , మంచి త్రాగునీరు ,

పరిశుభ్రమైన డైనింగ్, హాలు లాంటి వసతులు కూడా కల్పించలేని అధికారులు వారి వ్యక్తిగత గొడవలతో మాత్రం నిత్యం బిజీగా ఉంటున్నారని సమాచారం వారి డ్యూటీల విషయంలో ఉన్న మనస్పర్థలతో పిల్లల భద్రతను గాలికి వదిలేసారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్న నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా బాధ్యులైన అధికారులపై విచారం జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలి

## వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత కోదండ రెడ్డి, బి ఆర్ ఎస్ నేత వినోద్ కుమార్, సిపిఎం నేత జాన్ వెస్లీ

**చిక్కడపల్లి సెప్టెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి) జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాల వల్ల దేశంలో ఎన్నికల వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆయనను తక్షణమే ఆ బాధ్యతల నుండి తొలగించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్షాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీజేఎస్ తదితర లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరిట కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించిందని ఆరోపించారు. ఎన్నికల సంఘంలోని మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు తెలిపినప్పటికీ, సిఈసి ఏకపక్షంగా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ఫారమ్6 లో అక్రమ సవరణలు, ఓటర్ల డేటా కేంద్రీకరణ (సెంట్రల్ సర్వర్) సాంకేతిక లోపాల వల్ల కోట్లాది మంది పేద, నిరక్షరాస్య పౌరులు ఓటు హక్కు కోల్పోయారని వాపోయారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ఈ నెల 30వ తేదీన ఎలక్షన్ కమిషన్ (సిఈఓ) బూర్గుల రామకృష్ణారావు భవన్ వద్ద ధర్నా, అలాగే అక్టోబర్ 1వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, తొలగించిన అర్హులైన ఓట్లను పునరుద్ధరించాలి.ఫారమ్6 లో తెచ్చిన నిబంధనలను రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలి.ఓటర్ల డేటా కేంద్రీకరణను రద్దు చేసి, స్థానిక ఈఆర్వో లకు అధికారాలు పునరుద్ధరించాలి. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు సీజేఐలతో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారానే కమిషనర్ల నియామకం జరగాలి. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బి. వినోద్ కుమార్, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ ఎం. కోదండరాం, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు జాన్ వెస్లీ, కె. రమ, ప్రజా ప్రొఫెసర్ కె. హరగోపాల్, జస్టిస్ బి. చంద్రకుమార్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# బి.సి. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

## - బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


ప్రసంగిస్తున్న జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ప్రభాతవార్త ):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బి.సి. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పునరుద్ధరించాలని, క్రీమీలేయర్ విధానాన్ని తక్షణమే తొలగించాలని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేసారు. శనివారం విద్యా నగర్‌లోని బి.సి. భవన్‌లో జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య అధ్యక్షతన వివిధ శాఖల బి.సి. ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్. కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగబద్ధమైన బి.సి. రిజర్వేషన్ల ప్రక్రియలో క్రీమీలేయర్ పేరిట అడ్డంకులు సృష్టించడం సరికాదని, దీనివల్ల బి.సి. ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల్లో ప్రమోషన్లు కల్పించడం ద్వారానే సామాజిక హోదా, ప్లానింగ్‌లో భాగస్వామ్యం పెరుగుతాయని స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టి ప్రమోషన్లలో బి.సి. రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అల్లం యాదయ్య మాట్లాడుతూ రాబోయే కులగణనలో ఓబి సి కి ప్రత్యేక కాలమ్ కేటాయించి ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ నంబర్ ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ప్రమోషన్లలో బి.సి.లకు రిజర్వేషన్లు కల్పించాలి. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలి. జనాభా ప్రాతిపదికన బి.సి. రిజర్వేషన్లను 27 శాతం నుండి 56 శాతానికి పెంచాలి.

చట్టసభల్లో బి.సి.లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో బి.సి., ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రైవేటు రంగంలోనూ బి.సి., ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ వర్తింపజేయాలి. కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.

## చేపా! చేపా ఏమి రుచిలే !

పులస తినాల్సిందే ! న్నన్నది గోదారోళ్ల జిహ్వా అదే అందరినీ ఊరిస్తుంటుంది. మరి చేప రుచులు చూద్దాం.

### పులసల పులుసు



**కావలసినవి :** పులస ముక్కలు-కెజి, ఉల్లి పాయలు- మూడు, పచ్చిమిర్చి- పది, బెండ కాయలు ఆరు, చింతపండు-యాభై గ్రాములు, అల్లంవెల్లులి పేస్టు-రెండు టేబుల్‌సూన్లు (అప్పటికప్పుడు పేస్టు చేసుకోవాలి), కారం-నాలుగు టేబుల్‌స్పూన్లు, గరంమసాలా, ధనియాలు, జీలకర్ర పొడి-టీస్పూన్ చొప్పున, కొత్తిమీర తరుగు - గుప్పెడు, పసుపు, టీస్పూన్, ఉప్పు-తగినంత, నూనె-రిపడా (కాస్త ఎక్కువే పడుతుంది)

**తయారీ :** చేపలను గట్టి ఉప్పు, పసుపుతో శుభ్రం చేసి ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత వీటిని కడగకూడదు. ఉల్లిపాయలను మిక్సీలో వేసి పేస్టు చేయాలి. చింతపండును ముందే నానబెట్టి పులుసు తీసుకోవాలి. పచ్చిమర్చిని నిలువుగా, బెండకాయలను రెండు ముక్కలుగా కోసుకోవాలి. వెడల్పాటి పాత్రలో నూనె పోసి వేడెక్కాక ఉల్లపాయ ముద్ద వేసి.. గోధుమరంగులోకి వచ్చాక అల్లంవెల్లుల్లి పేస్టు కలిపి వేయించాలి. ఇప్పుడు పచ్చిమర్చి, చేప ముక్కలు వేసి జాగ్రత్తగా కలపాలి. రెండు నిమిషాలు మగ్గనిచ్చి, చింతపండు రసం పోయాలి. తర్వాత అరలీటరు నీళ్లు పోసుకుని మూతపెట్టి, తక్కువ మంట మీద మరిగించాలి. మధ్యలో ఒకసారి పాత్ర రెండువైపులా బట్టతో పట్టుకుని కదపాలి. గరిట పెడితే ముక్కలు విరిగిపోతాయి. తర్వాత బెండకాయ ముక్కలు కొత్తమీర తురుము వేసి మూతపెట్టి మరగనివ్వాలి. మధ్యలోకదుపుతుండాలి. ఉప్పు, కారం సరిచూసుకునేఇ అవసరమైతే వేసి పులుసు దగ్గరపడిన తర్వాత దించేయాలి. ఈ పులుసును మట్టిపాత్రలో వండితే చాలా రుచిగా ఉంటుంది. తక్కువ మంట మీద ఎక్కువ సేపు మరిగించాలి.

### కొత్తిమీరతో...



**కావలసినవి :** చేపముక్కలు-ఆరు, పసుపు-టీస్పూన్, ఉల్లిపాయ-ఒకటి, ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి-నాలుగు, కొత్తిమీర-కట్ట, అల్లం ముక్క-ఒకటి, వెల్లుల్లి రెబ్బలు-మూడు, వేయించిన నువ్వులు, గోధుమపిండి-రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, ఆవనూనె-వేయించడానికి సరిపడా.

**తయారీ :** చేప ముక్కలను రెండు, మూడు సార్లు కడిగి శుభ్రంచేసుకోవాలి. బియ్యం కడుగుతో శుభ్రం చేస్తే నీచు వాసన రాకుండ ఉంటాయి. ఉల్లిపాయ, పచ్చిమర్చి, కొత్తిమీర, అల్లం వెల్లుల్లి మిక్సీలో వేసి మెత్తగా పేస్టు చేసుకోవాలి. అవసరమైతే కొన్ని నీళ్ల పోసుకోవాలిగానీ ఎక్కువైతే మిశ్రమం మరీ పలచగా అవుతుంది. దీన్ని చేప ముక్కలకు పట్టించి పావుగంటపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. వేయించిన నువ్వులు, గోధుమపిండి గిన్నెలో వేసికలపాలి.కడాయిలోనూనె పోసి బాగా వేడిచేయాలి. ఇప్పుడు వేడి నూనెను చేప ముక్కల మీద పోసి.. ఆపైన నువ్వులు, గోధుమ పిండి మిశ్రమాన్ని చల్లాలి. రెండో వైపు కూడా ఇలాగే చేయాలి.తర్వాత పెనం మీద నూనె పోసి వేడిచేసి రెండు చేప ముక్కలను ఒకపక్క వేపాలి. తర్వాత మెల్లగా రెండో వైపు తిప్పి బంగారు రంగులోకి వచ్చేవరకూ వేయించాలి. వీటిపైన ముందే వేడి నూనో పోస్తాం కాబట్టి మళ్లీ కడాయిలో వేయించాల్సిన అవసరం లేదు. పెనం మీద కాల్చుకుంటే సరిపోతుంది. పలచగా, చక్రాల్లో కోసిన ఉల్లిపాయ ముక్కలతో నంజుకుని తింటే చాలా బాగుంటుంది. ఇష్టమైతే ఈ ముక్కల మీద కాస్త నిమ్మరసం కూడా పిండుకోవచ్చు.

### ఇగురు



**కావలసినవి :** చేప ముక్కలు-ఆరు, పసుపు-అర టీస్పూన్, ఉప్పు-తగినంత, ధనియాలు, జీలకర్ర-టీ స్పూన్ చొప్పున, అల్లం తురుము-రెండు టీస్పూన్లు, కారం - టీస్పూన్, ఎండుమిర్చి-నాలుగు, బిర్యానీ ఆకులు- రెండు, నల్ల జీలకర్ర-పావు టీస్పూన్, తరిగిన ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- మూడు, ఆవనూనె- వేయించడానికి సరిపడా.

**తయారీ :** కాస్త పసుపు, ఉప్పువేసి చేప ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. పెనం మీద నూనె పోసి వేడిచేసి, ముక్కలను గోధుమ రంగులోకి వచ్చేంత వరకూ వేయించాలి. వీటిని ప్లేటులోకి తీసుకుని స్టా ఆఫ్ చేయాలి. ఇప్పుడు ధనియాలు, అల్లం తురుము, కొంచెం పసుపు, కారం, ఉప్పు చిన్న గిన్నెలోకి తీసుకుని నీళ్ల పోసి కలపాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి నల్లజీలకర్ర, ఎండు మిర్చి వేయించాలి. ఇవి కొంచెం వేగాక బిర్యానీ ఆకులు, ఉల్లిపాయ ముక్కలు వేసితక్కువ మంట మీద ఉడికించాలి. తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న మిశ్రమాన్ని వేసి కాస్త వేయించాలి. ఇప్పుడు చేప ముక్కలు జతచేసి కప్పు నీళ్ల పోసి..

ఆపైన చీల్చిన పచ్చిమిర్చిని వేయాలి. ముక్కలు మునిగేలా చేసి.. పావుగంటపాటు ఉడికించి వేడివేడిగా వడ్డించాలి. మధ్యస్థంగా ఉండే చేపలను చిన్న ముక్కలుగా కొయ్యకుండానూ ఇదే పద్ధతిలో కూర వండుకోవచ్చు.

### కరకరలాడేలా ..



**కావలసినవి :** చేపముక్కలు-నాలుగు, మైదా-పావు కప్పు, పసుపు-టీ స్పూన్, నిమ్మరసం-టేబుల్ స్పూన్, ఉల్లిపాయ-ఒకటి, ఉప్పు-తగినంత, చిన్న అల్లంముక్క-ఒకటి, వెల్లుల్లి రెబ్బలు-రెండు, పచ్చిమిర్చి-మూడు, కొత్తిమీర తరుగు-గుప్పెడు, గుడ్లు-నాలుగు, మిరియాల పొడి-పావు టీస్పూన్, బ్రెడ్ పొడి-రెండు కప్పులు, ఆవనూనె- వేయించడానికి సరిపడా.

**తయారీ :** చేపముక్కలను శుభ్రంగా కడిగివ టిష్యూనపేపర్‌తో నీళ్ల లేకుండా తుడవాలి. నిమ్మరసం, పసుపు, ఉప్పు పట్టించి మూతపెట్టి అరగంటపాటు పక్కనుంచాలి. ఉల్లిపాయ, పచ్చిమర్చి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర మిక్సీలో పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని చేప ముక్కలకు బాగా పట్టించి రెండు గంటలపాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇప్పుడు రెండు గుడ్ల సొనలో కొంచెం ఉప్పు, మిరియాల పొడి, మైదా వేసికలిపి చేప ముక్కలకు బాగా పట్టించాలి. మరో పాత్రలో రెండు గుడ్లు కొట్టి, చిటికెడు ఉప్పు వేయాలి. వెడల్పాటి ప్లేట్‌లో బ్రెడ్‌పొడి, కొంచెం ఉప్పు, మిరియాల పొడి వేసికలిపి పక్కన పెట్టాలి. ముందుగా గుడ్ల మిశ్రమంలో చేప ముక్కలను ముంచి తీసి.. బ్రెడ్ పొడిలో దొర్లించాలి. ముక్కల మీద పొడి పరుచుకునేలా స్పూన్‌తో సర్దాలి. కడాయిలో నూనె పోసి బాగా వేడిచేసి, తగ్గించాలి. తర్వాత మధ్యస్థంగా ఉండే మంట మీద ఒక్కో ముక్కనూ జాగ్రత్తగా వేయించి తీస్తే కరకరలాడే చేపల వేపుడు సిద్ధం. □

## సమానతతోనే ..



మాధ్యమిక, ఉన్నతస్థాయి విద్యలో దాదాపు సమానత్వాన్ని సాధించవచ్చు. ఆరోగ్యంలో ముందడుగు వేశాం. కానీ వృత్తి ఉద్యోగాల్లో ఆర్థిక భాగస్వామ్యంలో నాయకత్వంలో రాజకీయాల్లో వెనకే ఉన్నాం. అది ఎందుకో చూస్తే... మహిళలు ఉద్యోగాల్లో చేరడంతోనే సరిపోదు, కొనసాగడం, ఎదగడం కూడా కీలకమే. ఇక్కడే వ్యత్యాసం పెరుగుతోంది. ఓ నివేదిక ప్రకారం... 50 శాతం మంది 30ఏళ్లకు ఉద్యోగాలను వదిలేస్తే, బ్రేక్ తీసుకున్న మహిళల్లో 27 శాతమే తిరిగి చేరుతోంది. పెళ్లయిన వెంటనే 13 శాతం ఉద్యోగం మానేస్తున్నారట. అందుకే చదువుల్లో సమానంగా ఉన్న సీనియర్ అధికారులు, మేనేజర్ల స్థాయిలో స్త్రీల సంఖ్య తక్కువ. దీనికి మ్యారేజ్ పెనాల్టీనే కారణమన్నది నిపుణుల మా! ఆ మధ్య దక్షిణ ఢిల్లీకి చెందిన ఓ తల్లి... కొడుక్కి పెళ్లి చేయడానికి ఇచ్చిన ప్రకటన వైరలైంది. మా అబ్బాయి ఏడాదికి రూ.73 లక్షలు సంపాదిస్తాడు. అమ్మాయి స్మార్ట్ ఉండాలి. మంచి కాలేజీలో బాగా చదువుకుని ఉండాలి. కానీ ఉద్యోగం చేయకూడదు ఇదీ దాని సారాంశం. ఆమెలా ఆలోచించే కుటుంబాలు ఇంకా చాలానే, సంప్రదాయ కట్టుబాట్లు మరో కారణం. అధిక పని గంటలతో ఆలస్యంగా రావడం, ఆఫీసులు దూరంగా ఉండటం... వంటి సందర్భాల్లో ఎందుకీ కష్టం అని తల్లిదండ్రులూ ఉద్యోగం మానేసినట్లు ఒత్తిడి చేస్తున్నారు. ఇద్దరం ఉద్యోగం చేస్తే పిల్లల్ని ఎవరు చూస్తారంటూ భార్యల్ని ఇంటికే పరిమితం చేసే సంప్రదాయవాదులు లెక్కకు మిక్కిలే. ఉద్యోగం చేయాల్సిందే కానీ ఇంటి పని, పిల్లల బాధ్యత ఆమెవే అనే మగ మహారాజులకీ కొదవే లేదు . సౌకర్యాలు, కేర్ సెంటర్లు లేకపోవడం వల్ల మానేసేవాళ్లు కొందరైతే, పిల్లల్ని తీర్చిదిద్దేందుకు స్వచ్ఛందంగానే వదులుకునేవాళ్ళు ఇంకొందరు. నియామక ప్రక్రియ ల్లోనూ మహిళల వయసు, వైవాహిక స్థితిని తీసుకోవ డానికి ఇంకో కారణం. అక్కడికీ నేటి మహిళ వీట నిషేధం దాటి ఇంటినీ వృత్తినీ సమన్వయం చేసు కుంటూ ముందు కెళు తోంది. కానీ ఒక దశలో తీవ్ర మానసిక, శారీరక అలసటకు గురై, పరుగులో అలసిపోయి విరామం తీసుకుంటుంది. అయితే ఉన్నత విద్యావంతుల్ని పెళ్లి చేసుకున్న అమ్మాయిల్లో ఈ మ్యారేజ్, మదుడు పెనాల్టీ లు కాస్త తక్కువని చెబుతున్నాయి. కానీ మొదటిమీద వృత్తి ఉద్యోగాల్లో, కార్మికశక్తిలో, నాయకత్వంలో ఇంకా వెనకనే ఉన్నారు. ఆర్థిక భాగస్వామ్యంలో తక్కువగా ఉండటానికి కారణం వేతనం లేని ఇంటిపని; పిల్లలు, వృద్ధుల సంరక్షణలే. దీనికి విలువ కడితే దేశ ఆర్థికా భివృద్ధిలో ఆడవాళ్లదే పై చేయి అవుతుంది. కుటుంబం కోసం ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎక్కువగా శ్రమిస్తు న్నారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. శాసన సభ, పార్లమెంట్‌లోని మంత్రులు, నిర్వాహకుల్లో స్త్రీల వెనకబాటుకు ప్రధాన కారణం... సమాజంలోని పురు షాధిక్యత. సీట్లను కేటాయించకపోవడం, ఒకవేళ ఇచ్చినా గెలుపు కష్టమైన స్థానాలను ఇస్తోన్న పార్టీల వైఖరి, ఎన్నికల్లో డబ్బు ప్రభావం, రాజకీయాల్లోకి వచ్చే మహిళలపై సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్, వేధింపు లు, హక్కులపై అవగాహనలోపం... ఇలాంటి కారణాల వల్ల ఈ రంగం మాకొద్దు, నెగ్గలేంఖి అన్న భావనతో దూరంగా ఉంటున్నారు. ఇది మారాలంటే 33 శాతం కాదు, సగం సీట్లను కేటాయించాలి. □

## దైవసాక్షాత్కారం ..

మనం ఎలాజీవిస్తే స్వర్గానికి దారి కనుక్కొని చేరి భగవంతుణ్ణి చేరగలమో వివరిస్తారు పరమహంస యోగనంద అంటారు. తమ మనస్సులు మొద్దుబారేలా అనుమతించేవారు నిజంగా మరణిస్తారు. జీవితపు మర్మాన్ని ఛేదించటానికి మీరు ప్రతిరోజూ సరికొత్తగా పుట్టాలి. దీని అర్థమేమంటే ఏదో ఒక విధంగా మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి రోజు ప్రయత్నించాలి. అన్నిటి కన్నా జ్ఞానం కోసం ప్రార్థించండి. జ్ఞానంతోపాటు ప్రతిదీ వస్తుంది. ఆ విజ్ఞానం కోసం ప్రార్థించండి. జ్ఞానంతోపాటు . ఆ విజ్ఞానంతో సృజనాత్మక ఆలోచనను, కార్యనిమగ్నతను వృద్ధి చేసుకోండి. మీ మానసిక వికాసానికీ, ఇతరుల ప్రయోజనం కోసం నిర్మాణాత్మకమయిన పనులు చేయడంలో కార్యనిమగ్నులై ఉండండి. ఎందుకంటే దైవరాజ్యలోకి ప్రవేశించాలనుకునేవారు ప్రతిరోజు ఇతరులకు మంచి చేయడానికి ప్రయత్నించాలి. మీరు ఈ సరణిని అనుసరిస్తే మీ విచారగ్రస్తతను తొలగించి ఆనందాన్నిచ్చే మానసిక, శారీరక, ఆధ్యాత్మిక పురోభివృద్ధిని మీరు అనుభూతి పొందుతారు. మీరు భగవంతుణ్ణి తప్పకుండా చేరతారు. ఎందుకంటే మార్గం స్వర్గ రాజ్యానికి దారి చూపుతుంది. (పుట-240 మానవుడి నిత్యాన్వేషణ- శ్రీ పరమహంస యోగానంద) దీన్ని బట్టి తెలిసేది ఏమంటే ప్రతి రోజూ మనం ఆత్మవిమర్శ చేసికొని చెడును విసర్జించి, పురాతన మూఢ విశ్వాసాలను అంటి పెట్టుకోకూడదు. ఎప్పుడూ అందరికీ మంచి చేయటానికే కృషి చేయాలి. అప్పుడు దైవ సాక్షాత్కారం కలిగే అవకాశం ఇక్కడే, ఇప్పుడే లభిస్తుంది. మనం అందరం ఆచరించగల విషయాలే పరమహంస యోగానంద చెప్పారు ఉవాచలు. □

---

# తెర

## 'సిగ్మా' ఖచ్చితంగా హిట్ అవుతుంది: చిరంజీవి



సిగ్మా ట్రైలర్ చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంది. సందీప్ కిషన్ సినిమాలు వెరైటీగా ఉంటాయి. సంజయ్ వాళ్ల నాన్నగారిలా గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. 'సిగ్మా' ఖచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాను: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి ప్రీరిలీజ్ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... నేను నేరుగా కాకా షూటింగ్ నుంచి వస్తున్నాను. ఏడు గంటల వరకు షూటింగ్ అయింది. త్వరగా ఫినిష్ చేయండి, ఈవెంట్‌కి వెళ్తానని చెప్పాను. అక్కడ అందరూ రెస్ట్ తీసుకోవచ్చు కదా అని అన్నారు. వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూలో అది కరెక్టే. కానీ నేను మాత్రం ఒక వేడుకకు రావడం బాధ్యతగా ఫీల్ అవుతాను. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. తెలుగు పరిశ్రమలో మా జనరేషన్‌కి, మా తర్వాత వచ్చే జనరేషన్‌కి గురువు మెగాస్టార్ చిరంజీవి . ఆయన చూడని బాక్సాఫీస్ రికార్డులు లేవు. ఆయన మా అందరికీ ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇండస్ట్రీ ఇంటర్నేషనల్ స్థాయికి వెళ్ళిందంటే దానికి పునాది వేసింది మెగాస్టార్ చిరంజీవి గారే. నా 16 ఏళ్ల కెరీర్‌లో 22 తెలుగు సినిమాలు, 9 తమిళ్ సినిమాలు చేశాను. డైరెక్టర్ జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. మా సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇది సినిమా యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్. హీస్ట్, ట్రెజర్ హంట్ లాంటి కొత్త ఎలిమెంట్స్ ఉన్నాయి. ప్రతి ఒక్కరూ సినిమాకి కనెక్ట్ అవుతారు.'సిగ్మా' టీమ్ అందరికీ థాంక్యూ. మ్యూజిక్‌డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. ముందుగా లైకా ప్రొడక్షన్స్‌కి థాంక్యూ. ఈ సినిమా నాకు చాలాస్పెషల్ ఫిలిం. విజయ్‌తో నేను 'వారిస్థు సినిమా చేశాను. ఇప్పుడు సంజయ్ సినిమాకి మ్యూజిక్ చేయడం హ్యాపీగా ఉంది.

## 'రణబాలి' అక్టోబర్ 16న విడుదల



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.'రణబాలి' సినిమా విడుదల వాయిదా పడుతుందనే రూమర్స్ కు చెక్ పెడుతూ ఈ రోజు మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీతో కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. తన మాతృభూమిని, తన ప్రజల్ని కాపాడేందుకు ప్రతిజ్ఞ చేసి వీరతిలకం పెట్టుకున్న యోధుడు రణబాలిగా విజయ్ దేవరకొండ మెస్మరైజింగ్ లుక్ తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పాటలో విజయ్, రశ్మిక కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది. త్వరలోనే "రణబాలి" సినిమా ట్రైలర్ ను, మిగతా లిరికల్ సాంగ్స్ ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్ధ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ లో ఆసక్తి కలిగిస్తోంది.

## 'చకోర' అక్టోబరు 9న విడుదల



శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి ్మ పిక్చర్స్ ద్వారా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హీరో ఆకాష్ జగన్నాథ్ అతిథిగా ఈ సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ లో జరిగింది. డైరెక్టర్ మంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు జీవితంలో పోరాటం నేర్పిన నా తండ్రికి, నాకు స్ఫూర్తిగా నిలిచిన మా అమ్మకు, నా ఇండస్ట్రీ గురువు పూరి జగన్నాథ్‌కి థ్యాంక్స్. ఈ సినిమా రూపకల్పనలో నాకు అండగా నిలబడిన మా ప్రొడ్యూసర్ చింతాడ హేమారావుకు థ్యాంక్స్. ఇండస్ట్రీలో నాకున్న అనుభవంతో వీలైనంత తక్కువ బడ్జెట్ లో హై క్వాలిటీలో ఈ సినిమాను రూపొందించాను. పేరున్న హీరోలను అప్రోచ్ అయి వారితో సినిమా చేయడం సులువుకాదు. అందుకే కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుని శ్రవణ్, మలైకా టి.వాసుపల్ ను హీరో హీరోయిన్స్‌గా పరిచయం చేస్తున్నాం. వీరిద్దరు నేను అనుకున్న విజన్ కు తగినట్లు మంచి పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. మా సినిమా అక్టోబర్ 9న థియేటర్స్ లోకి రాబోతోంది. ఇప్పటికే ఇండస్ట్రీ నుంచే కాక మీడియాలోని ఫ్రెండ్స్ కు కూడా సినిమా చూపించాం.హీరో శ్రవణ్ మాట్లాడుతూ ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం కల్పించిన మా ప్రొడ్యూసర్, డైరెక్టర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా కోసం సెలెక్ట్ అయినప్పుడు నేనొక రాయిలా ఉన్నాను. నన్ను ఈ పాత్రకు తగినట్లు శిల్పంలా చెక్కిన ఘనత మా డైరెక్టర్ కే దక్కుతుంది. మా మ్యూజిక్ డైరెక్టర్ ప్రిన్స్ హెన్రీ బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్, రొమాంటిక్ ఎంటర్ టైనర్ చూడాలనుకుంటే మీరు మా సినిమాకు రావొచ్చు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకు మధ్య బాండింగ్, తల్లీ కొడుకు మధ్య అనుబంధం, స్నేహితుల మధ్య ఉంటే బాండింగ్, ప్రేమ జంట మధ్య ఉండే లవ్ మీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది.

## 'లవ్ అండ్ వార్' ఫస్ట్ లుక్ రిలీజ్




సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్థ్ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక చిత్రంగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేసిన చిత్రబృందం నేడు తాజాగా విక్కీ కౌశల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.పోస్టర్‌లో విక్కీ కౌశల్ సిగరెట్, లైటర్‌తో కనిపిస్తూ ఎంతో ఇంటెన్స్‌గా చూస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు చూడని విభిన్నమైన లుక్‌లో విక్కీ కనిపించడం విశేషం. ఆయన లుక్‌లో స్టైల్, చార్మ్‌తో పాటు పాత్రలోని తీవ్రత కూడా స్పష్టంగా కనిపిస్తోంది.భన్సాలీ సినిమాల్లో హీరోల పాత్రలకు ప్రత్యేకమైన రూపాన్ని, స్టైల్‌ను అందిస్తుంటారు. అదే తరహాలో విక్కీ కౌశల్ లుక్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. రణ్‌బీర్, అలియా తర్వాత ఇప్పుడు విక్కీ ఫస్ట్ లుక్ కూడా'లవ్ అండ్ వార్థ్ పై అంచనాలను మరింత పెంచింది. ముగ్గురు నటుల ఫస్ట్ లుక్ పోస్టర్లు మూడు విభిన్నమైన పాత్రలను, మూడు ప్రత్యేకమైన ప్రపంచాలను పరిచయం చేస్తున్నాయి. విక్కీ పోస్టర్ మాత్రం సినిమాకు మరింత ఇంటెన్స్ టచ్‌ను తీసుకొచ్చింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లవ్ అండ్ వార్థ్‌లో రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## 'గరివిడి లక్ష్మి' నుంచి సాంగ్ విడుదల



భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి ్మ కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న'గరివిడి లక్ష్మి ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా 'కొండ కోన కోరసు పాడే' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటని చరణ్ అర్జున్ స్వయంగా సాహిత్యం అందించి ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. అనన్య భట్, చరణ్ అర్జున్ పాడిన తీరు అందరినీ అలరించింది. ఈ పాటకు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గరివిడి లక్ష్మి మన ఊరి పాటలు, అనుభూతులు, మన మూలాల నుంచి వచ్చే ఆత్మగౌరవానికి సెల్యూట్ లాంటి సినిమా.అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'రామాయణం' 'జై జై రామ్' సాంగ్ రిలీజ్



రామాయణం మేకర్స్ ఈ చిత్రంలోని తొలి పాట 'జై జై రామ్' తెలుగు వెర్షన్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుట్టారు. ఈ పాటకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. రాకేందు మౌళి తెలుగు సాహిత్యం అందించగా దీపాలి సహాయ్, రాఘవ్ కౌశిక్ పాడారు. శ్రీరాముడిని స్మరిస్తూ రూపొందిన ఈ పాటలో ఆధ్యాత్మిక భావాన్ని, సినిమాటిక్ సౌండ్‌తో ప్రజెంట్ చేశారు. శ్రీరాముడి కరుణ, ధర్మాన్ని పాట సాహిత్యం ప్రతిబింబిస్తుంది. పదే పదే వినిపించే 'జై జై రామ్'అనే నామస్మరణ ఈ పాటకు భక్తి భావాన్ని అందిస్తుంది.ఫిల్మ్‌మేకర్, ప్రొడ్యూసర్ నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ:'శ్రీరాముడు 'రామాయణం'కు హృదయం. తరతరాలుగా జీవితంలోని ప్రతి దశలో మనం ఆయన ను మార్గదర్శిగా భావిస్తున్నాం. కష్ట సమయాల్లో ఆయన బలాన్ని కోరుకుంటాం. అనిశ్చితి ఎదురైనప్పుడు ఆయన చూపిన మార్గాన్ని చూస్తాం. ఆనంద సమయంలో కృతజ్ఞతతో ఆయనను స్మరించుకుంటాం. 'జై జై రామ్ శ్రీరాముడితో మనకున్న ఈ వ్యక్తిగతమైన, శాశ్వతమైన అను బంధం నుంచి వచ్చింది. రామాయణంథ్‌ను ఎంతో భారీ స్థాయిలో తెరకెక్కి స్తున్నప్పటికీ.. దాని అసలైన పునాది భావోద్వేగం, విలువలు, భక్తి. జై జై రామ్‌తో మా తొలి పాట ఆ ఆత్మను ప్రతి బింబించాలని కోరుకున్నాం. మనం ఆరాధించే వ్యక్తిగా మాత్రమే కాకుండా.. మనలోని రక్షకుడిగా, మార్గదర్శిగా, బలానికి మూలంగా శ్రీరాముడిని ఈ పాట ద్వారా సెల్రబ్రేట్ చేయాలనుకున్నాం. "ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ 'జై జై రామ్' పాటకు హృదయం శ్రీరాముడి నామాన్ని శక్తివంతంగా పదే పదే స్మరించడమే. సంగీతపరంగా ఒక ప్రార్థనలోని స్వచ్ఛత, ఆత్మీయతను కాపాడుతూ.. అదే సమయంలో ఆ కంపోజిషన్ సినిమాటిక్ సాంగ్‌గా ఎదిగేలా చేయాలనుకున్నాం.



## స్వదేశంలో మూడు మ్యాచ్‌ల వన్డే..

# నేటి నుండి వెస్టిండీస్‌తో భారత్ ఢీ



**న్యూఢిల్లీ:** భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 27 నుంచి స్వదేశంలోని తిరువనంతపురంలో జరగనుంది. ఈ పర్యటనలో ఇరు జట్లు 3 వన్డేలు, 5 టీ20లలో తలపడనున్నాయి. ఈ పోరులో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగనుంది. టీమిండియాకు సంబంధించి సెలక్టర్లు అత్యంత పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. అయితే తొలి మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేస్తుండగా పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన బంతి శుభ్‌మన్ గిల్ కుడి మోచేతికి బలంగా తాకడంతో ప్రాక్టీస్ ఆపేసాడు. గాయం చిన్నది కావడంతో బరిలోకి దిగనున్నాడు. శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో బిజీగా ఉండటం వల్ల ఈ సిరీస్‌కు అందుబాటులో లేడు. అయినప్పటికీ రుతురాజ్ గైక్వాడ్, ఆకిబ్ నబీ, నమన్ ధీర్‌వంటి యువఆటగాళ్లతో పాటు, రవీంద్రజడేజా కూడా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. కొంతమంది స్టార్‌ఆటగాళ్లకు తొలి వన్డే తుది జట్టులో స్థానం దక్కడం సందేహంగా మారింది. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా బరిలోకి దిగడం ఖాయం కాగా, మూడో స్థానంలో విరాట్ కోహ్లి ఆడనున్నాడు. దీంతో టాప్ ఆర్డర్‌లో యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కడం కష్టంగా మారింది.అయితే గిల్ గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైతే జైస్వాల్ ఓపెనర్‌గా రానున్నాడు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో ఖాళీ అయిన నంబర్4 స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఈ పొజిషన్‌లో రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గైక్వాడ్ ఇప్పటివరకు 9 వన్డేల్లో 228 పరుగులు సాధించాడు. ఇక వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో బరిలోకి దిగనుండగా, ఆల్ రౌండర్ల కోటాలో నితీశ్ కుమార్, రవీంద్ర జడేజా జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనున్నారు.

## బ్యాడ్మింటన్: ఓటమితో

# లక్ష్య నిష్క్రమణ

**ఇచినోమియా:** పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో, సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూ చేతిలో మూడు గేమ్‌ల తేడాతో ఓడిపోవడంతో లక్ష్యసేన్ ఆసియా క్రీడల ప్రయాణం ముగిసింది. ఇచినోమియాలో శనివారం జరిగిన మ్యాచ్‌లో, 13వ ర్యాంకు క్రీడాకారుడు



లోహ్‌ఆరంభంలో ఎదురైనఎదురుదెబ్బ నుండి కోలుకుని, ప్రపంచ 14వ ర్యాంకు క్రీడాకారుడైన సేన్‌ను 21-12, 15-21, 21-14 తేడాతో ఓడించాడు. సేన్ ప్రారంభ గేమ్‌ను బలంగా ప్రారంభించి, 5-1 ఆధిక్యానికి దూసుకుపోయాడు. లోహ్ అద్భుతమైన 10 పాయింట్ల పరంపరతో స్పందించి, పోటీని తన వైపుకు తిప్పుకుని, పట్టు సాధించాడు. ఈ సింగపూర్ ఆటగాడు తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, గేమ్‌ను 21-12 తేడాతో ముగించాడు. రెండో గేమ్‌లో భారత షట్లర్ సేన్ 21-15 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుని, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. చివరి గేమ్ హోరాహోరీగా సాగింది, కానీ లోహ్ క్రమంగా ఆధిక్యం సాధించి, విరామ సమయానికి 11-6తో ముందున్నాడు. సేన్‌పుంజుకుని, వరుసగా 4 పాయింట్లు సాధించి తేడాను 13-14కు తగ్గించి, ఆ తర్వాత 14-16కు చేరుకున్నాడు. అయితే లోహ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి తన ఆధిక్యాన్ని తిరిగి పొందాడు. ఆ తర్వాత అతను మ్యాచ్ పాయింట్‌కు చేరుకోగా, సెన్ కొట్టిన రిటర్న్ షాట్ నెట్‌లోకి వెళ్లడంతో పోటీ ముగిసింది.

## ఆసియా క్రీడలు






# కబడ్డీలో భారత్‌కు డబుల్ టైటిల్స్

## పురుషులు, మహిళల జట్లకు స్వర్ణాలు

**తోకై:** ఆసియా క్రీడల కబడ్డీ ఫైనల్స్‌లో ఇరాన్‌పై విజయం సాధించడం ద్వారా భారత పురుషుల, మహిళల జట్లు రెండూ తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకోవడంతో, భారత్ డబుల్ స్వర్ణ పతకాలను సాధించింది.
హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో మహిళల జట్టు మొదట ఆధిక్యం సాధించి, ఇరాన్‌ను 37-34 తేడాతో ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 22-16 ఆధిక్యంలో ఉండగా, రెండో అర్ధభాగంలో ఇరాన్ బలంగా పుంజుకుని, డిఫెండింగ్ ఛాంపియన్లపై 18-15 తేడాతో ఆధిక్యం సాధించింది. తొలి అర్ధభాగంలో లభించిన ఆధిక్యమే చివరికి నిర్ణయాత్మకంగా నిలిచింది. ఆ తర్వాత పురుషుల జట్టు మరో ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో ఇరాన్‌పై 40-34 తేడాతో విజయం సాధించి అదే ఘనతను అందుకుంది. స్కోర్లు 20-20తో సమంగా ఉన్నప్పుడు, రెండవ భాగంలో భారత్ ఆధిక్యం సాధించి మరో ఆసియా క్రీడల స్వర్ణాన్ని కైవసం చేసుకుంది.

## హాకీలో

# సెమీఫైనల్‌కు భారత్

**కకమిగహార:** డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్, శనివారం పూల్ ఎలో ఆతిథ్య జపాన్‌పై 2-0 తేడాతో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజయంసాధించి, 2026 ఆసియా క్రీడల పురుషుల హాకీ సెమీఫైనల్స్‌లో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలో జరిగిన గ్రూప్ దశలో, భారత్ వరుసగా నాలుగో విజయాన్ని కైవసం చేసుకుంది. మొదటి క్వార్టర్‌లో అభిషేక్ తొలిగోల్ చేయగా, మూడో క్వార్టర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ శక్తివంతమైన పెనాల్టీ




కార్నర్ ఫ్లిక్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. జపాన్ దూకుడుగా ప్రారంభించి, వేగవంతమైన ఎదురుదాడిలతో భారత రక్షణ శ్రేణిని పరీక్షించింది. గోల్‌కీపర్ సూరజ్ కర్కెరా ఆరంభంలోనే రంగంలోకి దిగగా, మన్‌ప్రీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, అభిషేక్ ద్వారా భారత్ అనేక అవకాశాలను సృష్టించుకుంది. అభిషేక్ జపాన్ గోల్ కీపర్‌తకాషి యోషికావాను దాటి బంతిని పంపి, తొలి క్వార్టర్ ముగిసేసరికి భార త్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో కూడా జపాన్ దూకుడుగానే ప్రయత్నించినా, భారత రక్షణ వలయాన్ని ఛేదించలేకపోయింది. 40వ నిమిషంలో లభించిన ఆరో పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ బలంగా పంపించడంతో యోషికావాకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయి భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లి విజయం సాధించింది.

ఆట




# మహిళల పరుగులో ప్రాచీకి కాంస్యం

## పురుషుల ఫైనల్‌కు అనిమేష్ అర్హత




**నాగోయా:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో శనివారం జరిగిన మహిళల పరుగు పందెంలో భారత క్రీడాకారిణి ప్రాచీచౌదరి 53.21 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మహిళల 400 మీటర్ల ఈవెంట్‌లో ప్రాచీ ఈ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె 53.21 సెకన్లలో రేసును పూర్తి చేసి పోడియం స్థానాన్ని దక్కించుకుంది. దీంతో ఐచినాగోయా గేమ్స్‌లో భారతదేశం యొక్క మొత్తం పతకాల సంఖ్య 30కి చేరింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, పన్నెండు రజతాలు, పద్నాలుగు కాంస్యాలకు పెరిగింది. ఇదిలా ఉండగా, మూడవ సెమీఫైనల్‌లో 20.81 సెకన్ల సమయంతో రెండవ స్థానంలో నిలిచిన అనిమేష్ కుజూర్ 200 మీటర్ల ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు. థాయిలాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20:10 సెకన్లలో రేసును పూర్తి చేసి కొత్త గేమ్స్ రికార్డును నెలకొల్పగా, అతని తర్వాత కుజూర్ నిలిచాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో స్థానం సంపాదించడంలో విఫలమైన ఈ భారత్ స్ప్రింటర్ ఇప్పుడు 200 మీటర్ల పతకాల రేసుకు అర్హత సాధించాడు. పురుష/ల 1500 మీటర్ల ఫైనల్‌లో కూడా భారత్ రెండు స్థానాలు దక్కించుకుంది. గుల్వీర్ సింగ్, యూనస్ షా వారి వారి హీట్‌ల నుండి అర్హత సాధించారు. హీట్ 2లో గుల్వీర్ 3:45.79 సమయంతో మూడవ స్థానంలో నిలవగా, హీట్ 1లో యూనస్ కూడా 3:45.77 సమయంతో మూడవ స్థానాన్ని పొందాడు.

## ఇపిఎఫ్ చందాదారులకు

వాణిజ్యం

# వడ్డీ జమ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్‌ఒ) తమ చందాదారులకు ఊరటనిచ్చే ప్రకటన చేసింది. ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించిన ఇపిఎఫ్ వార్షిక వడ్డీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది. ఈసారి తీసుకొచ్చిన సరికొత్త ఆటోమేటెడ్ వార్షిక వడ్డీ విధానం ద్వారా ఎటువంటి టెక్నికల్ జాప్యం లేకుండా అత్యంత వేగంగా, పారదర్శకంగా, సింగిల్ క్లిక్‌తో పిఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ చేసినట్లు తెలిపింది. 34 కోట్లకు పైగా పిఎఫ్ ఖాతాల్లో రూ.1.44 లక్షల కోట్ల వడ్డీ డబ్బును జమ చేశామని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఇపిఎఫ్‌ఒ ఓ పోస్ట్ చేసింది. ఇపిఎఫ్‌ఒ సంస్కరణలతో వడ్డీ జమ అనేది ఎలాంటి అడ్డంకులు లేకుండా వేగంగా జరుగుతోంది. ఆటోమేటెడ్ యాన్యువల్ ఇంట్రెస్ట్ క్రెడిట్ ద్వారా గత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి 34 కోట్లకు పైగా ఇపిఎఫ్ మెంబర్ అకౌంట్లలో 8.25 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1.44 లక్షల కోట్లకు పైగా ఇంట్రెస్ట్ డబ్బులను జమ చేయడం జరిగింది. కొత్త వ్యవస్థతో చాలా వేగంగా, పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా వడ్డీ జమ పూర్తయిందని ఇపిఎఫ్‌ఒ వెల్లడించింది. మీ ఇపిఎఫ్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్ నుంచి 9966044425 అనే నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా తక్షణమే బ్యాలెన్స్ ఎస్ఎంఎస్ రూపంలో మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి ఇపిఎఫ్‌ఒ యుఎఎన్ నంబరు టైప్‌చేసి 7738299899కి మెసేజ్ చేస్తే క్షణాల్లో బ్యాలెన్స్ రిప్లై వస్తుంది. ఉమాంగ్ యాప్ ఓపెన్ చేసి ఇపిఎఫ్‌ఒ సేవలను ఎంచుకోవాలి. వ్యూ పాస్‌బుక్ ఆప్షన్‌పై క్లిక్ చేసి, మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్, ఓటిపి నమోదు చేయడం ద్వారా పాస్‌బుక్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# బంగారం రుణాల జోరుకు బ్రేక్

## వ్యక్తిగత రుణాలదే పైచేయి: యుబిఎస్



**ముంబయి, సెప్టెంబర్ 26:** దేశంలో అసురక్షిత రుణాల విభాగంలో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉందని యుబిఎస్ గ్లోబల్ రీసెర్చ్ పేర్కొంది. ఇప్పటివరకు వేగంగా పెరిగిన బంగారం రుణాల స్థానాన్ని మళ్లీ వ్యక్తిగత రుణాలు ఆక్రమించే అవకాశముందని తెలిపింది. బంగారం ధరలు స్థిరపడుతుండటంతో గోల్డ్ లోన్ల వృద్ధి మందగించవచ్చని, అదే సమయంలో వ్యక్తిగత రుణాల వృద్ధి పుంజుకుంటోందని వెల్లడించింది. యుబిఎస్ విడుదల చేసిన ఇండియా ఫైనాన్షియల్స్‌ది బిగినింగ్ ఆఫ్ యాన్ అన్‌సెక్యూర్డ్ అప్‌సైకిల్ నివేదిక ప్రకారం ఆగస్టులో ఎన్‌బిఎఫ్‌సిలు ఇచ్చే వ్యక్తిగత రుణాల వృద్ధి రెండేళ్ల గరిష్ఠానికి చేరింది. వార్షిక ప్రాతిపదికన ఇది సుమారు 30 శాతంగా నమోదైంది. బ్యాంకుల వ్యక్తిగత రుణాల వృద్ధి కూడా 9 శాతానికి చేరుకుంది. ఐదేళ్లలో ఐదు రెట్లు పెరిగిన గోల్డ్ లోన్ల వాటా 2025-26 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాలు ఏకంగా 50 శాతం వృద్ధి చెందాయి. యుబిఎస్ పరిశీలించిన కాలంలో ఇదే అత్యంత వేగవంతమైన వృద్ధి. క్రెడిట్ బ్యూరో సిఆర్ఐఎఫ్ హైమార్క్ గణాంకాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో బంగారం రుణాల మొత్తం విలువ సుమారు రూ.18.6 లక్షల కోట్లుగా ఉంది.దేశ జిడిపిలో బంగారం రుణాల వాటా 2019 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదు రెట్లు పెరిగి 1 శాతం నుంచి 5 శాతానికి చేరింది.వ్యక్తిగత రుణాల్లో మళ్లీ జోరుగత రెండేళ్లుగా నియంత్రణ చర్యలు, రుణగ్రహీతలపై పెరిగిన రుణభారం కారణంగా వ్యక్తిగత రుణాల వృద్ధి మందగించింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోందని యుబిఎస్ విశ్లేషకులు అలోక్ శ్రీవాస్తవ, యశ్ అగర్వాల్, కరణ్ పరేశ్ త్రివేది తెలిపారు.




# ఐపిఒకు వస్తున్న కోల్‌ఇండియా సబ్సిడరీలు

**ముంబయి, సెప్టెంబరు 26:** భారత ప్రభుత్వ రంగానికిచెందిన మైనింగ్ దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ తన అనుబంధ సంస్థల్ని వరుసగా ఐపిఒలకు తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 2030 కల్లా మొత్తం తన 8 అనుబంధ కంపెనీలను స్టాక్ మార్కెట్లో నమోదుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ యేడాదిలోనే రెండు సబ్సిడరీలను ఐపిఒ ద్వారా మార్కెట్లోకి తీసుకొచ్చింది. ముందుగా భారత్ కోకింక్ కోల్ లిమిటెడ్ ఐపిఒ జనవరిలో వచ్చింది. జనవరి 9,13 మధ్య సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకొని జనవరి 19న ఎక్స్ఛేంజీల్లో లిస్టయింది. ఇది మంచి రిటర్న్స్ కూడా ఇచ్చింది. మరో సంస్థ సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ కూడా మార్చిలో పబ్లిక్ ఇష్యూ ద్వారా అడుగుపెట్టింది. మరోవైపు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా కోల్ ఇండియా కూడా తరచుగా వాటాల్ని విక్రయిస్తోంది. తాజాగా మరో రెండు ఐపిఒలను లైన్లో పెట్టింది. ఇప్పటికే ఇందులో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ కూడా ఐపిఒ కోసం డిఆర్‌హెచ్‌పి సెబీకి దాఖలు చేసింది. దీనికింద సుమారు 66.18కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు దాఖలు చేసిన పత్రాల్లో పేర్కొంది. కోల్ ఇండియా మరో అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ఐపిఒను కూడా తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా సుమారు 800 బిలియన్ డాలర్లు భారత కరెన్సీలో చూస్తే రూ. 7600 కోట్లకుపైగా నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ ఐపిఒ పరిమాణం, తుది తేదీపై ఇంకా నిర్ణయం ఖరారు కాలేదు. ఈ కంపెనీ విషయానికి వస్తే కోల్ ఇండియా అతిపెద్ద అనుబంధ సంస్థల్లో ఒకటి. ఇది భారతదేశంలో సుమారు 60 బొగ్గు గనులను నిర్వహిస్తోంది. ప్రతిపాదిత ఐపిఒ కోసం కోల్ ఇండియా నాలుగు ప్రముఖ సంస్థలను మర్చంట్ బ్యాంకర్లుగా నియమించుకుంది. ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఐడిబిఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ ఈ ఇష్యూపై పనిచేయనున్నాయి.

## వచ్చే యేడాది తొలి ఆరు నెలల్లో

# ఔన్సు 5,000 డాలర్లకు పసిడి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** బంగారం ధరలు ఈ యేడాది మిగిలిన కాలంలోనూ అధిక స్థాయిల్లో కొనసాగవచ్చని, వచ్చే యేడాది తొలి అర్ధభాగంలో మరింత పెరిగే అవకాశం ఉందని ఐసిఐసిఐ బ్యాంక్ పరిశోధన నివేదిక అంచనా వేసింది. 2027 ప్రథమార్ధంలో బంగారం ధర ఔన్సుకు 4,600-5,000 డాలర్ల పరిధిలో ఉండొచ్చని బ్యాంక్ పేర్కొంది. 2026 మిగిలిన కాలంలో మాత్రం 4,200-4,600 డాలర్ల మధ్య కొనసాగవచ్చని తెలిపింది.సెప్టెంబరులో బంగారం ధరల్లో గణనీయమైన దిద్దుబాటు చోటుచేసుకున్నప్పటికీ, ఈ విలువైన లోహంపై పెట్టుబడి ఆకర్షణ కొనసాగుతుందని ఐసిఐసిఐ బ్యాంక్ అభిప్రాయపడింది. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, పెట్టుబడిదారుల నుంచి డిమాండ్, ఆర్థిక మరియు భౌగోళిక అనిశ్చితి సమయంలో రక్షణాత్మక పెట్టుబడిగా బంగారానికి ఉన్న ప్రాధాన్యం ధరలకు మద్దతు ఇస్తాయని పేర్కొంది. 2026లో రూ.1.40-1.60 లక్షల మధ్య ధ2026 మిగిలిన కాలంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఔన్సుకు 4,200-4,600 డాలర్ల పరిధిలో కొనసాగవచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ తెలిపింది. సమీప కాలంలో ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, వచ్చే యేడాది తొలి అర్ధభాగంలో స్వల్పంగా పైవైపు మొగ్గు చూపవచ్చని అంచనా వేసింది. దేశీయంగా బంగారం ధరలు ఈ యేడాది మిగిలిన కాలంలో 10 గ్రాములకు రూ.1.40 లక్షల నుంచి రూ.1.60 లక్షల పరిధిలో ఉండొచ్చన్న తన అంచనాను బ్యాంక్ కొనసాగించింది. ఆగస్టులో బంగారం ధరలు దాదాపు 9 శాతం పెరిగాయి. అదే సెప్టెంబరులో ఇప్పటివరకు సుమారు 8 శాతం తగ్గాయి.
అమెరికా ద్రవ్య విధానంపై మారుతున్న అంచనాలు ఈ దిద్దుబాటుకు ప్రధాన కారణమని ఐసిఐసిఐ బ్యాంక్ తెలిపింది. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, పెరిగిన ముడిచమురు ధరలు, అంచనాల కంటే మెరుగ్గా వచ్చిన కార్మిక మార్కెట్ గణాంకాల నేపథ్యంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మరింత కఠిన వైఖరి అవలంభించవచ్చన్న అంచనాలు పెరిగాయని పేర్కొంది.ఈ పరిణామాలు స్వల్పకాలంలో బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చినప్పటికీ, దీర్ఘకాలికంగా బంగారానికి మద్దతునిచ్చే అంశాలు కొనసాగుతున్నాయని బ్యాంక్ తెలిపింది. బంగారం మార్కెట్‌కు పెట్టుబడిదారుల నిధులు రాక కీలక మద్దతుగా నిలుస్తోంది. ఆగస్టులో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి 17.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మూడో త్రైమాసికంలో గోల్డ్ ఇటిఎఫ్‌లకు సంబంధించిన డిమాండ్ 144.7 టన్నులకు చేరింది.




# క్షీణించిన ఫారెక్స్ ఖజానా

## 14.89 బిలియన్ డాలర్లు తగ్గిన భారత్ విదేశీ మారక నిల్వలు

**ముంబై, సెప్టెంబరు 26:** భారత విదేశీ మారక నిల్వలు సెప్టెంబరు 18తో ముగిసిన వారంలో భారీగా తగ్గాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దేశ విదేశీ మారక నిల్వలు 14.881 బిలియన్ డాలర్లు తగ్గి 765.901 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రధానంగా విదేశీ కరెన్సీ ఆస్తులు తగ్గడం ఇందుకు కారణమైంది. అంతకుముందు వారంలోనూ విదేశీ మారక నిల్వలు 4.924 బిలియన్ డాలర్లు తగ్గి 780.782 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 18తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సిఎ) 14.816 బిలియన్ డాలర్లు తగ్గి 630.980 బిలియన్ డాలర్లకు చేరాయి.

# 100% ఇ20తో నడిచే టయోటా ఇన్నోవా వచ్చేస్తోంది

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్‌పై చర్చ జరుగుతున్న సమయంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. 100 శాతం ఇథనాల్‌తో నడిచే టయోటా ఇన్నోవాను అక్టోబరులో లాంఛ్ చేయడానికి తనకు ఆహ్వానం అందిందని ఆయన తెలిపారు. గడ్కరీ చెప్పిన వివరాల ప్రకారం ఈ వాహనానికి అసలు పెట్రోల్ అవసరమే ఉండదు. ఇంకా ఇది 100 శాతం ఇథనాల్‌తోనే నడిచే ఫ్లెక్స్ ఫ్యూయెల్ వాహనంగా ఉంటుంది. కారు నడుస్తున్న సమయంలో 60 శాతం వరకు విద్యుత్ ఉత్పత్తి కూడా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కారు వినియోగ వ్యయం చాలా తక్కువ అని స్పష్టం చేశారు. పెట్రోల్ లీటరుకు రూ. 25 ఉన్నట్లుగా దీని నిర్వహణ ఖర్చు ఉంటుందని గడ్కరీ చెప్పారు. అయితే ఈ ఇంధనం పెట్రోల్ వద్ద మాత్రం ఉండదు. సాధారణంగా పెట్రోల్ ధరతో పోల్చి గడ్కరీ వేసిన అంచనా. టయోటా నుంచి అధికారికంగా ధర లేదా కిలో మీటరుకు ఖర్చు వివరాల్ని ఇంకా ప్రకటించలేదు. 100 శాతం ఇథనాల్ వాహన టెక్నాలజీపై టయోటా ఇప్పటికే పనిచేస్తోంది. 2023లో టయోటా ఇన్నోవా హైక్రాస్ ఆధారంగా ఎలక్ట్రిఫైడ్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది. ఈ వాహనం ఇ20 నుంచి 100 శాతం ఇథనాల్ వరకు వేర్వేరు ఇంధన మిశ్రమాలతో పనిచేసేలా రూపొందించారు. మరోవైపు ఇథనాల్‌ను ప్రోత్సహించడం వల్ల మొక్కజొన్న, చెరకు వంటి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని గడ్కరీ చెబుతున్నారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ తయారీ ద్వారా యుపి, బీహార్ రైతులకు రూ. 45 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇథనాల్ సహా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలను ప్రోత్సహించడం ద్వారా పెట్రోల్, డీజిల్‌పై ఆధారపడటాన్ని తగ్గించాలన్నది ప్రభుత్వ విధానంలో భాగంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.